కనులపండువగా కళా ఉత్సవం

ఒంగోలులోని రిమ్స్ మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో నిర్వహించిన జవహర్ నవోదయ రీజనల్ కళా ఉత్సవం ఘనంగా ముగిసింది. రెండు రోజులపాటు కనులపండువగా సాగింది. బుధవారం కేరళ, బెంగళూరు, బీజాపూర్, కర్నాటక, తూర్పుగోదావరి, విజయనగరం, మెదక్, కొట్టాయం జేఎన్‌వీ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, సంప్రదాయ వేషధారణలు ఆదుర్స్ అనిపించాయి. మట్టితో తయారు చేసిన ప్రముఖుల ప్రతిమలు, చిత్రలేఖనం, క్రాఫ్ట్ బొమ్మలు ఆకర్షణగా నిలిచాయి.

7


ఎం. సుధాకర్


జి.ఈశ్వరమ్మ


గుంటగాని భాస్కర్‌రావు


బి.సరోజినీదేవి

నలుగురికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

- వారిలో ఒకరు హెచ్‌ఎం, ముగ్గురు స్కూలు అసిస్టెంట్లు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన నలుగురు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 78 మందిని ఈ అవార్డులకు ఎంపిక చేయగా మన జిల్లా నుంచి వీరికి అవకాశం దక్కింది. వారిలో ఒక హైస్కూలు హెచ్‌ఎం, ముగ్గురు స్కూలు అసిస్టెంట్లు ఉన్నారు. తర్లుపాడు జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం ముత్తోజి సుధాకర్, తంగెళ్ల జడ్పీ హైస్కూలు హిందీ స్కూలు అసిస్టెంట్ గుంటగాని భాస్కరరావు, పీసీపల్లి జడ్పీ హైస్కూలు సోషల్ స్కూలు అసిస్టెంట్ జి.ఈశ్వరమ్మ, వెలిగండ్ల మండలం మొగళ్లూరు జడ్పీ హైస్కూలు పీఎస్ స్కూలు అసిస్టెంట్ బి.సరోజనీదేవి రాష్ట్ర అవార్డులకు ఎంపికైన వారిలో ఉన్నారు. శుక్రవారం విజయవాడ లయోలా కళాశాలలో జరిగే గురుపూజోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని పాఠశాల విద్య డైరెక్టర్ నుంచి వీరికి సమాచారం అందింది.

జిల్లాస్థాయి అవార్డులకు 53 మంది ఎంపిక : 6లో





పొగాకు మార్కెట్లో అనిశ్చితి

అధిక ఉత్పత్తి కొనుగోళ్లపై తేల్చని కేంద్రం

దక్షిణాది పొగాకు మార్కెట్లో అనిశ్చితి నెలకొంది. నిన్నమొన్నటి వరకు ధరల సమస్యతో రైతులు సతమతమయ్యారు. ఇప్పుడు అధికంగా జరిగిన పంట ఉత్పత్తి కొనుగోలుపై అయోమయం నెలకొంది. ఎలా ముందుకు పోవాలన్నది అర్థంకాక పొగాకు బోర్డు అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. వారికి తగు సూచనలు ఇవ్వాల్సిన కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ నుంచి స్పష్టత కరువైంది. ఈ ప్రాంతంలో ఉన్న 11 వేలం కేంద్రాలలో ఇప్పటికే ఐదుచోట్ల అధికారిక కొనుగోళ్లు పూర్తయ్యాయి. అధిక ఉత్పత్తి కొనుగోలుపై స్పష్టత రాక వాటిలో వేలం ప్రక్రియ నిలిచిపోయింది. ఈ వారంలో మరో రెండు కేంద్రాల్లోనూ అదే పరిస్థితి ఏర్పడనుంది. మరోవైపు వచ్చే సీజన్ పంట సాగుకు సమయం సమీపిస్తోంది. అయితే ఇంకా ప్రస్తుత సీజన్ పంటలో 40శాతం మేర పొగాకు ఇళ్ల వద్దనే మిగిలిపోయింది. దీంతో ఇటు రైతులు, అటు బోర్డు అధికారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఒంగోలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పొగాకు సాగు పూర్తిగా బోర్డు నియంత్రణలోనే సాగుతోంది. రెండేళ్లుగా కాస్తంత మంచి ధరలు లభించడం, ఇతర పంటలకు వాతావరణం అనుకూలించకపోవడం, ఇతరత్రా కారణాలతో రైతులు ప్రస్తుత సీజన్ (2024-25)లో భారీగా పొగాకు సాగు చేశారు. తదనుగుణంగా పంట ఉత్పత్తి కూడా పెరిగింది. దక్షిణాదిలోని ప్రకాశం, నెల్లూరు జిల్లాలో ఉన్న 11 వేలం కేంద్రాల పరిధిలో 104.60 మిలియన్ కిలో ఉత్పత్తికి బోర్డు అనుమతించింది. అయితే ఈ ప్రాంతంలో పంట సాగు భారీగా జరిగి సుమారు 158.60 మిలియన్ కిలోలు ఉత్పత్తి అయినట్లు బోర్డు అధికారులు అంచనాకు వచ్చారు. మార్చి 10 నుంచి రెండు దశల్లో కొనుగోళ్లు ప్రారంభించారు. ఇప్పటివరకు సుమారు 93.72 మిలియన్ కిలోల పొగాకును వ్యాపారులు కొనుగోలు చేశారు. సగటున కిలోకు రూ.236.83 ధర లభించింది. ఏటా వంద రోజుల్లో వేలం ప్రక్రియ ముగించాలని పొగాకు బోర్డు ఎప్పటికప్పుడు లక్ష్యంగా పెట్టుకుంటుండగా ఒక నెల అటుఇటుగా

మిగతా 6వ పేజీలో

- ఐదు కేంద్రాల్లో నిలిచిన వేలం
- ఇంకా రైతుల ఇళ్ల వద్దనే 40శాతం పంట
- ముంచుకొస్తున్న సాగు సమయం
- ఇప్పటికే ప్రారంభమైన ఈ సీజన్ రిజిస్ట్రేషన్లు
- పలుచోట్ల నారుమళ్లు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

పరిశ్రమలకు రూ.3.25 కోట్ల రాయితీ మంజూరు

- కలెక్టర్ అన్సారియా వెల్లడి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ పరిశ్రమలకు చెందిన 149 క్లెయిమ్‌లకు రూ.3.25 కోట్ల రాయితీని మంజూరు చేసినట్లు కలెక్టర్ అన్సారియా తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు అనుమతుల కోసం సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను గడువు తేదీ వరకు వేచి ఉండకుండా త్వరగా మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ర్యాంప్ పథకంపై జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. పీఎంఈజీపీ ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు వచ్చిన దరఖాస్తులను వెంటనే బ్యాంకులకు పంపించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఒక కుటుంబం-ఒక పారిశ్రామిక వేత్త కార్యక్రమానికి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి శ్రీనివాసరావు, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, నాబార్డు డీడీఎం రవికుమార్, ఎల్‌డీఎం రమేష్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



7

శరవేగంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు

- మర్రిపూడికి మణిహారం
- రూపురేఖలు మారనున్న గ్రామసీమలు



ఏకదంతుడు ధగధగ

వినాయక నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా నగరంలోని గాంధీరోడ్డులో గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాన్ని బుధవారం బంగారం, వెండి ఆభరణాలతో అలంకరించారు. 108 రకాల ప్రసాదాలను స్వామికి నివేదించారు.
- ఆంధ్రజ్యోతి, ఒంగోలు


డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లను పునఃపరిశీలిస్తున్న అధికారులు

డీఎస్సీ సర్టిఫికెట్ల పునఃపరిశీలన

- పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ అభ్యర్థుల ఎంపికలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ పటిష్ఠ చర్యలు చేపట్టింది. అపోహలకు తావు లేకుండా అభ్యర్థులు సమర్పించిన ధ్రువపత్రాలను మరోసారి పరిశీలించాలని పాఠశాల విద్య డైరెక్టర్ ఆదేశించారు. దీంతో ఆ ప్రక్రియను డీఈవో కిరణ్‌కుమార్ బుధవారం స్థానిక సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ప్రారంభించారు. మొదటి, రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అధికారులను పిలిపించి మళ్లీ వారితోనే మరోసారి వెరిఫై చేయిస్తున్నారు. మొదటి విడతలో 657మంది అభ్యర్థులకు 652మంది సర్టిఫికెట్లను పరిశీలించారు. మిగిలిన ఐదుగురిలో ముగ్గురు ఈ పోస్టులకు వచ్చేందుకు తిరస్కరించారు. మరో ఇద్దరికి సకాలంలో బీఈడీ సర్టిఫికెట్లు అందకపోవడంతో వారిని అనర్హులుగా ప్రకటించారు. రెండో విడత 19మంది పరిశీలనకు హాజరయ్యారు. కాగా పత్రాలలో ఎటువంటి తప్పులు లేవని ఈ బృందాలు మరోసారి పరిశీలించి ధ్రువీకరించాల్సి ఉంది. ఆన్‌లైన్‌లోని అభ్యర్థుల సర్టిఫికెట్లు, వారు సమర్పించిన వాటి నకళ్లను పరిశీలిస్తున్నారు. ఇదే సమయంలో మంగళగిరిలోని పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయంలో అభ్యర్థుల తుది ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది.

తండ్రి ఆత్మహత్య.. ముగ్గురు బిడ్డలు అదృశ్యం

- తెలంగాణ రాష్ట్రం పెద్దాపూర్ సమీపంలో ఆయన మృతదేహం లభ్యం
- మృతుడు ఎర్రగొండపాలెం మండలం బోయలపల్లి వాసి
- సీసీ ఫుటేజీ ఆధారంగా శోధిస్తున్న పోలీసులు

7

రిమ్స్‌కి మరో 30 ఎంబీబీఎస్ సీట్లు

- మంజూరు చేసిన జాతీయ వైద్య మండలి
- ఇకపై 150 మంది వైద్య విద్యార్థులకు అవకాశం

6

ఉసురు తీసిన అప్పులు

- పాలుట్లగూడెంలో వృద్ధ గిరిజన రైతు ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అప్పులు జిల్లాలో మరో రైతు ప్రాణం తీశాయి. ఎర్రగొండపాలెం మండలంలోని నల్లమల అటవీ ప్రాంతమైన పాలుట్ల గూడేనికి చెందిన దేశావత్ రాములు నాయక్ (69) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. నాయక్ గూడెంలోని నాలుగు ఎకరాల్లో మిర్చి, పత్తి సాగు చేశాడు. పంటలు సక్రమంగా పండకపోవడం, ధరలు లేకపోవడంతో నష్టపోయాడు. సుమారు రూ.6లక్షల మేర అప్పులు మిగిలాయి. వాటిని తీర్చలేక గత కొద్ది రోజులుగా రాములు నాయక్ తీవ్ర మనోవేదనలో ఉన్నారు. బుధవారం ఇంటిలోనే గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎర్రగొండపాలెం ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. రాములు నాయక్‌కు భార్య, ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. అందరికీ వివాహమైంది.

ఆర్థిక సంఘం నిధులొచ్చాయ్!

- జిల్లాలో 729 గ్రామ పంచాయతీల ఖాతాలకు రూ.41.98 కోట్లు జమ
- తాగునీరు, పారిశుధ్యానికి ప్రాధాన్యం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. దీంతో అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. గత కొంత కాలంగా పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో చిన్న పని చేపట్టాలన్నా కష్టతరంగా మారింది. పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు 2024-25 సంవత్సరానికి సంబంధించి రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,120 కోట్లను విడుదల చేసింది. వీటి



ని పంచాయతీ, జిల్లా మండల పరిషత్ ఖాతాలకు నేరుగా జమ

మిగతా 6వ పేజీలో



మృతి చెందిన భార్యాభర్త కొండమ్మ, రాజు (ఫైల్)

మృత్యువులోనూ వీడని బంధం

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

- ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధం
- ముందురోజు సరుకుల కోసం వెళ్తుండగా విషాదం
- అన్నసముద్రం మెట్ట వద్ద ఘటన

6

'మహిళా మార్ట్ మూత'పై విచారణ

- లెక్కలు తేల్చి రికవరీ దిశగా చర్యలు
- బాధ్యుల్లో మొదలైన కలవరం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పొదుపు సంఘాల భాగస్వామ్యంతో ఒంగోలులో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ మూసివేతపై మెప్మా అధికారులు స్పందించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన 'మహిళా మార్ట్ మూత' కథనంపై పీడీ శ్రీహరి విచారణకు ఆదేశించారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చిలో జరిగిన క్రయ, విక్రయాలు, వ్యయం తదితర అంశాలతోపాటు, స్టాక్ రిజిస్టర్లు అందజేయాలని ఆయన సంబంధిత ఉద్యోగులకు సూచించినట్లు సమాచారం. మార్ట్ నిధులు కాజేసిన వారిలో మార్కెటింగ్ అధికారి, ప్రస్తుత సీఎంఎం-2 తమకేమీ తెలియదని

మిగతా 6వ పేజీలో

బంగారం గొలుసుల దొంగ అరెస్టు

● 200 గ్రాముల స్వాధీనం ● నిందితుడు డెలివరీ బాయ్..

ఒంగోలు క్రైం, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మహిళల మెడల్లో బంగారం గొలుసులు చోరీ చేసే తాళ్ళూరి రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసి 200 గ్రాములు (రూ.20లక్షలు విలువైన) ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ సీఐ జగదీష్ తెలిపారు. బుధవారం ఉదయం అనుమానాస్పదంగా ఒంగోలులోని ఐటీఐ కాలేజీ వద్ద ఉన్న నిందితుడిని తాలుకా పోలీసులతో కలిసి సీసీఎస్ బృందం అరెస్టు చేసినట్లు చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ జగదీష్ తెలిపిన వివరాల మేరకు.. నిందితుడు డెలివరీ బాయ్‌గా పనిచేస్తుంటాడు. అయితే ఒక్కసారిగా పెద్దమొత్తంలో సంపాదించాలనే అత్యాశతో చైన్‌స్నాచింగ్‌కు దిగాడు. మొదట్లో బాపట్లలో రెండుసార్లు ప్రయత్నించి విఫలమయ్యాడు. ఆ తర్వాత వరుసగా గుంటూరు, పల్నాడు బాపట్ల, ప్రకాశం జిల్లాలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. ఆ బంగారాన్ని ఓ ఫైనాన్స్ సంస్థలో తాకట్టు పెట్టేవాడు. గత జూలై నెల 18న మంగమూరురోడ్డు లేడీస్ హాస్టల్ వద్ద మహిళ మెడలో బంగారం గొలుసు అపహరించి దొంగ పరారయ్యాడు. ఈమేరకు ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈమేరకు దర్యాప్తు చేపట్టిన సీసీఎస్ పోలీసులు రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ఒంగోలుతోపాటుగా వినుకొండ, చీరాల, బాపట్లలో దొంగతనం చేసినట్లు అంగీకరించాడని తెలిపారు. ఈ కేసులో దొంగను పట్టుకున్న పోలీసులను ఎస్పీ ఏఆర్.దామోదర్ అభినందించారు. దొంగిలించిన సొత్తు రికవరీ చేసిన వారిలో తాలుకా సీఐ విజయకృష్ణ, ఎస్‌ఐ ఫిరోజ్, సీసీఎస్ ఎస్సై వి.వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఐ టి.బాలాంజనేయులు, కానిస్టేబుల్ కె.రవి, సీహెచ్.అంజిబాబు, పి.రఘు ఉన్నారని సీఐ తెలిపారు.

మృత్యువులోనూ వీడని బంధం

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

ఉపాధి పనులకు హైదరాబాద్ సిద్ధం

ముందురోజు సరుకులు తెచ్చుకొనేందుకు వెళ్తుండగా ఘటన

త్రిపురాంతకం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఒక్కరోజు గడిస్తే ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లి బేల్దారి పనిచేసి నాలుగు రూపాయలు కూడబెట్టుకుని ఇంటికి రావాలనుకున్న ఆ దంపతులను మృత్యువు కాటేసింది. రోడ్డు ప్రమాదం ఇద్దరినీ బలితీసుకుంది. త్రిపురాంతకం మండలం అన్నసముద్రం మెట్ట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హృదయవిదారక విషయమిది. పాత అన్న సముద్రం గ్రామానికి చెందిన పచ్చిగొర్ల సాల్మన్‌రాజు (32) భార్య కొండమ్మ (26)తో కలిసి త్రిపురాంతకం బయలుదేరారు. త్రిపురాంతకంలో సరుకులు తెచ్చుకుని మరుసటిరోజు హైదరాబాద్ వెళ్లి బేల్దారి పనులు చేసుకునేందుకు సాల్మన్‌రాజు సిద్ధమైనట్లు బంధువులు తెలిపారు. ఈ క్రమంలో మోటార్ సైకిల్‌పై బయలుదేరి అన్న సముద్రం మెట్ట వద్ద హైవే ఎక్కిన తర్వాత త్రిపురాంతకం వైపు వెళుతుండగా వినుకొండ వైపు వెళుతున్న నాలుగు చక్రాల ఆటో వారిని బలంగా ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. వీరికి ఇద్దరు పిల్లలు దయాసాగర్, అమ్ములు చిన్నవయసు కావడంతో వారి ఆలనా పాలనా చూసుకునే బాధ్యత ఎవరిదండటూ బంధువుల రోదనతో ఆప్రాంతం నిండిపోయింది. ఘటన విషయం తెలుసుకుని సీఐ అస్సాన్, ఎస్‌ఐ శివ బసవరాజు, సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గర్భిణులు, చిన్నపిల్లలకు మందుల పంపిణీలో అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్యశాలల్లో గర్భిణులు, చిన్న పిల్లలకు మందుల పంపిణీ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం జిల్లా క్వాలిటీ అస్యూరెన్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా, ఏరియా వైద్యశాలలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన విధంగా ఉండాలన్నారు. ప్రధానంగా ఓపీ, లేబర్ రూము చిన్నపిల్లలు, గర్భిణులకు వార్డురూములో ఇచ్చేమందుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణులకు నాణ్యమైన వైద్యసేవలు అందించడంతోపాటు మాతృమరణాలను నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కలెక్టర్ చేతుల మీదుగా 27 మంది వైద్యాధికారులకు, ఎంఎల్‌హెచ్‌పీలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. క్వాలిటీ టీం జిల్లా మేనేజర్ కృష్ణప్రసాద్, మురళీకృష్ణ.. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ శ్రీనివాసనాయక్, కో ఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రోగ్రామ్ అధికారులు ఉన్నారు.

పొగాకు మార్కెట్‌లో అనిశ్చితి

(5వ పేజీ తరువాయి)

సాగుతోంది. అయితే ఈ సీజన్‌లో కొనుగోళ్లు ప్రారంభించి ఆరు నెలలు పూర్తి కావస్తున్నా 60శాతం పంట మాత్రమే ఇప్పటి వరకు కొనుగోలు జరిగింది. పండిన పంటలో ఇంకా 40శాతం రైతుల ఇళ్ల వద్దనే నిల్వ ఉంది.

అపరాధం రెండు సీజన్లు రద్దు

మార్కెట్ ఆరంభంలో కొంత ధరలు బాగున్నప్పటికీ అనంతరం సరిలేక చాలాచోట్ల వేలం ప్రక్రియ వేగం పుంజుకోలేదు. ధరల సమస్య ఇప్పటికీ వెంటాడుతోంది. తాజాగా అధిక పంట కొనుగోళ్ల సమస్య ఎదురైంది. పొగాకు పంట బోర్డు నియంత్రణలో సాగు చేసేది కనుక అనుమతి ఇచ్చిన మేరకే పంట సాగు, ఉత్పత్తి చేయాలి. దానికన్నా 10శాతం వరకు అధికంగా ఉత్పత్తి అయితే వాతావరణ మార్పులో అలా జరగవచ్చు కనుక కొనుగోలు చేస్తారు. అంతకు మించితే అధిక ఉత్పత్తిపై పొగాకు బోర్డు జరిమానా వేస్తుంది. పంట ఉత్పత్తి నియంత్రణ కోసం అలా చేస్తుంది. గతంలో ఒకప్పుడు ఈ పెనాల్టీలు 15శాతం వరకు ఉండేవి. అనంతరం ఒకసారి పది శాతానికి, తర్వాత 7.5 శాతానికి తగ్గించారు. మూడేళ్ల క్రితం పంట ఉత్పత్తి సరిలేకపోవడం, ధరలు కూడా ఆశాజనకంగా లేకపోవడం, ఎక్కువ మంది పరిమితికి లోబడే పండించగా కొద్దిమంది మాత్రమే అధికంగా ఉత్పత్తి చేయడంతో అపరాధ రుసుంను రద్దు చేశారు. తొలుత కర్ణాటకలో రద్దుచేయగా అనంతరం మన రాష్ట్రంలోనూ అమలు చేశారు. అలా రెండేళ్లుగా అదనపు పంటకు అపరాధ రుసుం లేకుండానే కొనుగోళ్లు సాగుతున్నాయి.

దక్షిణాదిలో 51శాతం అదనంగా..

ప్రస్తుత సీజన్ (2024-25)లో రాష్ట్రంలో భారీగా పంట ఉత్పత్తి పెరిగింది. 167 మిలియన్ కిలోలకు అనుమతి ఇవ్వగా సుమారు 235 మిలియన్ కిలోల దిగుబడి వచ్చినట్లు అంచనా. అందులో దక్షిణాదిలో 104.60 మిలియన్ కిలోలకు అనుమతి ఇస్తే సుమారు 158.60 మిలియన్ కిలోలు ఉత్పత్తి అయినట్లు బోర్డు అధికారులు భావిస్తున్నారు. అంటే బోర్డు అనుమతి ఇచ్చిన దాని కన్నా రాష్ట్రంలో 40శాతం అధికంగా ఉత్పత్తి అయ్యింది. దక్షిణాదిలో దాదాపు 51శాతానికిపైగా పెరిగింది. దీంతో మార్కెట్లో డిమాండ్ తగ్గి ధరలు సరిగా లభించలేదు. దాని వల్ల రైతులు నష్టపోవడమే కాక వేలం ప్రక్రియలో కూడా జాప్యం జరిగింది. తరుచూ ఒడిదొడుకులు కూడా ఎదురయ్యాయి. దీంతో కేంద్రప్రభుత్వం పంట నియంత్రణ కోసం బోర్డు అధికారులపై ఒత్తిడి తెచ్చి మళ్లీ పెనాల్టీలు విధించాలని సూచించింది. ఈ నేపథ్యంలో నెలన్నర క్రితం బోర్డు అధికారులు ఈ అంశంపై పొగాకు బోర్డు సమావేశంలో చర్చించి అధిక ఉత్పత్తి వల్ల నష్టాలను రైతులకు కూడా వివరించి వారి అభిప్రాయాలను తీసుకొని కేంద్రానికి నివేదించాలని నిర్ణయించారు.

కేంద్రం నుంచి స్పష్టత కరువు

దక్షిణాది రైతులు ఈ ఏడాది ధరలు లేక నష్టపోయే పరిస్థితులు ఉన్న దృష్ట్యా పెనాల్టీలు వద్దని, తప్పనిసరి అయితే రెండుశాతం విధించాలని ఆయా సమావేశాల్లో బోర్డును కోరారు. ఉత్తరాది ప్రాంత రైతులు మాత్రం ఫెనాల్టీలు గట్టిగానే వేయాలని అభిప్రాయపడినట్లు సమాచారం. ఈ మొత్తం అంశాలపై పొగాకు బోర్డు అధికారులు కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖకు నివేదించారు. అధిక పంట కొనుగోళ్లపై తగు సూచనలు ఇవ్వాలని కోరారు. ఇది జరిగి నెల దాటిపోయినా కేంద్రం నుంచి ఎలాంటి సూచనలు రాలేదు. ఈలోపు దక్షిణాదిలోని కందుకూరు-1, కందుకూరు-2, కలిగిరి, డీసీపల్లి, కనిగిరిలలో అనుమతి ఇచ్చిన మేర పంట కొనుగోళ్లు పూర్తయ్యాయి. అధిక ఉత్పత్తి కొనుగోళ్లపై స్పష్టత లేక తదుపరి వేలంను ఆ కేంద్రాలలో పొగాకు బోర్డు అధికారులు నిలిపివేశారు.

పశ్చిమ ప్రాంతంలో త్వరలో నాట్లు

ప్రస్తుతం మిగిలిన ఆరు కేంద్రాల్లో మాత్రమే కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఈ వారంలో ఒంగోలు1,2 కేంద్రాల్లోనూ అనుమతించిన పంట కొనుగోళ్లు పూర్తయ్యి వాటిలోనూ వేలం ఆపేసే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు వచ్చేసీజన్ (2025-26) పొగాకు సాగుకు సంబంధించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. పలుచోట్ల నారుమడులు కూడా పోశారు. ఈ నెల రెండో సక్షం నుంచి పశ్చిమ ప్రాంత గ్రామాల్లో వచ్చే సీజన్ పొగాకు నాట్లు ప్రారంభంకానున్నాయి. ఈ పరిస్థితుల్లో కేంద్రం ఇంకా జాప్యం చేస్తే రైతుల వద్ద ఉన్న 40శాతం పంట కొనుగోళ్లు ఎప్పటికి పూర్తవుతాయన్న ఆందోళన అటు బోర్డు అధికారులు, ఇటు రైతుల్లో వ్యక్తమవుతోంది.

'మహిళా మార్ట్ మూత'పై విచారణ

(5వ పేజీ తరువాయి)

బుకాయిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఆయనపైనా విచారణకు సిదమైనట్లు సమాచారం. ముందస్తుగా నోటీసులు జారీచేసి వివరణ కోరనున్నారు. ఆ తర్వాత పొదుపు సంఘాలు చెల్లించిన రూ.1,500, సరుకుల కొనుగోలు బిల్లులు, రోజువారీ కలెక్షన్ తదితర అంశాలపైనా దృష్టి సారించారు. అయితే అధికారులకు ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు మార్ట్‌లో భారీగానే గోల్‌మాల్ జరిగినట్లు అంచనాకు వచ్చారు. ఇందులో భాగస్వాములైన వారిని గుర్తించడం కోసం విచారణ కమిటీని నియమించడంతోపాటు వారి నుంచి దోచుకున్న సొమ్మును రికవరీ చేసే దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిసింది. మొత్తంగా మార్ట్‌లో లెక్కలన్నీ తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు మెప్మా అధికారులు సిద్ధమయ్యారు. దీంతో నిధులు సొంతానికి కాజేసిన కొందరు ఉద్యోగుల్లో భయం నెలకొంది.

ఆర్థిక సంఘం నిధులొచ్చాయ్!

(5వ పేజీ తరువాయి)

చేసింది. ఈ నిధులను ఏఏ అవసరాలకు వినియోగించాలో స్పష్టంగా పేర్కొంది.

వేగవంతం కానున్న అభివృద్ధి పనులు

జిల్లావ్యాప్తంగా 729 గ్రామపంచాయతీల ఖాతాల్లో రూ.41.98 కోట్లు జమయ్యాయి. అందులో 50శాతం నిధులను తాగునీటికి, పారిశుధ్యంకు వినియోగించాలి. మిగిలిన 50శాతం నిధులను వివిధ రకాల అభివృద్ధి పనులకు వినియోగించుకునేందుకు ప్రభుత్వం స్పష్టంగా ఆదేశించింది. ఇప్పటికే స్వచ్ఛాంధ్రలో భాగంగా పారిశుధ్యంపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నెలలో ఒక శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడంతో గ్రామ పంచాయతీల్లో పలురకాల అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. ప్రస్తుతం విడుదల చేసిన నిధులను ఒక్కో పంచాయతీకి స్థాయిని బట్టి రూ.80వేల నుంచి రూ.10 లక్షల వరకు నగదు జమ కానుంది.

చంద్రబాబు, పవన్‌కు కృతజ్ఞతలు

- బెజవాడ శ్రీరామమూర్తి, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు

గ్రామపంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు. గత ఆరు నెలల నుంచి ఆర్థిక సంఘం నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయడంతో పలురకాల అభివృద్ధి పనులు చేసేందుకు అవకాశం ఏర్పడింది.

ఉత్తమ ఉపాధ్యాయులు 53 మంది

● జిల్లాస్థాయి అవార్డులకు ఎంపిక ● జాబితాకు కలెక్టర్ ఆమోదముద్ర

ఒంగోలు విద్య, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో 53 మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేశారు. జిల్లాస్థాయి కమిటీ ఎంపిక చేసిన ఈ జాబితాకు కలెక్టర్ తమీమ్ అన్సారియా బుధవారం ఆమోదముద్ర వేశారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారిలో 10మంది ప్రధానోపాధ్యాయులు, 20 మంది స్కూలు అసిస్టెంట్లు, 23 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు. జిల్లాలో 60మందిని ఈ అవార్డులకు ఎంపిక చేయాల్సి ఉంది. వీరిలో 10మంది హెచ్ఎంలు, 20 మంది ఎస్ఏలు, 30 మంది ఎస్‌జీటీలను ఎంపికచేయాల్సి ఉండగా ఎస్‌జీటీ నుంచి 23మంది మాత్రమే దరఖాస్తు చేయడంతో వారిని మాత్రమే ఎంపిక చేశారు. స్కూలు అసిస్టెంట్ల విభాగంలో 33 మంది దరఖాస్తు చేయగా వీరిలో 20 మందిని ఎంపిక చేసి మిగిలిన 13 మందిని తిరస్కరించారు. ఎస్‌జీటీలకు కేటాయించిన 30 అవార్డుల్లో 23 మంది ఎంపిక కాగా ఏడు అవార్డులు మిగిలిపోయాయి.

అవార్డులకు ఎంపికైన వారి వివరాలు

● **హెచ్ఎంల విభాగం :** ఎం.సిద్ధేశ్వరశర్మ(జడ్పీహైస్కూలు గిద్దలూరు), వైఎస్ఆర్‌కే ప్రసాద్(తూర్పుగంగవరం), మన్నం శ్రీదేవి (బేస్తవారపేట), పి.మహబూబ్‌ఖాన్(పెదకండ్లగుంట), జి.సంజీవి(కనిగిరి), ఆర్.మలకొండయ్య(కంభాలదిన్నె), వి.సుబ్బారెడ్డి(గంజివారిపాలెం), టి.పెద్దిరెడ్డి(చాకిచర్ల), సీహెచ్.చెంచుపున్నయ్య(ఈతముక్కల), ఎల్‌డీఎస్.రమేష్(వినోదరాయునిపాలెం).

● **స్కూలు అసిస్టెంట్ల విభాగం:** వి.కొండయ్య(జడ్పీహైస్కూలు గజ్జలకొండ), టి.ఇందిరా ప్రియదర్శిని (హెచ్.నిడమానూరు), బీవీ.పద్మావతిదేవి(హెచ్‌సీఎం/జూనియర్, ఒంగోలు), జి.సరోజ(జడ్పీ, ముక్తినూతలపాడు), ఎం.శ్రీనివాసులు(చిన్నదోర్నాల), ఎం.సురేష్(కురిచేడు), ఎస్‌వీఎల్.నారాయణ(గోళ్ళపల్లి), ఎస్‌కే.కబీర్ (తంగేళ్ళ), జి.వెంకటేశ్వర్లు(దిరిశగుంటపేట), ఎస్.యామిని(జడ్పీప్లస్, దేవరపాలెం), డి.సుధాకరరావు(ప్రభుత్వ హైస్కూలుప్లస్, మైనంపాడు), డి.విజయానంద్ (జడ్పీ, పాకల), ఎ.రవికిరణ్‌కుమార్ (కె.ఉప్పలపాడు), ఎ.శ్రీనివాసులు(శానికవరం), టి.శ్రీనివాసప్రసాద్(ఎంపీయూపీఎస్, నెన్నూరుపాడు), వైవీ.సుబ్బారావు(జడ్పీ, నల్లమడుగు), రమావత్‌నాగేశ్వరనాయక్(జడ్పీ), పి.సుభాషిణి(ఎంపీయూపీఎస్, కలికవాయి), జి.మల్లికార్జున(జడ్పీ, ఈస్ట్ వెంకటాపురం).

● **సెకండరీ గ్రేడ్ విభాగం:** డి.వెంకటేశ్వర్లునాయక్ (ఎంపీయూపీఎస్, మల్లవరం), ఎం.సుబ్బారావు(ఎంపీపీఎస్, గోపానిపల్లి), వి.స్వాతి(పొట్లపాడు), ఎం.శ్రీనివాసరావు(కరవది), కె.కోటేశ్వరరావు(చౌడవరం), బి.అంజినాయక్(పెద్దన్నపాలెం), జె.యాకోబు(చీమకుర్తి), సీహెచ్.జ్యోతిర్మయి(వెంగాయపాలెం), బీఎన్.సురేష్‌బాబు(వెలిగండ్ల), ఎస్.భూలక్ష్మి(ఎంపీయూపీఎస్, తాటకులపాలెం), వి.చక్రధరి(ఎంపీపీఎస్,యర్రఒబనపాలెం), బి.అనసూయ(రాజంపల్లి), ఆర్.ప్రభావమ్మ(విరాట్‌నగర్, పొదిలి), వెన్నా చిన్నవెంకటేశ్వర్లు(ఓబులక్కపల్లి), వి.రమేష్ (చింతగుంట్ల), దొడ్డా పావని(పెద్దారవీడు), జి.వెంకటగోపాలయ్య(చినకంభం), ఉ.సత్యఅనసూయ(గోపానిపల్లి), టి.అంకయ్య(జడ్పీహెచ్ఎస్, కొత్తపట్నం), ఎ.బ్రహ్మయ్య(ఎంపీపీఎస్, బింగినపల్లి), జె.భారతి(అంకాపల్లి), పి.శ్రీరామశెట్టి(పుచ్చకాయపల్లి), కె.వెంకటేశ్వరరావు(పోతవరం) ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు.



ప్రవహిస్తున్న సగిలేరువాగు (ఇన్‌సెట్‌లో) సగిలేరువాగును పరిశీలిస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామారావు, ఇరిగేషన్ సిబ్బంది

పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలతో గిద్దలూరు ప్రాంతంలో వాగులు, వంకలు ఏకమయ్యాయి. దీంతో భూగర్భజలాలు పెరిగి తాగు, సాగునీటి సమస్యలు తీరుతాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని చెరువులు, వాగులు, వంకలు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి సగిలేరువాగు ప్రవహిస్తున్నది. నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన వర్షాలకు కొండ నుంచి వర్షం నీరు ప్రవహిస్తూ దిగువమెట్ల, కేఎస్‌పల్లె, ఉప్పలపాడు, కొండపేట ప్రాంతాల మీదుగా వెళ్లి సగిలేరు పూర్తిగా నిండి గిద్దలూరు దాటి ప్రవహిస్తున్నది. సగిలేరువాగు పరిస్థితిని గిద్దలూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ రామారావు, ఏఈఈ సురేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బొర్రా శేఖర్, శ్రీనివాసరెడ్డి, ఒఎస్ అబ్రహం పరిశీలించారు. వాగు ఉధృతి వస్తే పరిస్థితిని ఎదుర్కోవడానికి అధికారులు సిద్ధంగా ఉన్నట్లు డీఈ తెలిపారు. మండలంలోని అన్ని చెరువులు కురుస్తున్న వర్షాలకు నీరు చేరుతున్నది. ముండ్లపాడులో ఓబులపతి చెరువు, కంచుపల్లెలోని రంగారెడ్డిపల్లె చెరువులు, మండలంలోని ఇంకా పలు చెరువులకు నీరు చేరుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చీరాలలో రాజకీయ ఫ్లెక్సీల రగడ

పట్టణంలోని వైఎస్ విగ్రహం వద్ద ముందుగా వైసీపీకి చెందిన ఫ్లెక్సీ ఏర్పాటు

వర్ధంతి కార్యక్రమాలకు అడ్డుగా ఉందని ఆ పార్టీలోనే మరో వర్గం.. అధికారులకు ఫిర్యాదు

కాకరేపుతున్న అధికార పార్టీ ఫ్లెక్సీలు



వైసీపీ ఫ్లెక్సీను తొలగిస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది

చీరాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీల రగడ రాజుకుంటోంది. చీరాల పట్టణంలో వైసీపీ ఫ్లెక్సీల వివాదం చోటుచేసుకోగా, వేటపాలెంలో అధికార పార్టీ పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చర్చనీయాంశమయ్యాయి. వైఎస్ వర్ధంతికి సంబంధించి రెండు రోజులు ముందుగానే పట్టణంలోని ఏడో వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు పేర్లి నాని గడియార స్తంభం కూడలిలోని రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వేడుకలు జరుపుకునేందుకు విగ్రహానికి ఫ్లెక్సీ అడ్డుగా ఉందని, వెంటనే తొలగించాలని వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు వాసుమళ్ల వాసు, పట్టణ అధ్యక్షులు యాతం మధుకర్(మేరీబాబు) మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు వెంటనే ఆ ఫ్లెక్సీను తొలగించారు. ఈ చర్యతో అంతర్గతంగా చీరాల వైసీపీలో కుమ్ములాటలు బహిర్గతమయ్యాయి.

వేటపాలెంలో శ్రుతి మించిన ఫ్లెక్సీలు

వేటపాలెం మండలంలో పలుచోట్ల అధికార పార్టీకు చెందిన ఫ్లెక్సీలపైనా ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్యాడర్‌తో సంబంధంలేని వ్యక్తులు ఎమ్మెల్యే కొండయ్య, పార్టీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్‌లు బొమ్మలను చిన్నవిగా ముద్రించి ఓ వ్యక్తి తన ఫొటోను పెద్దవిగా పెట్టించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఆ పార్టీలో కాకరేపాయి. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వ్యక్తికి పార్టీ మూలాలకు కూడా సంబంధం లేదని టీడీపీ సీనియర్ నాయకులు చెబుతున్నారు. పైగా ఆ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వ్యక్తి గత ఎంఎల్‌సీ ఎన్నికల ప్రచార సమయంలో టీడీపీ వేసుకున్న టెంట్లపై విరుచుకుపడి వాటిని ధ్వంసం చేసినట్లు సమాచారం. అటువంటి వారు నేడు అధికార పార్టీతో చేతులు కలపడంతో పాటు ప్రజా ప్రతినిధులను మించి ఫ్లెక్సీలు వేయించుకోవడం చర్చనీయాంశమైంది.

మహిళా సంక్షేమమే ధ్యేయం

● స్త్రీ శక్తి కృతజ్ఞతా ర్యాలీలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి



పట్టణంలో సాగుతున్న మహిళల ర్యాలీ

మార్కాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహిళల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సక్సెస్ కావడంతోపాటు స్త్రీ శక్తి పథకం విజయవంతంపై బుధవారం మహిళలు కృతజ్ఞతా ర్యాలీని పట్టణంలో నిర్వహించారు. స్థానిక నాయుడువీధి నుంచి ప్రారంభమైన ర్యాలీ రథం బజార్, మెయిన్ బజార్, పాత బస్టాండ్ మీదుగా దోర్నాల బస్టాండ్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుంది. అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, స్త్రీ శక్తి పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ ఇబ్రహీంఖాన్, మేడిద రంగస్వామి, నాయకులు కనిగిరి బాలవెంకటరమణ, షేక్ మౌలాలితోపాటు మహిళలు పాల్గొన్నారు.

హాస్యబ్రహ్మ శంకరనారాయణకు వండర్ బుక్ రికార్డ్సులో స్థానం

● జిల్లావాసికి అంతర్జాతీయ గుర్తింపు



రికార్డును ప్రదానం చేస్తున్న వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సు ప్రతినిధులు

మార్కాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హాస్యావధాని, హాస్యబ్రహ్మ, శంకరనారాయణకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం దక్కింది. ఆయన గత 27 సంవత్సరాలుగా దేశవిదేశాల్లో వేలాదిగా హాస్య కార్యక్రమాలను నిర్వహించారు. ప్రధానంగా 550 హాస్యావధాన కార్యక్రమాలు చేశారు. ఆయన ప్రతిభను గుర్తించిన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ బుధవారం హైదరాబాద్‌లో త్యాగరాయ గానసభ సుబ్బారావు కళా వేదికలో జరిగిన కార్యక్రమంలో రికార్డును ప్రదానం చేశారు. ఈయన స్వగ్రామం దొనకొండ మండలం కొచ్చెర్లకోట. డిగ్రీ వరకు విద్యాభ్యాసం అంతా మార్కాపురంలోనే సాగింది. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ఎస్‌వీకేపీ కళాశాలల్లో ఆయన చదువుకున్నారు. అంతేగాక పలుమార్లు మార్కాపురంలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని హాస్యావధానం చేశారు. శంకరనారాయణకు అంతర్జాతీయ స్థాయి రికార్డు వరించడం పట్ల మార్కాపురంలోని ఆయన సన్నిహితులు, కవులు, కళాకారులు, సాహితీవేత్తలు ఆనందం వ్యక్తం చేశారు.

2 ఓట్లు కలిగి ఉంటే ఎన్నికల్లో పోటీకి అనర్హులు

● జిల్లా రెవెన్యూ అధికారి చిన ఒబులేషు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఒక వ్యక్తి రెండు ఓట్లు కలిగి ఉంటే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులని జిల్లా రెవెన్యూ అధికారి చిన ఒబులేషు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 2,183 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రస్తుతం 2,263 కేంద్రాలకు పెరిగాయన్నారు. త్వరలో ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే సవరిస్తారన్నారు. ఒక వ్యక్తి రెండు ఓట్లు కలిగి ఉంటే 1050 యాక్టు ప్రకారం శిక్షార్హుడన్నారు. అంతకుముందు పలు రాజకీయ పార్టీల నాయకులు కొన్ని అంశాలను ప్రస్తావించారు. ఆయా సమస్యలపై స్పందించిన డీఆర్వో మాట్లాడుతూ ఆయా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, కొండపి, గిద్దలూరు, దర్శి, సంతనూతలపాడు ఈఆర్వోలు కుమార్, వెంకట శివరామిరెడ్డి, జాన్సన్, వరకుమార్, వివిధ రాజకీయపార్టీల నాయకులు రాయపాటి అజయ్‌కుమార్, డిఎస్ క్రాంతికుమార్, సుదర్శన్, గుర్రం సత్యం, ఎస్‌కే రసూల్, వెంకట్రావు, రఘురాంతో పాటు ఎన్నికల సెల్ సూపరిటెండెంట్ శ్రీనివాసరావు ఉన్నారు.

నలుగురికి డైరెక్టర్ల పదవులు

దర్శి , సెప్టెంబరు 3 : రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లుగా టీడీపీ నేతలు ముగ్గురు, బీజేపీ నేత ఒకరికి పదవులు దక్కాయి. రాష్ట్ర నాటక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్లుగా నారపుశెట్టి పాపారావు, తాళ్లూరు మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి నియమితులయ్యారు. అలాగే శాలివాహన వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా కురిచేడు మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు పిడతల నెమలయ్య, దర్శి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మాడపాకుల శ్రీనివాసరావు నియమితులయ్యారు.

రిమ్స్‌కి మరో 30 ఎంబీబీఎస్ సీట్లు

● ఇకపై 150 మంది వైద్య విద్యార్థులకు అవకాశం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని రిమ్స్ మెడికల్ కాలేజీకి మరో 30 ఎంబీబీఎస్ సీట్లు పెరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ బాబు బుధవారం తెలిపారు. ప్రస్తుతం 120 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, అదనంగా మరో 50 సీట్లు అవసరమని నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఎన్ఎంసీ పరిశీలన అనంతరం రిమ్స్ మెడికల్ కాలేజీకి మరో 30 సీట్లు కేటాయించామని, ఈ పెంపు రాష్ట్ర విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన వివరించారు. భారత కోటాలో 22 సీట్లు, రాష్ట్ర కోటాలో 128 సీట్లు ఉంటాయన్నారు.

శరవేగంగా..

చకచకా గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు

● మద్దిపూడికి మణిహారం ● రూపురేఖలు మారనున్న గ్రామసీమలు

మద్రిపూడి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బెంగళూరు-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 344 కిలో మీటర్ల మేర ఆరు వరుసలుగా దీన్ని నిర్మిస్తున్నారు. హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భారత్‌మాల పరియోజన కింద కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టింది. మద్రిపూడి మండలంలో 20 కిలో మీటర్ల మేర పనులు జరుగుతున్నాయి. వీటిలో ఇప్పటికే 80శాతం మేర పూర్తయ్యాయి. దీంతో పల్లెల రూపురేఖలు మారనున్నాయి.

13 ప్యాకేజీల్లో టెండర్లు

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు 13 ప్యాకేజీలలో టెండర్లు ఖరారయ్యాయి. మద్రిపూడి మండల పరిధిలో గార్లపేట నుంచి పన్నూరు, గోగినేపాలెం వరకు రహదారి విస్తరించనుంది. దీని కోసం గార్లపేట, కూచిపూడి, తిప్పలదేవిపల్లి, మద్రిపూడి, కాకర్ల, పన్నూరు రెవెన్యూ గ్రామాలకు చెందిన 244.65 ఎకరాల పట్టా భూమితోపాటు 57.31 ఎకరాల అసైన్డ్ భూమిని సేకరించారు. 20 కిలో మీటర్ల రహదారి నిర్మాణానికి రూ.1,000 కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నారు. అనంతపురం జిల్లా కొడికొండ వద్ద ప్రస్తుతం ఉన్న బెంగళూరు జాతీయ రహదారికి, బాపట్ల జిల్లా పంగులూరు మండలం ముప్పవరం వద్ద కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారికి గ్రీన్‌ఫీల్డ్ హైవేను అనుసంధానిస్తున్నారు.

రాష్ట్ర ప్రజలకు రవాణా సులభతరం

ఈ రహదారి నిర్మాణం పూర్తయితే బెంగళూరు నుంచి అమరావతికి 100 కిలో మీటర్లకుపైగా దూరం తగ్గుతుంది. బెంగళూరులో స్థిరపడిన రాష్ట్ర ప్రజలకు, వివిధ ఉద్యోగాల కోసం అక్కడ ఉంటున్న యువతకు రవాణా సులభతరమవుతుంది. మద్రిపూడి మండలంలోని పలు రహదారులు మరింత అభివృద్ధి చెందుతాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యాపార లావాదేవీలు పెరగడంతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగవనున్నాయి. 30 మీటర్ల వెడల్పుతో 6లైన్ల తారురోడ్డు పనులు పూర్తయ్యాయి. మధ్యలో నాలుగు మీటర్ల డివైడర్‌ను ఏర్పాటు చేయనున్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే కావడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలతోపాటు పశులు చొరబడకుండా ఇరువైపులా పటిష్టమైన రక్షణ గోడలు నిర్మించనున్నారు.

తుది దశలో వంతెనల పనులు

ప్రధాన రహదారుల క్రాసింగ్ వద్ద హైలెవల్ వంతెనల నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. పొలాలకు వెళ్లే బాటల వద్ద అండర్‌పాస్‌లు ఏర్పాటు చేస్తున్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు మద్రిపూడికి సమీపంలో ఎగ్జిట్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. టంగుటూరు-పొదిలి రాష్ట్రీయ రహదారికి ఎగ్జిట్ ఏర్పాటు చేస్తే మండలంలోని 20 గ్రామాలకుపైగా రాష్ట్ర రాజధాని అమరావతికి వెళ్లేందుకు మార్గం సులభతరం అవుతుంది. ఆమేరకు ఇప్పటికే రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యకు మండల ప్రజలు లిఖిత పూర్వకంగా విన్నవించుకున్నారు. గత అక్టోబరులో జరిగిన ప్రత్యేక గ్రామసభలో కలెక్టర్ తమీమ్ అన్సారియ దృష్టికి కూడా ఇదే అంశాన్ని తీసుకెళ్లారు. మొత్తం మీద గ్రీన్‌ఫీల్డ్ హైవేతో పల్లెలు నూతన శోభను సంతరించుకుంటున్నాయి.



శరవేగంగా నిర్మాణం జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు

భారీ యంత్రాలతో సిమెంట్ దిమ్మెల ఏర్పాటు









చూసిన కనులదే భాగ్యము!

ముగిసిన జేఎన్‌వీ కళా ఉత్సవం

జవహర్ నవోదయ విద్యాలయ రీజనల్ కళా ఉత్సవాలు కనుల విందుగా సాగాయి. కేరళ, బెంగళూరు, బీజాపూర్, కర్నాటక, తూర్పు గోదావరి, విజయనగరం, మెదక్, కొట్టాయం జేఎన్‌వీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు, సంప్రదాయ వేషధారణలు, అమోఘంగా నిలిచాయి. మట్టితో తయారు చేసిన ప్రముఖుల ప్రతిమలు, చిత్రలేఖనం, క్రాఫ్ట్ బొమ్మలు ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా విచ్చేసిన వీక్షకులు, అతిథులు, విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు.

ఒంగోలులోని రిమ్స్ మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో రెండు రోజులపాటు జరిగిన జవహర్ నవోదయ రీజనల్ కళా ఉత్సవం బుధవారం ఘనంగా ముగిసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల... విద్యార్థుల కళారూపాలను వీక్షించి అభినందించారు.

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)







నిర్మమహేశ్వర స్వామి ఆలయ పాలకవర్గం ప్రమాణస్వీకారం

పొదిలి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పార్వతీ సమేత నిర్మమహేశ్వరస్వామి ఆలయ నూతన పాలకవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. చైర్మన్‌గా ఒగ్గు వెంకటరామయ్య, పాలకమండలి సభ్యులుగా దుబ్బాకుల లక్ష్మీనరసింహం, సానికొమ్ము హరనాథరెడ్డి, కుంచాల గీతాంజలి, వేల్పుల గీతాంజలి, దివ్వెల హరిత, కొణిజేటి లక్ష్మీనారాయణ, నెల్లపూడి హైమావతి, నూతక్కి పార్వతితో దేవాలయ ఈవో నర్రా నారాయణరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా పాలకవర్గంతో ప్రత్యేక పూజలు చేసి ఘనంగా సత్కరించారు. అనంతరం చైర్మన్ వెంకటరామయ్య మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, అందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న పాలకవర్గ సభ్యులు

అనాథ బాలికపై లైంగిక దాడి

● నిందితుడిపై పోక్సో కేసు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలయని అనాథ బాలికకు మాయమాటలు చెప్పి ఆటో డ్రైవర్ లైంగిక దాడి చేశాడు. ఒంగోలు మహిళ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మహిళ పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లాకు చెందిన బాలిక తల్లిదండ్రులు లేకపోవడంతో ఒంగోలులో ఉంటూ 9 తరగతి చదువుతోంది. బాలికను పాఠశాలకు తీసుకెళ్లే ఆటో డ్రైవర్ బ్రహ్మంనాయక్ మాయమాటలు చెప్పాడు. మూడు నెలల నుంచి బాలికపై లైంగికదాడికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

రాహుల్ గాంధీ గడ్డి బొమ్మ దహనంపై ఫిర్యాదు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీ గడ్డి బొమ్మను దహనం చేసిన బీజేపీ నాయకులపై కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ నాయకులు ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 1న స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద రాహుల్ గాంధీ బొమ్మపై పెట్రోల్ పోసి తగులబెట్టిన బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మన్నం ప్రసన్నరాజు, క్రైపు వెంకటకృష్ణారెడ్డి ఉన్నారు.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఒంగోలు విద్య, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపకారవేతన పరీక్ష నేషనల్‌మీన్స్ కమ్‌మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు గురువారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చవని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చనీ, పరీక్ష డిసెంబరు 7న జరుగుతుందనీ, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ.60 పరీక్ష ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ, జిల్లాపరిషత్, మండల పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వార్షిక ఆదాయం రూ.3.5 లక్షల్లోపు మాత్రమే ఉండాలన్నారు.

ఏఆర్ ఏఎస్పీగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

ఒంగోలు క్రైం, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): ఆర్మ్‌డ్ రిజర్వుడు అదనపు ఎస్పీగా కొల్లూరి శ్రీనివాసులు బుధవారం ఒంగోలులో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ ఏఆర్.దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. కొల్లూరి శ్రీనివాసులు కడప జిల్లాలో డీఎస్పీ పనిచేస్తు ఉద్యోగోన్నతిపై అదనపు ఎస్పీగా ప్రకాశం జిల్లాకు బదిలీ ఆయ్యారు. 1991 బ్యాచ్‌కి చెందిన శ్రీనివాసరావు నెల్లూరు, విజయవాడ, హైదరాబాద్, వైజాగ్, తిరుపతి, ఒంగోలు పీటీసీలలో వివిధ హోదాలలో పని చేశారు.

తండ్రి ఆత్మహత్య.. ముగ్గురు బిడ్డలు అదృశ్యం

● తెలంగాణలోని పెద్దాపూర్ వద్ద మృతదేహం
● మృతుడు యర్రగొండపాలెం మండలం వాసి
● సీసీ ఫుటేజీ ఆధారంగా శోధిస్తున్న పోలీసులు

వెల్దండ/యర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం మండలం బోయలపల్లి గ్రామానికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు (35) పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు జిల్లా వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ సమీపాన హైదరాబాద్ - శ్రీశైలం రహదారిపై గల ఓ చెరువు వద్ద చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనంపై వచ్చిన అతని పిల్లలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ(4) కనిపించకపోవడం మిస్టరీగా మారింది. యర్రగొండపాలెం మండలం బోయలపల్లి గ్రామానికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు, దీపిక భార్యాభర్తలు. వీరికి కూతుళ్లు మోక్షిత, వర్షిణిలతో పాటు కుమారుడు శివ ధర్మ ఉన్నాడు. భార్యాభర్తల మధ్య కలహాల నేపథ్యంలో గతనెల 30వ తేదీన వెంకటేశ్వర్లు తన పిల్లలు ముగ్గురినీ ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయలుదేరాడు. కుటుంబీకులు విషయాన్ని అక్కడి పోలీసులకు తెలిపారు. అనంతరం అదేరోజు వెంకటేశ్వర్లు జాడ కోసం బయలుదేరారు. వెంకటేశ్వర్లు శ్రీశైలం మీదుగా అచ్చంపేట నియోజకవర్గంలోని హాజీపూర్ వద్దకు మరుసటిరోజు చేరుకున్నాడు. సీసీ ఫుటేజ్‌లు పరిశీలించిన పోలీసులు హాజీపూర్ వద్ద తండ్రితో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం హైదరాబాద్ ప్రధాన రహదారిపై వంగూరు మండలం కోనేటిపురం వద్ద ఉన్న టోల్‌గేట్ సమీపంలోకి వచ్చిన వాహనంపై తండ్రితో పాటు ఒక్క కూతురు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. బుధవారం ఉదయం పెద్దాపూర్ సమీపంలోని ఓ చెరువు సమీపంలో వెంకటేశ్వర్లు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు అతని సెల్ ఫోన్ సిగ్నల్స్ ద్వారా పోలీసులు వచ్చి గుర్తించారు. వెంకటేశ్వర్లు వెంట వచ్చిన ఇద్దరు కూతుళ్లు, కుమారుడి జాడ తెలియలేదు. ఈ మేరకు వెల్దండ పోలీసులు కేసు నమోదు చేసుకొని అదృశ్యమైన పిల్లల ఆచూకీ కోసం సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు.



చిన్నారులు మోక్షిత, వర్షిణి, శివధర్మ



గుత్తా వెంకటేశ్వర్లు (ఫైల్)

జిల్లాలో సమృద్ధిగా యూరియా

● కలెక్టర్ అన్సారియా ● కలెక్టరేట్‌లో ప్రత్యేక కాల్‌సెంటర్ ఏర్పాటు ● 8331057078 నెంబర్ కేటాయింపు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. రైతులను భయాందోళనకు గురిచేసేలా వ్యాపారులు ఎవరైనా ప్రవర్తించినా, అక్రమంగా యూరియాను నిల్వ చేసి పక్కదారి పట్టించినా పీడీ యాక్టు కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకు ముందు సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎరువులతో పాటు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎరువులతో పాటు ఈ-పంట, ల్యాండ్ రికార్డ్స్ రైతుల ఆధార్ కార్డుల వివరాల ఆధారంగా యూరియా పంపిణీ తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్ళారు. అనంతరం కలెక్టర్ అన్సారియా సంబంధిత అధికారులకు యూరియాపై దిశా నిర్దేశం చేశారు. ఆర్‌ఎస్‌కే, ప్రైవేటు షాపుల వద్ద పంపిణీ చేసే సమయంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్, మండల వ్యవసాయాధికారి, తహసీల్దార్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ప్రైవేటు డీలర్లతో జిల్లాస్థాయిలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. యూరియా అందడంలో ఏమైనా ఇబ్బందులు వస్తే కలెక్టర్ కార్యాలయంలో 8331057078 సెల్ నెంబర్‌తో ప్రత్యేక కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, అధికారులు హరికృష్ణ, విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

● 250 యూరియా బస్తాలు సీజ్

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల, పట్టణ ప్రాంతాల్లోని పలు ఎరువుల దుకాణాల్లో బుధవారం ఒంగోలుకు చెందిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతోపాటు మండల వ్యవసాయాధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అమ్మకపు వివరాలు సరిగా నమోదు కాకపోవడం వల్ల 256 బస్తాల యూరియాను, 15 బస్తాల 24-24 యూరియాను సుమారు రూ.93,724 సరుకును సీజ్ చేశారు. వారిపై 6ఏ కేసు నమోదు చేశారు. పట్టణంలోని శ్రీకృష్ణ ట్రేడర్స్ చక్రవర్తి ట్రేడర్స్‌లలో అధికారులు తనిఖీ చేసి వాటి అమ్మకాలను నిలిపివేశారు. శ్రీకృష్ణ ట్రేడర్స్‌లో రూ.93,724, చక్రవర్తి ట్రేడర్స్‌లో 12.75 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువుల రూ.4,33,500 అమ్మకాలను నిలిపివేశారు. మండలంలోని నరవ, పొదలకొండపల్లె రైతు సేవా కేంద్రాల్లోని ఎరువుల గోడౌన్లను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి, రైతులకు అవసరమైన ఎరువులను అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రవిబాబు, మండల ఏవో విజయభాస్కర్‌రెడ్డి, ఎస్సై నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● కంభం : ఎస్పీ ఆదేశాలతో కంభం సీఐ మల్లికార్జున, బేస్తవారిపేట ఎస్సై రవీంద్రారెడ్డి కంభం, అర్ధవీడు, బేస్తవారపేట మండలాల్లోని ఎరువుల దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను, యూరియా, ఇతర మందుల స్టాకులను పరిశీలించారు. మంగళవారం రాత్రి విజిలెన్స్ అధికారి బీపీ పాల్, ఏడీఏ బాలాజీ నాయక్ కంభం వ్యవసాయ అధికారి షేక్ మహమ్మద్ కంభం మన గ్రోమోర్ సెంటర్, కల్యాణి ట్రేడర్స్ ఈశ్వర్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. మన గ్రోమోర్ సెంటర్‌లో రికార్డులు సక్రమంగా లేని కారణంగా 4.5 టన్నుల డీఏపీ ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు.

● కొమరోలు మండలంలోని ఎరువుల దుకాణం, రైతు సేవాకేంద్రాల్లో సీఐ రామకోటయ్య తనిఖీలు చేశారు.

సౌర విద్యుత్‌తో ఆదాయం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్‌తోఖర్చులు తగ్గించుకొని మిగిలిన విద్యుత్ అమ్మకం ద్వారా అధిక ఆదాయం పొందాలని మెప్మా పీడీ పీ.శ్రీహరి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీకోసం హాలులో మెప్మా సిబ్బంది, మెప్మా ఆర్పీలకు పీఎం సూర్యఘర్‌పథకంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో శ్రీహరి మాట్లాడుతూ ఎల్‌హెచ్‌పీ(లెడ్డీ హుడ్ ప్రమోషన్)కు ప్రణాళికలు సిద్ధం చేసి ఒంగోలు కార్పొరేషన్‌తోపాటు అన్ని మున్సిపాలిటీల్లో యూనిట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

గురుపూజోత్సవానికి రూ.లక్ష విడుదల

ఒంగోలు విద్య, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈనెల 5న నిర్వహించనున్న గురుపూజోత్సవ వేడుకలకు ప్రభుత్వం జిల్లాకు రూ.లక్ష చొప్పున విడుదల చేసింది. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను గుర్తించి వారికి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేసి గౌరవించనున్నారు. ఆర్థిక నియామకావళి ప్రకారం ఈ నిధులు వినియోగించి వినియోగధృవీకరణ పత్రాలను సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

డ్రోన్ సాయంతో కోడి పందేల స్థావరంపై దాడి

● 44 మోటారు సైకిళ్లు, నాలుగు కోడి పుంజులు స్వాధీనం

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సింగోలు సమీప పొలాల్లో కోడి పందేలు వేస్తున్నట్లు డ్రోన్ ద్వారా గుర్తించిన పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేశారు. వీరిని గమినించిన పందెంరాయుళ్లు పరారయ్యారు. అక్కడ దొరికిన 44 మోటారు సైకిళ్లు, నాలుగు కోడి పుంజులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వినాయక పూజలు



కమిటీ నిర్వాహకులతో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో వినాయక చవితి నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. ఈ మేరకు బుధవారం స్థానిక సీతారామపురంలోని వరసిద్ధి వినాయక విగ్రహం వద్ద ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద సంతర్పణను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, నాయకులు కొఠారి నాగేశ్వరరావు, నిర్వాహకులు పప్పు శ్రీనివాసరావు, తెనాలి వేణు, బత్తుల కమల్, పినిశెట్టి సురేష్, వాకాటి వెంకటేష్, శివ, సురేంద్ర, పవన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక కోర్టు సెంటర్‌లోని ద్వారకానగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఎమ్మెల్యే దామచర్ల పాల్గొని పూజలు చేశారు.

ఎమ్మెల్యే బీఎన్ పూజలు

సంతనూతలపాడు: పి.తక్కెళపాడు గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన వినాయకుని నవరాత్రి వేడుకల్లో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ హాజరై పూజలు చేశారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్.అంకారావు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యచౌదరి సేవలు మరువలేనివి



బుచ్చయ్యచౌదరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా పోతినేని బుచ్చయ్యచౌదరి గ్రామాభివృద్ధికి నిరంతరం చేసిన కృషి మరువలేనిదని ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ పేర్కొన్నారు. బుధవారం పెద్దకొత్తపల్లిలో జరిగిన బుచ్చయ్యచౌదరి సంస్మరణ సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి ప్రకాశరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బుచ్చయ్యచౌదరి చిత్రపటానికి ఎమ్మెల్యే బీఎన్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బుచ్చయ్యచౌదరి సర్పంచ్‌గా పనిచేసిన కాలంలో పాఠశాలలో కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తెచ్చారన్నారు. గ్రామాభివృద్ధికి ఆయన ఎంతో తోడ్పాటునందించారని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడ నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బుచ్చయ్యచౌదరిసేవలను కొనియాడారు. ఆయన వైద్యఆరోగ్యశాఖలో ఉద్యోగిగా కూడా అంకితభావంతో పని చేశారని, అలాగే గ్రామానికి సర్పంచ్‌గా నిస్వార్థమైనసేవలు అందించారని చెప్పారు. కార్యక్రమంలో మండవ రంగారావు, టీడీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ జయంత్‌బాబు, అడకా స్వాములు, మండల శరత్‌బాబు, శేషయ్య, మార్నేని సుబ్బారావు, రాఘవరావు పాల్గొన్నారు.

కక్షిదారులకు మెరుగైన సేవలు

● జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి



ఈ-సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయాధికారి భారతి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులకు మెరుగైన సేవలను అందించేందుకు ఈ-సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎ.భారతి పేర్కొన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం ఈ-సేవా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం కేంద్రంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్లను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా 7వ అదనపు జిల్లా న్యాయాధికారి టి.రాజావెంకటాద్రి మాట్లాడుతూ కక్షిదారులకు ఎలాంటి సందేహాలు ఉన్నా ఈ-సేవా కేంద్రం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ షేక్ ఇబ్రహింషరీఫ్, న్యాయాధికారులు డి.దీప, పూర్ణిమ, కె.శైలజ, హేమలత, రామకృష్ణ, పాటు బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వేల్పుల



వేల్పుల సింగయ్య

సింగరాయకొండ, సెప్టంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమరాజుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత వేల్పుల సింగయ్య రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమతులయ్యారు. ఆయన సుమారు 15 ఏళ్లపాటు పార్టీ మండల అధ్యక్షుడిగా సేవలు అందించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మండలంలో టీడీపీకి 6,000 పైచిలుకు ఓట్ల మెజారిటీ తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలను గుర్తించిన ఆ పార్టీ అధిష్ఠానం కార్పొరేషన్ డైరెక్టర్ పదవిని కట్టబెట్టింది. పదవి రావడానికి సహకరించిన మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావుకు సింగయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ఉర్దూ స్కూలు అభివృద్ధికి చేయూత



బదరీనారాయణను సత్కరిస్తున్న అతిథులు, ఉపాధ్యాయులు

చీమకుర్తి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేయూత అందించడం అభినందనీయం అని ఎంఈవో నరసింహారావు, ప్రముఖ వైద్యుడు బి.జవహర్ పేర్కొన్నారు. చీమకుర్తి పట్టణంలో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఒంగోలు గెలాక్సీ అధినేత చలువాది బదరీనారాయణ దాదాపు రూ.5లక్షల వ్యయంతో స్టేజీ నిర్మాణం, డైనింగ్‌హాల్, ఫ్లోరింగ్, టాయిలెట్లను నిర్మించారు. బుధవారం స్థానిక పాఠశాలలో జరిగిన ప్రారంభ సభలో దాత బదరీనారాయణను ముఖ్యఅతిథులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దాత బదరీనారాయణ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తనవంతు సహకారం అందించే అదృష్టం కలగటం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో డీఐ మొయినీద్దీన్, ఎంఈవో శివాజీ, ఏహెచ్ఎం వద్ది మోహన్, చలువాది పార్థసారథి, ఎస్ఎస్.కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ నలమలపు అంజమ్మ సూచించారు. ప్రభుత్వ వైద్యశాలల అభివృద్ధి సాంఘీక సంక్షేమ వసతి గృహాలపై సంబంధిత అధికారులతో బుధవారం నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పుల శాతం పెంచాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై వైద్యఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు ఒనారియల్, ప్రమోద్, వార్డెన్లు ప్రభుదాస్, లింగయ్య, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్.. గ్రామసింహాలు..!

● పరుగులు తీస్తున్న జనం
● బెంబెలెత్తుతున్న మండలవాసులు



నెల	కుక్కకాటు బాధితులు
జనవరి	87
ఫిబ్రవరి	58
మార్చి	52
ఏప్రిల్	48
మే	64
జూన్	51
జులై	34
ఆగస్టు	28

సంతనూతలపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం సంతనూతలపాడుతో పాటుగా పలుగ్రామాల్లో గ్రామసింహాల ధాటికి ప్రజలు బెంబెలెత్తుతున్నారు. దారిలో వెళ్లేవారిని వెంబడిస్తుండటంతో ఎక్కడ కరుస్తాయోనని పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. సంతనూతలపాడులోని పలువీధుల్లో వీధి కుక్కల సంచారం పగలు, రాత్రి తేడా లేకుండా అధికంగా ఉంది. వీటి సంతతిని నియంత్రించే చర్యలు అధికారులు చేపట్టడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. పలువీధుల్లో కుక్కలు గుంపులుగుంపులుగా తిరుగుతుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కాలినడకన వెళ్లేవారితో పాటు, ద్విచక్ర వాహనాల వెంట పడుతుండటంతో వాహనదారులు వేగం పెంచి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక వీధికుక్కల గుంపునకు చిన్నపిల్లలు కనపడితే చాలు వెంటపడి మరి కరిచేందుకు పరుగులు తీస్తున్నాయి. రెండు వారాల క్రితం సంతనూతలపాడులో ఏపీజీబీ బ్యాంకు సెంటర్ వద్ద ఇద్దరు చిన్నారులు ఆడుకుంటుండగా వీధికుక్కల గుంపులుగా దాడికి దిగాయి. సమీపంలో ఉన్న ఓ మహిళ గమనించి కర్ర తీసుకుని వెంటపడటంతో వీధికుక్కలు పరారయ్యాయి. లేకుంటే వీధికుక్కల వల్ల జరిగే ప్రమాదం ఊహించడానికి భయంకరంగా ఉండేదని స్థానికులు వాపోయారు. వీధికుక్కల సంచారం మరీ ఎక్కువగా ఉందని, బయటకు వెళ్లాలంటే చిన్నారులు, మహిళలు భయపడుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది డిసెంబరు 1వ తేదీన అర్ధరాత్రి సమయంలో చిలకపాడులో దొడ్డిలోఉన్న 17 గొర్రెపిల్లలపై వీధి కుక్కలు విచక్షణారహితంగా దాడి చేశాయి. దీంతో 15 గొర్రె పిల్లలు మృత్యువాత పడగా మరో రెండు పిల్లలు గాయపడ్డాయి.

8 నెలల్లో 422 మందికి..

వీధి కుక్కల బారిన పడి అనేకమంది పెద్దలు, చిన్నారులు గాయపడుతున్నారు. గత 8 నెలల్లో మండలంలో ఆయా గ్రామాల్లో 422 మంది కుక్కకాటుకు గురయ్యారు. సంతనూతలపాడు ప్రభుత్వవైద్యశాలకు సగటున నెలకు 44మంది వరకు, ఎం.వేములపాడు ప్రభుత్వ వైద్యశాలకు సగటున నెలకు 9 మంది కుక్కకాటుతో వైద్యానికి వస్తున్నారు. కుక్కల సంతతి పెరగకుండా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

నియంత్రణకు చర్యలు చేపడతాం
- డి.సురేష్‌బాబు, ఎంపీడీవో

కుక్కల సంచారాన్ని, వాటి సంతతిని నియంత్రించడానికి పశుసంవర్ధకశాఖ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటాం. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం వీధికుక్కలను చంపకూడదు. వాటికి ఇంజెక్షన్లు వేసి కుక్కల సంతతి తగ్గించే ఏర్పాటుచేస్తాం. ఈ విషయంపై సంబంధిత సిబ్బందితో చర్చించి వెంటనే చర్యలు తీసుకుంటాం.

గ్రామాల్లో పారిశుధ్య పనులకు ప్రాధాన్యం

● డీపీవో వెంకటేశ్వరరావు



మద్దిపాడులో ఎంపీడీవో జ్యోతికి సూచనలు ఇస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

ఒంగోలు(రూరల్), సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలు పరిశుభ్రత పాటించటం ద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా చూడవచ్చని ఇన్‌చార్జి డీపీవో ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రోడ్లపై, మురుగు కాలువల్లో చెత్తాచెదారం పడవేయవద్దని గ్రామస్థులు సూచించారు. చెత్తవాహనాల్లోనే ఇళ్లలోని చెత్తను వేయాలని, దానిని చెత్తసంపద కేంద్రాలకు తరలిస్తారని పేర్కొన్నారు. సేంద్రియ ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించి పంచాయతీకి ఆదాయ వనరుగా మార్చుకోవచ్చని చెప్పారు. పనులు నూరుశాతం వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖరరావు, డిప్యూటీ ఎంపీడీవో ఎ.బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: గ్రామాల్లో జరిగే పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం ఆయన మద్దిపాడులో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో ప్రభుత్వ లక్ష్యాలను పూర్తిచేయాలి

● ఎంపీడీవో రవికుమార్



మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను పూర్తిచేసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం ప్రభుత్వ శాఖల ప్రగతిపై సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను, మండలాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలని సూచించారు. విధుల్లో సమయపాలన పాటించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంఈవో రవి, హౌసింగ్ ఏఈ అబ్దుల్‌లతీఫ్, ఏపీఎం నరేంద్రకుమార్, ఏపీవో రవిబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇంకుడు గుంతల నిర్మాణాల ప్రగతిపై ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న ఇంకుడు గుంతలు, గోకులం షెడ్లు, పశువులతొట్లు, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. మద్దిరాలపాడు, చదలవాడ గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీవో తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై తనిఖీలు



సీజ్ చేసిన ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను పరిశీలిస్తున్న మేయర్

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని ప్లాస్టిక్ వినియోగంపై కార్పొరేషన్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బుధవారం కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశాలతో స్థానిక దక్షిణంబజారులోని ప్లాస్టిక్ కవర్లు, గాస్లులు అమ్ముతున్న దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా నిల్వ ఉన్న ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకోవడంతోపాటు, దుకాణం యజమానికి రూ.9వేలు జరిమానా విధించారు. నగరంలో ప్లాస్టిక్ కవర్లపై నిషేధం ఉన్నదని, అందువల్ల నేత సంచులు వినియోగించాలని మేయర్ సుజాత కోరారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వైష్ణవి, శానిటరీ సూపర్‌వైజర్లు షేక్ బాజ్జి, ఎస్.పిచ్చయ్య, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు

కొండపి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కొండపి పంచాయతీలోని ఎస్సీ కాలనీలో వీధిలైట్లను బుధవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని సర్పంచ్ కొమ్ము సులోచన ప్రారంభించారు. రెండు రోజుల్లో అన్ని చోట్లా లైట్ల ఏర్పాటును పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉన్నం రామ్మోహన్, టీడీపీ ఎస్సీ కాలనీ నాయకులు కొమ్ము రవికుమార్, కొమ్ము కవిరాజు, పందిటి మార్కు తదితరులు పాల్గొన్నారు.

చెవిటి మిషన్ అందజేత

మద్దిపాడు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): దొడ్డవరం గ్రామానికి చెందిన పల్లేపు రాఘవులుకు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ అందజేశారు. బుధవారం ఒంగోలులోని ఎమ్మెల్యే బీఎన్ కార్యాలయంలో విజయ్‌కుమార్ రూ.30వేల విలువ జేసే చెవిటిమిషన్‌ను అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, నాయకులు పాల్గొన్నారు.

రైల్వే జీఎంను కలిసిన మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై సౌత్‌సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాత్సవను ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి బుధవారం కలిశారు. హైదరాబాద్‌లోని రైల్ నిలయంలో శ్రీవాత్సవను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులతో పాటు ఆర్‌వోబీలు, వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం జడ్ఆర్‌యూసీసీ సమావేశంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొని పలు అంశాలను మాట్లాడారు. జిల్లాలో రైల్వే స్టేషన్ల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

క్షయ నివారణకు పాటుపడాలి



సదస్సులో పాల్గొన్న వైద్యులు, గ్రానైట్ ఓనర్లు

చీమకుర్తి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : క్షయ నివారణకు అందరూ పాటుపడాలని పలువురు పేర్కొన్నారు. క్షయ వ్యాధి నివారణపై అవగాహన సదస్సును బుధవారం రామతీర్థంలోని గంగా స్టోన్ ఎక్స్‌పోర్ట్సు ఫ్యాక్టరీ ఆవరణలో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎం టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్ష నివారణాధికారి డాక్టర్ శ్రీవాణి మాట్లాడుతూ క్షయ సోకినట్లు అనుమానం కలిగిన వెంటనే సమీప ప్రభుత్వ వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి బేబీ, బాలపరశురాం, ప్రముఖ గ్రానైట్ వ్యాపారి చలువాది బదరీనారాయణ, గోగినేని వెంకటేశ్వర్లు, కాట్రగడ్డ రమణయ్య, అహ్మద్ బాషా, నాగయ్య, గోగినేని భాస్కర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజల్లోకి అభివృద్ధి కార్యక్రమాలు

కొండపి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమంద నాయుడు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల ఊరేగింపు సందర్భంగా మంగళవారం రాత్రి నేతివారిపాలెంలోని బస్టాండ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు నెప్పల ప్రసాద్, నాయకులు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల విచారణను త్వరగా పూర్తి చేయాలి : డీఎస్పీ

కొండపి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ ఆదేశించారు. వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం ఉదయం ఆయన కొండపి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలు, రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో కొండపి సీఐ జి.సోమశేఖర్ పాల్గొన్నారు.

మానవతా గ్రంథం 'రామాయణం'

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రామాయణం మత గ్రంథం కాదని, మానవతా గ్రంథమని ప్రకాశం రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకటశ్రీనివాసులు పేర్కొన్నారు. సంతపేట రాఘవేంద్రస్వామి బృందావనంలో జరిగిన సభలో కవి బంతికట్ల నాగేశ్వరరెడ్డి రచించిన వినాయక సంకల్ప రామాయణం గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. తండ్రీకుమారులు, భార్యాభర్తలు, అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీక రామాయణం అని చెప్పారు. కుటుంబ వ్యవస్థకు దర్పణం పట్టే రామాయాణం ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన గ్రంథమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చింతపల్లి గోపి, రచయిత నాగేశ్వరరెడ్డి, యువీ.రత్నం, ఓరుగంటి ప్రసాద్, జానకీరామ్, మధురశ్రీ, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవల కోసం ఆర్థికసాయం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యసేవల కోసం ఇబ్బందదిపడుతున్న బాధిత కుటుంబానికి మేస్సో ట్రస్టు రూ.60వేల ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని మర్రిచెట్టువీధిలో నివాసం ఉంటున్న లక్కవరపు ప్రసన్నాంజనేయులు చిరు ఉద్యోగిగా జీవనం సాగిస్తున్నారు. అతను రోడ్డుప్రమాదంలో గాయపడి వైద్య సహాయం కోసం జిల్లావిశ్వబ్రాహ్మణ సంఘాన్ని ఆశ్రయించారు. దీంతో సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, ప్రధానకార్యదర్శి సీతారామాంజనేయులు హైదరాబాద్‌లోని వేస్సో ట్రస్టును సందర్శించారు. బాధితుడిని వీడియో కాల్ ద్వారా పరిశీలించి దాతల సహకారంతో రూ.60వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ట్రస్టు చైర్మన్ బంగారు తాతారావు, ప్రధానకార్యదర్శి బంగారు శ్రీనివాసరావులకు సంఘం ప్రతినిధులు శ్రీనివాసాచారి, సీతారామాంజనేయులు, చే బ్రోలు రవిచంద్రలు కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటాలి



మొక్కను నాటుతున్న వీసీ మూర్తి, ప్రిన్సిపాల్

ఒంగోలు విద్య, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు, స్వచ్ఛమైన ప్రాణవాయువు కోసం విరివిగా మొక్కలు నాటాలని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్.మూర్తి కోరారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక యూనివర్శిటీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.హరిబాబు, ప్రిన్సిపాల్ నిర్మలామణి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

ఒంగోలు(రూరల్), సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): రైతులు తాము సాగు చేసే భూములను భూసార పరీక్షలు చేయించాలని, దీనివల్ల మూలకాల లోపాలను తెలుకోవచ్చని ఏవో ఏవో రమేష్‌బాబు పేర్కొన్నారు. ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల అనంతరం లోపించిన మూలకాలను తిరిగి పరిపూర్తి చేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని చెప్పారు. అనంతరం భూసారపరీక్షల ప్రతాలను అందజేశారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం కృష్ణ, సహాయకురాలు సౌజన్య పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా యాకోబు



జంద్రాజుపల్లి యాకోబు

చీమకుర్తి, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర విద్యాశాఖ బుధవారం ప్రకటించిన జాబితాలో చీమకుర్తి పట్టణం ఎన్ఎస్‌పీ కాలనీలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న జంద్రాజుపల్లి యకోబు చోటు దక్కించుకున్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. చీమకుర్తి మండలం యల్లయ్యనగర్‌కు చెందిన యాకోబు 1997లో దేవరపాలెం ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధుల్లో చేరారు. ఆ పాఠశాల, ప్రాథమికోన్నత, తదుపరి హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ కావటంలో తనదైన కృషి చేశారు. తదుపరి పులికొండ ప్రాథమికపాఠశాలకు బదిలీ అయ్యారు. అక్కడ ప్రధానోపాధ్యాయుడిగా పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేశారు. అనంతరం పుట్టచెరువుపాలెం, ఎన్ఎస్‌పీకాలనీలో విద్యార్థుల అభివృద్ధికి అవిరళ కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో నరసింహారావు, శివాజీ, ఉపాధ్యాయులు యాకోబును అభినందించారు.

ఎస్ఎఫ్ఐ సైకిల్‌యాత్ర



సైకిల్‌యాత్రలో పాల్గొన్న నాయకులు

చీమకుర్తి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యాపరిరక్షణ సైకిల్‌యాత్రలో భాగంగా ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం చీమకుర్తి పట్టణంలోని వసతిగృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీహెచ్.వినోద్, జి.దేవరాజు, శ్రీకాంత్, కొండారెడ్డి, బాలకోటయ్య, ఆంజనేయులు,పూసపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి

ఒంగోలు నగరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మహిళలు లైంగిక వేధింపుల నిరోధక చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలని స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సువర్ణ పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు నగరం రామ్‌నగర్‌లోని స్త్రీశిశు సంక్షేమశాఖ కార్యాలయం సమావేశం హాలులో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులను నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ చట్టాన్ని రూపొందించిందని చెప్పారు. దీనిద్వారా మహిళలు తగిన రక్షణ పొందవచ్చన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, ఇతర పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా రక్షణ పొందేందుకు ఈ చట్టం దోహదం చేస్తుందని చెప్పారు. అనంతరం మిషన్ శక్తి, మిషన్ వాత్సల్యకు సంబంధించిన సేవలు, సర్వీసులపై అంగన్‌వాడీ కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో అర్బన్ సీడీపీవో అంజమ్మ, వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ జ్యోతిసుప్రియ, డీసీపీవో దినేష్‌కుమార్, సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాశినాయనకు పూజలు

గిద్దలూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీభగవాన్ కాశిరెడ్డినాయన ఆశ్రమంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహికంగా భజనలు చేశారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు, పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దాతలు పాలుగుళ్ళ స్వాతి, సిరిపిరెడ్డి నారాయణరెడ్డి, వివిధ సంస్థల ప్రతినిధులు బీఎస్ నారాయణరెడ్డి, డాక్టర్ ఖాదర్ వలి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గిద్దలూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖ గ్రంథాలయం ఆవరణలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో జస్మిత, సుహిత్, అనూష, జూనియర్స్ విభాగంలో భాస్విత, భవ్య, సాయిప్రణీత్ మొదటి 3 స్థానాలను సాధించగా దాతల సహకారంతో బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో దాత యశ్వంత్, గ్రంథపాలకురాలు ప్రసన్న కుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి ఫరూఖ్ పాల్గొన్నారు.

పత్తికి ఎర్ర తెగులు.. రైతులకు గుబులు



పత్తిని లోడ్ చేస్తున్న కూలీలు

- వేసవిలో సాగు చేసిన పైరుకు నష్టం
- తగ్గిన దిగుబడులు
- ధరలు అంతంతమాత్రమే
- కానరాని సీసీఐ



ఎర్రతెగులు సోకిన పత్తి పైరు

పెద్దదోర్నాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పత్తి సాగు చేసిన రైతు పెట్టుబడులు రాక చిత్తయ్యారు. భూమిని నమ్మి అప్పో సప్పో చేసి పెట్టుబడి పెట్టి, ఇంటిల్లి పాదీ ఆరుగాలం కష్టించినా మిగిలేది నష్టం తప్ప లాభం లేదని రైతులు కంట తడి పెడుతున్నారు. మండలంలో సుమారు 700 ఎకరాల్లో పత్తిని విత్తారు. ప్రధానంగా ఏప్రిల్, మేలో బోరు బావుల కింద సాగు చేసిన పత్తి తీత దశకు వ్చంది. ఇప్పటికే చాలా వరకు రెండు సార్లు పత్తి తీతలు చేశారు. అయితే ఎకరాకు 4.5 క్వింటాళ్లకు మించి దిగుబడులు వచ్చే అవకాశం లేదని వాపోతున్నారు. ఎందు కంటే ఎర్ర తెగులు సోకింది. ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేక పోగా ఖర్చులు పెరిగాయి. పైగా పురుగు మందులు ధరలు చూస్తే నియంత్రణ లేదు. దిగుబడులు చూస్తే గణనీయం గా తగ్గాయి. గిట్టుబాటు ధరలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. వానకు తడిసిందని, పత్తి నాణ్యత లేదని పలు సాకులతో దళారులు ధరలను పెంచడం లేదు. ప్రస్తుతం క్వింటా రూ.6,000 నుంచి రూ.6,500ల వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఎకరా పత్తి సాగు కు దుక్కికి రూ.2,000, గొర్రు, గుంటకకు రూ.1,600, సాల్లు వేసినందులకు రూ.800, పత్తి విత్తినందులకు కూలీలు 3గ్గురికి రూ.900, అంతర సేద్యం ఖర్చు రూ.6,400, కలుపు తీతల ఖర్చు రూ.3,000, బలం మందుకు రూ.6,800, పురుగు మందుల ఖర్చు రూ.20,000, పత్తి తీత ఖర్చు రూ. క్వింటాకు రూ.1,500 చొప్పున సుమారు 5 క్వింటాళ్లకు ఖర్చు రూ.7,500 మొత్తం ఖర్చు, రూ.50,000 అవుతోందని రైతులు చెప్తున్నారు. 5క్వింటాళ్ల పత్తి విక్రయిస్తే వచ్చేది క్వింటా ధర రూ.6,500 చొప్పున లెక్కించినా రూ.35వేలకు మించడం లేదని అంటున్నారు. దీంతో ఎకరాకు రూ.15,000 చొప్పున రైతులు నష్టపోవల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సీసీఐ ద్వారా రూ.8,000లకు పైగా కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించినా ఎక్కడా ఆ జాడ కనిపించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.



కోనేరును పరిశీలిస్తున్న పీడీ జోసఫ్ కుమార్

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

పీడీ జోసఫ్ కుమార్

పెద్దారవీడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం చేస్తాయని పీడీ జోసఫ్‌కుమార్ అన్నారు. మండలంలోని రాజంపల్లి గొడ్రాలికొండ వద్ద మొక్కలునాటే కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొడ్రాలికొండ తిరుమలనాథ స్వామి దేవస్థానం వద్ద రూ.3 లక్షలతో కోనేరు పునరుద్ధరణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మండలంలోని తోకపల్లిలో ఉద్యానవన శాఖ పరిధిలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నిర్మల, ఏపీవో సుజాత, ఈసీ నాయక్, టీఏ సుబ్బయ్య రైతులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

గిద్దలూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏపీటీఎఫ్ గిద్దలూరు మండల శాఖ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన విధంగా సీపీఎస్ రద్దు చేయలేదని, పీఆర్‌సీ అమలు చేయలేదని, డీఏలు ప్రకటించలేదని పేర్కొన్నారు. విద్యాశక్తి పేరుతో జరుగుతున్న కార్యక్రమాల పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారని, తగిన వసతులు లేకుండా అమలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అదనపు కార్యదర్శి కబీర్, జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగస్వామి, ఏపీటీఎఫ్ నాయకులు పాండు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తాడివారిపల్లిలో చినుకు పడితే చిత్తడే

తర్లుపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాడివారిపల్లెలో చినుకు పడితే చిత్తడిగా మారుతుంది. చిన్నపాటి వర్షం కురిసిన ప్రధాన రహదారిలో నీరు నిల్వ ఉండటంతో దుర్భంధం వెదజల్లుతుంది. గ్రామంలో సైడు కాలువలు లేకపోవటంతో ప్రజల అవసరాల కోసం వినియోగించే నీరు సైతం రోడ్లపైకి రావటంతో మురుగు పేరుకపోతుంది. దీంతో దుర్గంధం వెదజల్లుతుంది. ప్రస్తుతం వర్షాకాలం కావటంతో రహదారులు గుంతల మయంగా ఉండటంతో మరింత ఎక్కువగా నీరు నిలబడి వరినాట్లు వేసే విధంగా బురద ఉంది. దీంతో ఈగలకు, దోమలకు నిలయంగా మారటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రధాన రహదారి అయిన కోమటికొట్ల బజారు మరి అధ్వాన్నంగా ఉంది. ఇలా గ్రామంలో కూడా రజకుల బజారు పేరుకే సిమెంట్ కానీ, డ్రైనేజీ లేకపోవటంతో ఆ రోడ్డుపై కూడా మురుగు నీరు పారి నిల్వ ఉంటుంది. గ్రామంలో కనీస మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవటం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో కనీస మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

సీఐటీయూ పట్టణ మహాసభను జయప్రదం చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణంలో ఈ నెల 5న జరిగే సీఐటీయూ పట్టణ మహాసభను జయప్రదం చేయాలని కార్యదర్శి రూబెన్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మహాసభలో వివిధ అంశాలను చర్చిస్తామని, నూతన కమిటీని ఎన్నుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డీకేఎం రఫీ, సుబ్బరాయుడు, కాశయ్య, చెన్నకేశవులు, నన్నేసా పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

మార్కాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోజూ మద్యం సేవించి భార్యను ఇష్టారీతిన దూషించి, కొడుతున్న భర్తపై టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు స్థానిక సుందరయ్య కాలనీకి చెందిన యు.రాజగోపాల్ బేల్దారి పని చేస్తుంటాడు. భార్య వెంకటలక్ష్మి ఓ షాపింగ్‌మాల్‌లో పనిచేస్తోంది. గత కొన్నాళ్లుగా రోజూ మద్యం సేవించి భార్య వెంకటలక్ష్మిని వేధింపులకు గురిచేస్తున్నాడు. ఆమె ఫిర్యాదుతో ఎస్సై ఎం.సైదుబాబు కేసు నమోదు చేశారు.

నిద్రపోతున్న యాచకుడిపైకి ఎక్కిన బస్సు

పొదిలి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అతడు నా అనే వాళ్లు లేని అనాథ. పొట్ట కూటి కోసం యాచిస్తూ ఊరుకాని ఊరికి వచ్చి ప్రమాదానికి గురయ్యాడు. బుధవారం మధ్యాహ్నం ఆర్టీసీ డిపో బస్సు బైటకు వెళ్లే గేటు సమీపంలోని వేప చెట్టు నీడలో నర్సరావుపేటకు చెందిన నరసింహారావు నిద్రలోకి జారుకున్నాడు. అదే సమయంలో మార్కాపురం డిపోకు చెందిన డ్రైవర్ గమనించకపోవడంతో బస్సును ఆయన పైకి ఎక్కించడంతో రెండు కాళ్ల పాదాలు దెబ్బతిన్నాయి. స్థానికులు గుమిగూడి క్షతగాత్రుణ్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం నరసింహారావును ఒంగోలు తరలించాలని వైద్యులు చెప్పారు. క్షతగాత్రుడి వివరాల కోసం పొదిలి ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించాలని వైద్యులు సూచించారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి

ఇద్దరికి స్వల్పగాయాలు

కొనకనమిట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగంపల్లి ఎస్సీ కాలనీలో వాసులు బుధవారం పాటకచేరీ కార్యక్రమానికి స్టేజి కడుతున్న క్రమంలో విద్యుదాఘాతానికి యువకుడు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగంపల్లి గ్రామంలో మేరీమాత కార్యక్రమంలో పాటకచేరీకి స్టేజి కడుతున్న గొట్లగట్టు గ్రామానికి చెందిన ఎండూరు. రాకేష్, గొంగటి బన్నీ, దొండేటి విశ్వనాథరెడ్డి విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ముగ్గురినీ తరలిస్తుండగా మధ్యలో రాకేష్ (19)మృతి చెందాడు. బన్నీ, వ్వినాథ్‌రెడ్డిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఏఎస్‌ఐ మహ్మద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

పొదిలి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వారంరోజులుగా తాగునీరు రావడంలేదని బాప్టిస్టుపాలెంకు చెందిన మహిళలు బుధవారం రోడ్కెక్కారు. పొదిలి-ఒంగోలు రహదారిపై బైటాయించి ఆందోళన చేపట్టారు. వారంరోజులుగా తాగునీరు, వాడుకనీరు లేక ఇబ్బందులకు గురవుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యపై పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో రోడ్డుపైకి వచ్చామన్నారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎస్‌ఐ వేమన అక్కడకు వెళ్లి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న మహిళలు



ప్రమాదకరంగా ఉన్న ఒంగోలు రోడ్డులోని చప్టా

చప్టా శిథిలం

ఇప్పటికైనా పట్టించుకోరా

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఒంగోలు వెళ్లే మార్గంలో రేడియో స్టేషన్ సమీపంలోని అలుగుపై చప్టా శిథిలావస్థకు చేరింది. 1977లో వచ్చిన తుఫాన్ సమయంలో చెరువు అలుగు పారి ఈ చప్టా కొట్టుకుపోవడంతో అప్పట్లో నూతనంగా నిర్మించారు. అనంతరం దానిని పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరింది. కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదు. బండరాళ్లతో నిర్మించిన గోడ ఒకవైపు కూలిపోవడంతో దానిని పైపులు వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మరోవైపు ఉన్న గోడ శిథిలమై చప్టాపై ఉన్న స్లాబు పెచ్చులుగా ఊడి పడుతున్నది. కానీ అధికారులు నేటి వరకు దీనిని పట్టించుకోవడం లేదు. నిత్యం ఒంగోలుకు వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి. ఇది కూలిపోతే ఒంగోలుకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గం కూడా లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ బ్రిడ్జిని నూతనంగా నిర్మించాల్సి ఉంది.

బిందు సేద్యంపై అవగాహన



మాట్లాడుతున్న ఉద్యాన అధికారి శ్వేత

గిద్దలూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుపల్లి గ్రామంలో ఆత్మ సంస్థ సౌజన్యంతో ఉద్యానవన రైతులకు అరటిసాగులో బిందుసేద్యం ద్వారా ఎరువులు అందించే విధానంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్‌గా విచ్చేసిన ఉద్యాన కళాశాల అసోసియేషన్ డీన్ సీవీ విజయభాస్కర్ మాట్లాడుతూ అరటి చెట్టుకు అధిక మొత్తంలో పోషకాలు అవసరమని, మట్టిలో ఉండే పోషకాలు చాలవన్నారు. సగటున ఒక మొక్కకు 20 కిలోల ఎఫ్‌వైఎం, 200 గ్రాముల నైట్రోజన్, 60 గ్రాముల పాస్పరస్, 300 గ్రాముల పొటాషియం అవసరం అవుతుందన్నారు. సాధారణంగా రైతులు ఎక్కువగా యూరియా వాడి పాస్ఫరస్, పొటాష్ తక్కువగా వేస్తున్నారన్నారు. సంప్రదాయ ఎరువులు వాడితే వర్షంతో కలిసి ఆవిరి అవుతాయన్నారు. ఈ సమస్య నివారణకు డ్రిప్ ద్వారా నీటిలో కరిగే ఎరువులను ఇవ్వడం వలన సమయం, శ్రమ తగ్గుతుందని, 20 నుంచి 25 శాతం దిగుబడి పెరుగుతుందన్నారు. అరటికి ఆశించే తెగుళ్ళను నివారణ చర్యల గురించి రిసోర్స్‌పర్సన్స్‌తోపాటు ఉద్యాన అధికారి శ్వేత రైతులకు వివరించారు.

పథకాలు అందనివారు అర్జీలు ఇవ్వండి

రాచర్ల : పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలకు అర్హత ఉన్నా లబ్ధిపొందని వారు దరఖాస్తులు ఇవ్వాలని ఏవో షేక్ మహబూబ్ బాషా అన్నారు. మండలంలోని పాలకవీడు, పలుగుంటిపల్లి గ్రామాల్లో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రైతులతో మాట్లాడారు.

అమరావతికి తరలిన ఆర్యవైశ్యులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో జరిగిన అమరజీవి పొట్టి శ్రీరాములు మ్యూజియం శంకుస్థాపన కార్యక్రమానికి మార్కాపురం నుంచి ఆర్యవైశ్యులు బుధవారం పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్ మాట్లాడుతూ అమరజీవి త్యాగాలను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో అమరావతిలో మ్యూజియం, విగ్రహాలను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. వైసీపీ ఆర్యవైశ్యులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. పొట్టి శ్రీరాములు మ్యూజియంను ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వం ఆర్యవైశ్యుల ఆధరాభిమానాలు పొందిందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అమరావతికి తరలుతున్న ఆర్యవైశ్యులు

మ్యాజిక్ డ్రెయిన్లతో పారిశుధ్యం మెరుగు

ఎమ్మెల్యే కందుల



పెద్ద నాగులవరం గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్లకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కందుల, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, అధికారులు

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణంతో గ్రామంలో పారిశుధ్యం మెరుగవుతుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దనాగులవరం గ్రామంలో బుధవారం జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని డ్వామా పీడీ జోసఫ్ కుమార్, అధికారులతో కలిసి ఎమ్మెల్యే చేశారు. ఈ సందర్భంగా కందుల మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. మ్యాజిక్ డ్రెయిన్ల వలన భూమిలోకి నీరు ఇంకిపోతుందన్నారు. దాని వలన భూగర్భ జలాలు పెరిగి నీటి లభ్యత పెరుగుతుందని తెలిపారు. అతి తక్కువ ఖర్చుతో ఇళ్ల వద్ద మురుగు సమస్యలు లేకుండా చేసుకోవచ్చునని కందుల తెలిపారు.

హరితహారంలో భాగంగా మొక్కలు నాటిన పిడి

పెద్దనాగుల వరం గ్రామం పరిధలో కొండపై డ్వామా పీడీ జోసఫ్ కుమార్ కొండపై మొక్కలు నాటాడు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీవో నాగరాజు, ఈసీ కిషోర్‌కుమార్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టీడీపీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ బాలూనాయక్

పాల ఉత్పత్తిలో జాగ్రత్తలు పాటించాలి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిలో జాగ్రత్తలు పాటించడం వలన అధిక ఉత్పత్తి పెరుగుతుందని గిద్దలూరు వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బాలూనాయక్ అన్నారు. బుధవారం మండలంలోని ముండ్లపాడు గ్రామంలో ఆత్మ సౌజన్యంతో మండల పశు వైద్యాధికారి డాక్టర్ కె.శ్రావన్‌కుమార్ అధ్యక్షతన పాడి పరిశ్రమలలో పరిశుభ్ర పాల ఉత్పత్తి పెంచడం గురించి పశుపోషకులు, రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బాలూనాయక్ మాట్లాడుతూ పాడిలో పాల ఉత్పత్తి పెంచేందుకు గేదెల పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచి వాటికి సరియైన పోషణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రాచర్ల పశువైద్యాధికారి డాక్టర్ హరిబాబు, ఏటీఎం వాణి పాల్గొన్నారు.

వీఆర్‌కు కొనకనమిట్ల ఎస్ఐ

కొనకనమిట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కొనకనమిట్ల ఎస్ఐగా పనిచేస్తున్న జీవి ప్రభాకర్‌రెడ్డిని ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు వీఆర్‌కు పిలిచారు. కారణాలు తెలియాల్సి ఉంది.



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంఈవోలు

వంటగది అపరిశుభ్రతపై ఆగ్రహం

కంభం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం కందులాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో వంటగది పరికరాలు అపరిశుభ్రంగా ఉండటంపై ఎంఈవోలు అబ్దుల్ సత్తార్, శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వారు పాఠశాలను సందర్శించిన సందర్భంగా వంటగది పరిసరాలు, చెత్తా చెదారంతో పేరుకుపోయి ఉండడంతో హెడ్మాస్టర్ దేమా వెంకటేశ్వర్లుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణ బాధ్యత ప్రధానోపాధ్యాయుడిదేనన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనశాలలో నాణ్యతా లోపాలను ఉపేక్షించమని తెలిపారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులకు యూడీఐడీ తప్పనిసరి

పుల్లలచెరువు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు యూడీఐడీ కార్డులు తప్పనిసరిగా ఉండాలని ఎంఈవో ఇందిరా ప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన పుల్లలచెరువులో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు క్యాంప్ నిర్వహించారు.

రీ-సర్వేపై తుది గ్రామసభ

కొమరోలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూరవారిపల్లి గ్రామ పంచాయతీలోని బెడుసుపల్లి గ్రామ రెవెన్యూ ఇలాకలో రీసర్వే తుది గ్రామ సభను బుధవారం తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. తహసీల్దార్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని బెడుసువల్లి గ్రామ రెవెన్యూ ఇలాకలో 205.56 ఎకరాల విస్తీర్ణంలో 435 ఎల్‌పీ నెంబర్లను ఏర్పాటుచేసి ఆ భూమి యజమానులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. పేర్లలో తప్పులుంటే 15వ తేదీలోపు సవరించుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ సిద్దయ్య, వీఆర్వో రాజేశ్వరి, సర్వేయర్లు మధుసూదన్‌రెడ్డి, వీఆర్ఏలు, గ్రామస్థులు మాదాల పుల్లయ్య, గురవ్పుడు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులపై కేసు నమోదు చేయాలి

మార్కాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్‌గాంధీ చిత్రపటాన్ని పెట్రోల్ పోసి తగులబెట్టిన బీజేపీ నాయకులపై కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ నాయకులు బుధవారం సీఐ పి.సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్, మహబూబ్ వలి, రిహాన, హుసేన్, సిద్ధిక్ పాల్గొన్నారు.

7న చెన్నయ్య ఆలయం మూసివేత

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చంద్ర గ్రహణం సందర్భంగా మార్కాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాన్ని ఈ నెల 7వ తేదీన ఆదివారం మూసివేస్తున్నట్లు ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం 6.00 గంటలకు ఆలయం తెరిచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు.

ఏకదంతుడికి కూరగాయలతో అలంకరణ



మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రుల్లో భాగంగా స్థానిక కోనేటి వీధిలోని విగ్రహాన్ని బుధవారం కూరగాయలతో అలంకరించారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో ఏకదంతుడిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

రాచర్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని ఎస్ఐ పీ కోటేశ్వరరావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తూ ఒంగోలు టు టౌన్ స్టేషన్‌కు బదిలీ అయిన ఏఎస్సై వై ఆదిశేషయ్యను మంగళవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆదిశేషయ్య మంచి వ్యక్తి అని రాచర్లలో ఆరు సంవత్సరాలుగా విధులు నిర్వహించి మెరుగైన సేవలు అందించి అందరి మన్ననలు పొందారన్నారు. తనకు సహకరించిన సిబ్బందికి ఏఎస్సై శేషయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.



ఏఎస్సై ఆదిశేషయ్యను సన్మానిస్తున్న పోలీస్ సిబ్బంది



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఎరువుల దుకాణాల తనిఖీ

పీసీపల్లి,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎరువుల దుకాణాలను పీసీపల్లి పోలీసులు బుధవారం మండల వ్యవసాయ అధికారితో కలిసి తనిఖీ చేశారు. పీసీపల్లిలో ఉన్న 2 ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన పోలీసులు దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువులను స్టాకు రిజిస్టరులో నమోదైన నిల్వలను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా ఎరువులను నిల్వ ఉంచి ఉద్దేశపూర్వకంగా కృత్రిమ కొరత సృష్టిస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా ఎరువులను నిల్వ చేసిన స్టాకును సీజ్‌చేస్తామని అన్నారు. ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీల్లో పోలీసుశాఖ సిబ్బందితో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.



వెలుగు కార్యాలయంలో ఆడిట్ నిర్వహిస్తున్న సెర్ప్ అధికారులు

జమా ఖర్చులపై ఆడిట్

పామూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో జిల్లాకు సంబంధించిన ఆడిటర్లు బుధవారం ఆడిట్ నిర్వహించారు. 2021 నుంచి 2025 వరకు జమా ఖర్చులకు సంబంధించిన రికార్డులను, రశీదులను జిల్లా ఆడిటర్లు నారాయణరెడ్డి, నవీన్‌రెడ్డి, సాయికుమార్, జిల్లా స్త్రీ నిధి మేనేజర్ సంపత్ కుమార్‌లు ఆడిట్ నిర్వహించారు. మండలంలోని 46 గ్రామ సంఘాలు, మండల సమాఖ్యకు సంబంధించి ఆడిట్ నిర్వహిస్తున్నారని ఏపీఎం జి. విద్యాసాగర్ తెలిపారు. ఇటీవల గోపాలపురం పొదుపు గ్రూపులకు సంబంధించి వీవోఏ రూ.26 లక్షల గోల్‌మాల్ జరగడం, జిల్లా అధికారులు రెండు రోజుల పాటు పూర్తి స్థాయిలో విచారించిన నేపథ్యంలో మండల సమాఖ్య ఆడిట్ నిర్వహించడంపై ప్రత్యేకత సంతరించుకొంది. ఈ కార్యక్రమంలో డీపీఎం షేక్ జిలానీబాషా, వీవోఏలు, ఎంఎస్ఎ, సీసీ, మండల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



జాతీయ పోషకాహార వారోత్సవాల్లో మాట్లాడుతున్న శాస్త్రవేత్త మానస

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి

దర్శి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మానస సూచించారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో బుధవారం జాతీయ పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఎదుగుదల సమయంలో ఉన్నందున పౌష్టికాహారం తీసుకుంటే శరీర ధారుడ్యం ఏర్పడుతుందన్నారు. ఆరోగ్య పరిరక్షణకు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పట్టణంలో ఇంటి కొలతలు వేస్తున్న పంచాయతీ సిబ్బంది

సమగ్రంగా స్వామిత్వ సర్వే

పామూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా స్వామిత్వ సర్వే చేపట్టిందని పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందరెడ్డి తెలిపారు. స్థానిక దేవాలయం వీధిలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను బుధవారం పరిశీలించారు. సర్వేను నిష్పక్షపాతంగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. సర్వే సిబ్బంది మీ ఇంటికి వచ్చినప్పుడు ఇంటి యజమాని ఆధార్, ఇంటి పన్ను రశీదు చూపించాలని, ఇంటి పన్నులు లేక పోతే ఇంటి డాక్యుమెంట్లు చూపెట్టాలన్నారు. మ్యాపు ఆధారంగా సర్వే చేపట్టి డిజిటల్ స్మార్ట్ కార్డులు జారీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు సంపూర్ణ సేవలందించాలి

కనిగిరి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ సిబ్బంది ప్రజలకు సంపూర్ణ సేవలు అందించాలని ఎంపీడీవో ప్రభాకరశర్మ అన్నారు. మండలంలోని చల్లగిరగల గ్రామంలోని సచివాల యాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నప్పటికి సిబ్బంది బాధ్యతారాహిత్యం కారణంగా ప్రజలు పట్టణాలకు రావాల్సివస్తుందని తమకు ఫిర్యాదులు అందాయన్నారు. ఎంపీడీవో సచివాలయానికి వెళ్లిన సమయంలో సకాలంలో హాజరు లేని సిబ్బందికి మెమోలు జారీ చేశారు.

7 న సీఐటీయూ మండల మహాసభ

సీఎస్‌పురం(పామూరు)సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ 4 వ మండల మహాసభ ఈనెల 7 వ తేదీ స్థానిక ఎంఎస్ఆర్ కళాశాల ఆవరణలో జరగనున్నట్లు గౌరవ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలోపలు కార్మిక సంఘాల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, ఉద్యోగుల సమస్యలపై నిరంతరం ఆదివారం పోరాడుతున్నదని తెలిపారు. ఈ మహాసభలలో స్కీం వర్కర్లు, వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులు, భవననిర్మాణ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఊసా రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగం

● కొరవడిన అధికారుల పర్యవేక్షణ..

● నీరుగారిన లక్ష్యం

దొనకొండ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వ్యర్థాలతో



శిథిలమై తుప్పు పట్టిన చెత్త తరలించే రిక్షా

గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని కల్పించాలనే లక్ష్యంతో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చెత్త నుంచి సంపద కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్వచ్ఛాంధ్ర మిషన్ క్రింద గ్రామాల్లో ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించేలా చర్యలు చేపట్టారు. ఆ కేంద్రాల్లో వానపాముల ద్వారా వర్మి కంపోస్టు ఎరువు తయారు చేసి రైతులకు నాణ్యమైన ధరలకు విక్రయించి గ్రామ పంచాయతీలకు కొంతమేర ఆదాయం చేకూర్చాలనేది ప్రభుత్వం ధ్యేయం. ఈ మేరకు మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం నిధులతో లక్షలు ఖర్చు చేసి చెత్త నుంచి సంపద కేంద్రాలు నిర్మించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ కేంద్రాల నిర్వహణను పట్టించుకోకపోవటంతో ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉండిపోయింది. ఈ కారణంగా ముళ్లపొదలు, చెట్లు పెరిగి గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. స్వచ్ఛ కార్మికులకు చెత్తను సేకరించేందుకు మంజూరు చేసిన చెత్త తరలించే రిక్షాలు ఉపయోగంలో లేక మూలన పడ్డాయి. కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బోర్లు నిరుపయోగంగా మిగిలిపోయాయి. ప్రభుత్వ ఉద్దేశం ఉన్నతంగా ఉన్నా క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయిందని ప్రజలు భావిస్తున్నారు. ప్రస్తుతం అధికారం చేపట్టిన టీడీపీ కూటమి ప్రభుత్వం చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టినట్లు ప్రకటనలే తప్ప ఆచరణలో ఎటువంటి అడుగులు ముందుకు పడలేదనేందుకు మండలంలోని కేంద్రాలు అందుకు నిదర్శనమని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇటీవల దొనకొండ పంచాయతీలోని చెత్త సంపద కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారీకి సిద్ధం చేయగా మిగిలిన కేంద్రాల్లో ఆటువంటి చర్యలు చేపట్టకపోవటంతో అలంకారంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా గ్రామ పంచాయతీలకు ఆదాయం చేకూర్చేలా కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కొచ్చెర్లకోట గ్రామంలో
నిరుపయోగంగా మిగిలిన చెత్త నుంచి సంపద కేంద్రం

మండల సమగ్రాభివృద్ధికి సమన్వయంతో కృషి

● మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరెడ్డి

సీఎస్‌పురం(పామూరు)సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి) : మండలాభివృద్ధికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి అభివృద్ధికి కావాలసిన బాటలు వేయాలని డీఎల్‌డీవో, మండల ప్రత్యేకాధికారి కే శ్రీనివాసరెడ్డి సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మండల స్థాయి అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై కోఆర్డినేషన్ సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై అధికారులు అవగాహన కలిగి ఉండటమే కాకుండా లబ్ధిదారులకు సక్రమంగా చేరే విధంగా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రతి బుధవారం జరిగే సమీక్ష సమావేశంలో ప్రభుత్వ పథకాల అమలు పురోగతి సమాచారం కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య, డిప్యూటీ ఎంపీడీవో రమణయ్య, ఎంఈవో జే ప్రసాదరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, జి. మోహన్‌రావు తదితర సిబ్బంది పాల్గొన్నారు. కాగా పామూరులో జరిగిన సమీక్ష సమావేశంలో డీఎల్‌డీవో శ్రీనివాసరావు పాల్గొని అభివృద్ధికి సంబంధించి పలు సూచనలు చేశారు.

ఈ సమావేశంలో ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, డిప్యూటీ ఎంపీడీవో సుందరరామయ్య, ఎంఈవో -2 కే కరుణకుమారి, ఏపీఎం జి. విద్యాసాగర్, పంచాయతీ రాజ్ ఏఈ షేక్ మస్తాన్‌వలి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వై.రమేష్, ఏపీవో బి. మాల్యాద్రి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, శివ పార్వతి పాల్గొన్నారు. అనంతరం ఉపాధి పనులపై టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం సమావేశం నిర్వహించారు.

ఇంకుడుగుంతలు, హార్టికల్చర్, బండ ప్లాటింగ్, తదితర అంశాలపై చర్చించి పనుల లక్ష్యాలను అధిగమించాలని తగు సూచనలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో శ్రీనివాసరావు

బస్‌షెల్టర్ నిర్మాణ పనులకు శ్రీకారం

పసుపుగల్లులో రెండు సార్లు ప్రభుత్వభూమి ఆక్రమణకు వైసీపీ నేత యత్నం

ఎట్టకేలకు స్పందించిన సర్పంచ్, అధికారులు

ముండ్లమూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పసుపుగల్లు గ్రామ సర్వే నంబర్ 168,169లో ఉన్న ప్రభుత్వ స్థలంలో పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్, అధికారులు బస్‌షెల్టర్ నిర్మాణానికి బుధవారం శ్రీకారం చుట్టారు. ఆస్థలాన్ని వైసీపీ మండల అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి ఆక్రమించుకోగా గ్రామ పంచాయతీ ఆస్థలం ప్రభుత్వ స్థలంగా గుర్తించి గత నెల 26వ తేదీ ఆస్థలంలోని అక్రమ కట్టడాలను తొలగించింది. అయితే ఆస్థలం తనదేనంటూ వైసీపీ నేత రెండు రోజుల క్రితం దేవాలయ నిర్మాణం పేరిట మట్టి తోలించాడు. ఆస్థలం వద్ద అంజేయస్వామి, నరసింహస్వామి ఫ్లెక్సీలను కూడాఏర్పాటు చేయించాడు. దీంతోగ్రామపంచాయతీ అప్రమత్తమైంది. బస్టాండ్ సెంటర్‌లో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా ఆ ప్రభుత్వ స్థలంలో బస్‌షెల్టర్ నిర్మాణం చేయాలని పంచాయతీ తీర్మానం చేశారు. అయితే రెవెన్యూగ్రామకార్యదర్శి ఆస్థలంలో ఇతరులు ఎవరూ ప్రవేశించరాదని బోర్డు ఏర్పాటు చేశారు. సమస్య జటిలంకాకుండా ఉండాలన్న ధ్యేయంతో గ్రామపంచాయతీ సర్పంచ్ వరగాని బాలసుందరరావు, ఎంపీటీసీ అంజయ్య, టీడీపీ నేత బిజ్జం సుబ్బారెడ్డి మండల పరిషత్‌నుంచి రూ. 5లక్షల నిధులు సమీకరించి వెంటనే ఆప్రభుత్వ స్థలంలో మార్కింగ్ ఇచ్చి బస్‌షెల్టర్ నిర్మాణం కోసం ఎక్స్‌కవేటర్‌తో పనులు ప్రారంభించారు.



ప్రభుత్వ స్థలంలో బస్‌షెల్టర్ నిర్మాణం కోసం ఎక్స్‌కవేటర్‌తో చేస్తున్న పనులు

కందిలో కలుపు నివారణకు చర్యలు చేపట్టాలి

● పొలం పిలుస్తోందిలో వ్యవసాయాధికారులు

కనిగిరి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కంది సాగులో కలుపు మొక్కల నివారణకు చర్యలు చేపట్టాలని ఏడీఏ జైనులాబ్దిన్ అన్నారు. మండలంలోని చీర్లదిన్నె, బల్లిపల్లి గ్రామాల్లోని పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బుధవారం కంది, పెసర, సజ్జ పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రైతు సేవాకేంద్రం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిరు జల్లులు కారణంగా కంది సాగులో కలుపు మొక్కలు పెరిగే అవకాశం ఉందన్నారు. కలుపు నివారణకు గొర్రుతో అంతరకృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరాణాధికారి మాల్యాద్రి, వీఏఏలు వెంకటరెడ్డి, వినయ్, పశువైద్యసిబ్బంది వెంకటరెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.



చీర్లదిన్నె గ్రామంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ జైనులాబ్దిన్

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పామూరు, : పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక పంట ఉత్పత్తి సాధించవచ్చునని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి వీవీ శేషమ్మ సూచించారు. మండలంలోని రావిగుంటపల్లి గ్రామంలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాష్ యోజన 2025 ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటలలో చేపట్టాల్సిన పద్ధతులపై బుధవారం రైతులకు శిక్షణ నిర్వహించారు. అనంతరం వివిధ పంటలలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి కరదీపికలను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఏవో టి. అబ్రహాం లింకన్, పంచాయతీ కార్యదర్శి పి.బేబి, వీఏఏ సరస్వతి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కంచర్ల శ్రీను, రమేష్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు అందిస్తున్న వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్

15 లోపు పంటలు నమోదు చేసుకోవాలి

దొనకొండ : మండలంలోని గ్రామాల్లో పంటల సాగు చేసిన రైతులందరూ ఈనెల 15వ తేదీ లోపు వారు సాగు చేసిన పంటలను ఈ పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్ సూచించారు. మండలంలోని మంగినపూడి, భూమనపల్లి గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పంటలు వేసిన రైతులు వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఖచ్చితంగా ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. ఎరువుల దుకాణాల నిర్వాహకులు యూరియాను అధిక ధరలకు అమ్మినట్లు తమ దృష్టికి తెస్తే వెంటనే వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొగాకు సాగు తగ్గించాలి

ముండ్లమూరు :రైతులు పొగాకు సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని దర్శిసహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాలాజీ నాయక్ తెలిపారు. మండలంలోని జమ్మల మడక, మారెళ్ల గ్రామాల్లో ఏడీఏ బుధవారం పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. మండలంలో ఎరువుల కొరతలేదన్నారు.కావాల్సిన రైతులు రైతుసేవా కేంద్రం, సొసైటీల ద్వారా పొందాలన్నారు. మండల వ్యవసాయాదికారి ఏతిరుమలరావు,విఏఏలు రాధారాణి, బాలవెంకటయ్య పాల్గొన్నారు.

ముండ్లమూరులో ఒకేరోజు ముగ్గురు మృతి

● ఇద్దరికి గుండెపోటు , విషజ్వరంతో చిన్నారి మృతి

ముండ్లమూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముండ్లమూరులో బుధవారం ఒకే రోజు ముగ్గురు మృతి చెందటంతో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి. గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన జమ్ముల అంజమ్మ(64) గుండెపోటుతో మృతి చెందింది. మంగళవారంరాత్రి బీసీసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంది. ఆతరువాత రాత్రి సమయంలో ఒక్కసారిగా గుండెపోటుకు గురైంది.ఆమెను ఆసుపత్రికి తరలించే లోపు మృతి చెందింది.

అలాగే అంబేడ్కర్ నగర్‌కు చెందిన వనం పెద అంజయ్య(65) గుండెపోటుకు గురై మృతి చెందాడు. సాయిబాబా దేవాలయం వద్ద అపస్మారకస్థితిలో పడి ఉండటంతో కొందరు గమనించికుటుంబ సభ్యులకు తెలిపారు. వారు వెళ్లి వెళ్లిచూడగా మృతిచెందాడు.

అదేకాలనీకి చెందిన కూడలి శ్యాంసన్, చిన్నీలకుమార్తె గ్రేసీ(ఏడాదిపాప) మూడు రోజులుగా విష జ్వరంతో బాధపడుతోంది. బుధవారం ఇంటి ముందు ఆడుకుంటూ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో ఒకే రోజు గ్రామంలో ముగ్గురు మృతి చెందటంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

వినాయక ఊరేగింపులో టీడీపీ, వైసీపీ వర్గాల ఘర్షణ

● పలువురికి గాయాలు - కేసుల నమోదు

తాళ్లూరు,సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగంబొట్లపాలెం పంచాయతీ అయ్యలపాలెంలో వినాయక ఊరేగింపు విషయంలో టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణ జరిగింది. పలువురికి గాయాలయ్యాయి. దీనిపై బుధవారం స్థానికపోలీస్ స్టేషన్‌లో కేసునమోదయింది. మంగళవారం రాత్రి గ్రామంలో టీడీపీ వారు ఏర్పాటు చేసి వినాయక స్వామి విగ్రహ ఊరేగింపు జరుగుతోంది. విగ్రహం వైసీపీ వారి వీధిలోకి వెళ్లిన సమయంలో బాణసంచ కాల్చుతుండగా వైసీపీ శ్రేణులు అడ్డుకున్నారు. దీంతో టీడీపీ,వైసీపీ వర్గీయుల వద్ద వాగ్వివాదం జరిగింది. ఇరువర్గాలు పరస్పరం జెండా కర్రలు,రాళ్లతో దాడి చేసుకున్నారు. బందోబస్తులో ఉన్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈదాడిలో టీడీపీ వర్గీయులు వల్లభనేని కిషోర్‌బాబు మరి కొందరికి, వైసీపీ వర్గానికి చెందిన గవదకట్ల రమణయ్య మరి కొందరికి గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్. మల్లిఖార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పోర్ట్స్ కోటా కింద పీడీ పోస్టుకు ఎంపిక



శివారెడ్డి

ముండ్లమూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ఈదర గ్రామానికి చెందిన అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు పోతిరెడ్డి శివారెడ్డి స్పోర్ట్స్ కోటా కింద ఫిజికల్ డైరెక్టర్ పోస్టుకు ఎంపికయ్యాడు.ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షల్లో క్రీడాకారుల కోటా కింద ప్రభుత్వ ఉద్యోగం పీడీ పోస్టు సాధించాడు. మండలంలోని ఈదర గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబానికి చెందిన పోతిరెడ్డి గుర్వారెడ్డి కుమారుడు శివారెడ్డి చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి కనపరుస్తూ ఖోఖో పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి జిల్లా,రాష్ట్ర,అంతర్జాతీయ క్రీడాకారుడుగా రాణించాడు.ఉద్యోగాల కోసం అన్వేషిస్తూ ఇటీవల నిర్వహించిన పోస్టల్ ఉద్యోగాల్లో ఎస్‌పీఎంగా ఉద్యోగం పొంది విధులు నిర్వహిస్తున్నాడు. ఖోఖో క్రీడాకారుడు శివారెడ్డి పీడీగా ఎంపిక కావటం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

సీతారామిరెడ్డి సహకారం వల్లే పీడీ పోస్టుకు ఎంపికయ్యా

- పోతిరెడ్డి శివారెడ్డి

తాను పంగులూరులోని ఎస్ఎస్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ పొంది అంతర్జాతీయ క్రీడాకారుడుగా గుర్తింపు పొందడానికి గురువు, ఫిజికల్ డైరెక్టర్ మేకల సీతారామిరెడ్డి ప్రధాన కారణం. ఖోఖోలో రాణించినందునే ఇటీవల జరిగిన మెగా డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద ఫిజికల్ డైరెక్టర్‌గా ఎంపికయ్యాను. నాతల్లిదండ్రులు వ్యవసాయంపై ఆధారపడి నన్ను ప్రోత్సహించారు.

సులువైన రీతిలో సైన్స్ బోధన

● రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయిన సరోజనీదేవి

వెలిగండ్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సైన్స్ ప్రయోగాల ద్వారా ప్రాజెక్ట్ ప్రదర్శనలతో సులువైన మార్గంలో విద్యార్థులకు బోధన చేస్తూ పలువురు అధికారుల మన్నలు పొందిన వెలిగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న బి. సరోజనీదేవిని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ప్రకటించింది. మండలంలోని కంకణంపాడు గ్రామానికి చెందిన సరోజనీదేవి 30 ఏళ్లుగా వెలిగండ్ల మండలంలోని మోగళ్ళూరు, వెలిగండ్ల తదితర ఉన్నత పాఠశాలల్లో ఫిజిక్స్ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. 2018లో ఉత్తమ జిల్లా స్థాయి ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకుంది. 2024 సంవత్సరానికి సేవింగ్ అండ్ ఫుడ్, గ్రీన్ క్రాప్ ప్రాజెక్టు క్రింద తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టుకు రాష్ట్రం తరఫున జాతీయ స్థాయికి ఎంపికై బెస్ట్‌గైడ్ అవార్డు అందుకుంది. 2024 లో అప్పటి కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా ఉత్తమ సేవల అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల నుంచి ఇంటికి వెళ్లగానే పేద విద్యార్థులకు గ్రామంలో 25 ఏళ్లుగా ఉచితంగా స్టడీ అవర్స్ నిర్వహిస్తూ ఎంతోమందిని ప్రయోజకులను చేశానని, ఎన్నో ప్రాజెక్టులు రూపొందించి విద్యార్థులకు అర్థమయ్యేలా సులభ రీతిలో బోధన చేశానని, నాసేవలను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు ప్రకటించినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అత్యుత్తమ సేవలకు గుర్తింపు

● రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైన ఉపాధ్యాయిని ఈశ్వరమ్మ

పీసీపల్లి,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి):పీసీపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(సోషల్)గా పనిచేస్తున్న జి.ఈశ్వరమ్మ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు.సర్వీస్‌లో నాణ్యమైన బోధన చేయడంతో పాటు పనిచేసిన పాఠశాలల అభివృద్ధికి తన సొంత నిధులు వెచ్చించారు.ఉపాధ్యాయిని ఈశ్వరమ్మ 1996లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. అంకభూపాలపురం, పోకూరు, కందుకూరు, కొండసముద్రం గ్రామాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న సమయంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించిన ఆమె నవోదయ, గురుకుల పాఠశాల, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో సీట్లు సాధించేందుకు కృషిచేశారు. అంతేకాకుండా ఆయా పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారంతో పాటు తన సొంత నిధులను ఖర్చు చేసి పేద పిల్లలకు నోట్‌బుక్స్, యూనిఫామ్స్, కంప్యూటర్లు, ఉచితంగా ట్యూషన్లు పెట్టించడం వంటివి చేశారు. గతంలో రెండుసార్లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు. ఆమె సేవలను గుర్తించిన ప్రభుత్వం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసింది.ఈ నెల 5న విజయవాడలో జరగనున్న ఉపాధ్యాయ దినోత్సవంలో ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును అందుకోనున్నారు.ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డుకు ఎంపికైన ఈశ్వరమ్మను ఎంఈవోలు సంజీవి, ఆర్.శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగ చోరీ

తాళ్లూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొద్దికూరపాడు గ్రామ పొలాల్లో మంగళవారం రాత్రి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగితీగను దొంగిలించుకువెళ్లారు. గ్రామంనుంచి కొత్తశివాలయం సమీపాన గాడివాగు వద్ద గల పొలాల్లో వున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు దిమ్మెపై నుంచి తొగించారు.ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి కాపర్ తీగను, ఆయిల్‌ను దొంగిలించారు. ఈ విషయమై రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



ట్రాన్స్ ఫార్మర్‌ను ధ్వంసం చేసి పడవేసిన చోరులు





పల్లెలకు పైసలొచ్చాయ్!

జిల్లాల వారీగా నిధులు విడుదల ఇలా..		
జిల్లా	అన్‌టైడ్ నిధులు	టైడ్ నిధులు
పల్నాడు	12,31,45,384	18,47,18,101
బాపట్ల	9,34,29,265	14,01,43,899
గుంటూరు	6,55,92,007	9,83,88,023

పంచాయతీలకు ఎట్టకేలకు నిధుల మోక్షం లభించింది. ఎనిమిది నెలల అనంతరం పంచాయతీల వారీగా వాటి బ్యాంకు ఖాతాలకు 15వ ఆర్థిక సంఘం రూ. 70.04 కోట్ల నిధులు జమ చేసే ప్రక్రియను ప్రభుత్వం బుధవారం ప్రారంభించింది. రెండు మూడు రోజుల్లో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పంచాయతీలకు నిధులు జమ అవుతాయని పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు తెలిపారు.

పంచాయతీల ఖాతాలకు రూ 70.04 కోట్లు జమ

- ఎట్టకేలకు నిధులు విడుదల చేసిన ఆర్థిక సంఘం
- నిధుల విడుదలతో పంచాయతీల పాలక వర్గాల హర్షం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గ్రామ పంచాయతీలకు 2024-25 సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులను జనవరిలోనే కేంద్రప్రభుత్వం విడుదల చేసింది. అయితే ప్రభుత్వం ఈ నిధులను పంచాయతీలకు విడుదల చేయకుండా తన ఖాతాలోనే ఉంచుకుంది. పంచాయతీల సర్పంచ్‌లు ఉద్యమ బాట పట్టిన నేపథ్యంలో నిధులను విడుదల చేసింది. పంచాయతీలకు అన్‌టైడ్ గ్రాంటు కింద రూ 28.21 కోట్లు, టైడ్ గ్రాంటు కింద 41.82 కోట్లు విడుదలయ్యాయి. ఈ మొత్తాన్ని జనాభా ప్రాతిపదికన పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తున్నారు. మొదటి విడతలో కొన్ని పంచాయతీలకు ఉన్న బకాయిలను కూడా ఆర్థిక సంఘం విడుదల చేసింది.



నిధులు విడుదలతో పంచాయతీలకు ఊరట

కనీసం బ్లీచింగ్ కూడా కొనలేని స్థితిలో పంచాయతీలు కొట్టిమిట్టాడుతున్న సమయంలో ఆర్థిక సంఘం నిధుల విడుదల ఊరట నిచ్చింది. మొత్తం నిధుల్లో 60 శాతం టైడ్ నిధులుగా, 40 శాతం అన్‌టైడ్ నిధులుగా విడుదలయ్యాయి. టైడ్ నిధులను ఓడీఎఫ్ నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తాగు నీటి సరఫరా, రహదారుల నిర్మాణం వంటి పనులకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ నిధులను నిబంధనల మేరకు ఖర్చు చేయాలి. ఇందుకు సంబంధించిన లెక్కలు పక్కాగా ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది. ఆర్థిక సంఘం నిధులు విడుదలైన ప్రతిసారీ పంచాయతీల విద్యుత్ బకాయిలకు కొంత మొత్తాన్ని చెల్లించాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది. అదే తరహాలో ఇప్పుడు అన్‌టైడ్ గ్రాంటుగా విడుదల చేసిన రూ.28.21 కోట్లలో పది శాతం విద్యుత్ బకాయిలకు కచ్చితంగా చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మరో పది శాతం నిధులను ఎల్ఈడీ వీధి దీపాల నిర్వహణకు, 20 శాతం నిధులను కాంట్రాక్ట్ సిబ్బంది వేతనాలకు, కంప్యూటర్ల కొనుగోలు, స్టేషనరీ ఇతర సామగ్రి కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించింది. అలాగే పాఠశాల భవనాల (మిగతా 6వ పేజీలో)

బార్లు బాధలు



రావాల్సిన దరఖాస్తులు ..

బాపట్ల జిల్లాలో తొలుత 17 బార్లకు నోటిఫికేషన్ వెలువడగా రెండింటికే మాత్రం నిబంధనల ప్రకారం దరఖాస్తులు రాగా 15 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీటికి కనీసం 60 దరఖాస్తులు రావాలి. అదేవిధంగా గుంటూరులో 67 బార్లకు 268, పల్నాడులో 30కి 120 దరఖాస్తులు ఈ నెల 14లోగా రావాల్సి ఉంది.

దరఖాస్తులకు స్పందన అంతంతే

- ఎక్సైజ్ అధికారులపై ఉన్నతాధికారుల కన్నెర్ర
- అన్నింటికీ లాటరీ జరగాలని అనధికారిక ఆదేశాలు
- నిర్దేశించిన స్థాయిలో దరఖాస్తులు రాకుంటే పోస్టింగులకే ముప్పు?
- గడువు పొడిగిస్తున్నా ముందుకురాని వ్యాపారులు.. తాజాగా రీనోటిఫికేషన్

బాబ్బాబు దరఖాస్తు వేయండి

నూతన ఎక్సైజ్ పాలసీ ప్రకారం మద్యం బార్లకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. రీ నోటిఫికేషన్ జారీ నేపథ్యంలో ఈసారి ఎలాగైనా మొత్తం బార్లకు లాటరీ ప్రక్రియ జరగాల్సిందేనని ఉన్నతాధికారులు హెచ్చరించారు. దీంతో వ్యాపారులు దరఖాస్తులు వేసేలా ఎక్కడికక్కడ ఎక్సైజ్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. గతంలో బెదిరించగా వ్యాపారులు స్పందించలేదు. దీంతో ఇప్పుడు బతిమిలాడుకుంటున్నారు. కొన్ని చోట్ల అధికార పార్టీ నేతలను కలిసి దరఖాస్తుల గండం నుంచి గట్టెక్కించాలని అభ్యర్థిస్తున్నారు. ఇద్దరు ముగ్గురు కలిసి నాలుగు దరఖాస్తులు వేస్తే ఆ బార్ వారికే వచ్చేలా చూస్తామని అధికారులు హామీ ఇస్తున్నట్లు సమాచారం. నిబంధనల విషయంలో కొంత లిబరల్‌గా కూడా ఉంటాం ముందు దరఖాస్తు చేయండని కూడా కోరుతున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మద్యం బార్ల పాలసీ ఎక్సైజ్ అధికారుల పాలిట శాపంలా మారిందా అంటే చోటుచేసుకుంటున్న పరిణామాలు అలాగే ఉంటున్నాయి. గతంలో మద్యం వ్యాపారం అంటే పెద్దఎత్తున పోటీ ఉండేది. ప్రభుత్వానికి దరఖాస్తుల రూపంలోనే రూ.కోట్లతో ఖజానా నిండేది. గతంలో వైన్స్ లైసెన్సుల జారీలోనూ ఇదే పరిస్థితి. అయితే గత నెలలో బార్లకు నోటిఫికేషన్ జారీ చేయగా వ్యాపారుల నుంచి కనీస స్పందన లేకుండా పోయింది. గడువు పొడిగించినా మూడో వంతు బార్లకు కూడా లాటరీ తీయలేకపోయారు. ఈ పరిస్థితుల్లో తాజాగా ఎక్సైజ్ శాఖ రీ నోటిఫికేషన్ జారీ చేసింది. బుధవారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారం భించింది. అయితే దరఖాస్తులు వేసేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో అధికారుల బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఒకవైపు ఉన్నతాధికారుల హెచ్చరికలు.. మరోవైపు వ్యాపారుల నుంచి స్పందన అంతంతే కావడంతో ఎటూ పాలుపోని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు. రెండు సార్లు గడువు పొడిగించినా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో రెండు రోజుల క్రితం బాపట్ల జిల్లా ఈఎస్‌ను కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయించారు. బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్దేశించిన స్థాయిలో దరఖాస్తులు పడకపోతే వాటి పరిధిలోని ఎక్సైజ్ సీఐలపై కూడా వేటు తప్పదనే సంకేతాలను ఉన్నతాధికారులు పంపించారు. ఈ నేపథ్యంలో బాపట్ల జిల్లాలో 15, గుంటూరు జిల్లాలో 67, పల్నాడులో 30 బార్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రభుత్వం తాజాగా రీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 14 వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు, 15న లాటరీ ప్రక్రియ ముగించి బార్లను కేటాయించాలని అందులో తెలిపింది. ఈ క్రమంలో రంగంలోకి దిగిన అధికారులు దరఖాస్తుదారుల కోసం వేట మొదలుపెట్టారు. గతంలో నోటిఫికేషన్ వచ్చిన సమయంలో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై ఎక్సైజ్ అధికారులు (మిగతా 6వ పేజీలో)

ప్రకృతి వ్యవసాయోత్పత్తులతో

ఆరోగ్యం

కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయోత్పత్తులను వినియోగించి ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ప్రకృతి వ్యవసాయోత్పత్తులపై కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ విభాగం, డీఆర్‌డీఏ, వెలుగుశాఖల సమన్వయంతో మండల, జిల్లా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయోత్పత్తుల విక్రయకేంద్రాలను ప్రారంభించాలన్నారు. పురుగుమందు అవశేషాలు లేని ఆకుకూరలు, కూరగాయలు, ఆహార, పప్పుధాన్యాలు, నూనెల ఉత్పత్తులను సేకరించి ఆయా కేంద్రాల్లో విక్రయించాలని తెలిపారు. ఆర్గానిక్ సర్టిఫికేషన్ పొందిన వారి నుంచి మాత్రమే ఉత్పత్తులను సేకరించాలన్నారు. ప్రకృతి వ్యవసాయోత్పత్తుల వినియోగంతో క్యాన్సర్, మధుమేహం, రక్తహీనత, సంతానలేమి వంటి అనేక అనారోగ్యాలు నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. గతంలో 174పంచాయతీలలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు అమలు చేశామని, మరో 273 గ్రామాల్లో అమలుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం రైతు సాధికారిత సంస్థ, ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ సంక్షిప్త మార్గదర్శిణి, ప్రకృతి వ్యవసాయ విధానాల కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి షేక్. కలీమ్, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి వేణుగోపాల్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సయ్యద్ అక్తర్ హుస్సేన్, ప్రకృతి వ్యవసాయ విభాగం అడిషనల్ డీపీఎమ్ జె.మోహన్, డీఆర్‌డీఏ పీఎమ్ సరిత తదితరులు పాల్గొన్నారు.


బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, అధికారులు

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

- జాబితా ప్రకటించిన జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ పురుషోత్తం



బాపట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారి వివరాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం బుధవారం ప్రకటించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్ర వారం జరిగే గురుపూజోత్సవంలో అవార్డులు అందజేస్తామని తెలిపారు. ఎంపికైన వారి వివరాలు.. వివి.కృష్ణారావు (చెరువుజమ్ములపాలెం), ఎ.రమాదేవి(మరుప్రోలువారిపాలెం), ఐ.అనిత(కొండమంజులూరు), వై.సత్యవతి(బాపట్ల), పి.రంగారావు(వడ్డెసంఘం), ఎ.శోభారాణి(అమర్తలూరు), పీఎల్ ప్రసన్నకుమారి(కావూరు), ఆర్.శ్రీనివాసరావు(తిమ్మాయపాలెం), బివి.చంద్రారావు(చెరువుజమ్ములపాలెం), కె.సుజాత(చినగంగాజం గొల్లపాలెం), కె.ప్రతిమ(ఇంకొల్లు మండలం చందలూరు), కె.కవితదేవి(బాపట్ల డీకేపాలెం), ఎల్.కోటేశ్వరరావు(అల్లూరు), ఎం.రాహుల్‌దేవదత్తు(పెదగొల్లపాలెం), కె.శ్రీనివాసరావు(బాపట్ల) ఆర్.శివవెంకట పోతురాజు(రాజుబంగారుపాలెం), బి.లలితాంబ(కఠారివారిపాలెం), కె.రమేష్‌బాబు(ఇంకొల్లు), జె.శ్రావణి(వేటపాలెం), బి.చిన్నఅంకారావు(చక్రాయపాలెం), టి.అంకరాజు(పూనూరు), యు.చెంచయ్య(దుండుకూరు), ఎం.అక్రమ షెరీఫ్(న్యూగొడవరి), కె.విజయచంద్ర(కారంచేడు), జి.వీరాంజనేయులు(కొప్పెరపాలెం), టి.ఇందిర(నాయనపల్లి), ఓ.రోజారమణి(వెల్లటూరు), ఎం.వి.ఆర్.ఐ.పి.శారదా(సురవరపుపల్లి), వై.విజయలక్ష్మి(పేరలి), యు.రాజశేఖర్‌రావు(మడేపల్లి మెయిన్), బి.శ్రీనివాసు(బాపట్ల హనుమాన్‌నగర్)

రాష్ట్రస్థాయిలో..

జిల్లా నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ముగ్గురిని ప్రకటించారు. అద్దంకి తిమ్మాయిపాలెం హైస్కూల్ ఉపాధ్యాయుడు డాక్టర్ జె.ప్రతాప్, సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం హైస్కూల్ ఉపాధ్యాయురాలు కె.మోహనాంజలి, అద్దంకి ఎంపీపీఎస్ ఉపాధ్యాయురాలు ఎం.ధనలక్ష్మిలను ఎంపిక చేశారు.

కుటుంబ స్థిరత్వంలో స్త్రీ కీలకం

- భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సంక్షేమ పథకాలు
- స్త్రీశక్తి విజయోత్సవ సభలో ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుటుంబ స్థిరత్వంలో స్త్రీ పాత్ర ఎంతో ముఖ్యమైనదని, అందుకే వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. వేమూరులో బుధవారం సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ స్త్రీ శక్తి విజయోత్సవ సభ నిర్వహించారు. గ్రామాల నుంచి విచ్చేసిన మహిళలు వేణుకేశవస్వామి ఆలయం నుంచి ఎమ్మెల్యేతో కలిసి ఎన్టీఆర్ పురవేదిక వరకు ర్యాలీగా చేరుకున్నారు. యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ఏపీలో ప్రభుత్వం మహిళలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మహిళలకు ప్రత్యేకంగా ఉచిత బస్సు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకాలు ప్రస్తుతం అమలు అవుతుండగా త్వరలో ఆడబిడ్డ నిధి పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. డ్వాక్రా వ్యవస్థ ఏర్పాటుకు మూలపురుషుడు చంద్రబాబని చెప్పారు. గతంలో దీపం పథకంలో ఒకేసారి 65 లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారన్నారు. ఎన్టీఆర్ హయాంలో రూ.60తో ప్రారంభించిన పింఛన్ ప్రస్తుతం రూ.4 వేలకు పెంచి అందిస్తున్నామన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా ప్రతీ కుటుంబానికి నెలకు రూ. 1000 నుంచి 1500 వరకు మిగులుతుందన్నారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే విధంగా ఐటీ రంగాన్ని మంత్రి లోకేశ్ బలోపేతం చేస్తున్నారన్నారు.జగన్ పాలనలో ఎన్నో అకృత్యాలు జరిగాయని, ప్రజాస్వామ్య విలువలను కాలరాసి మహిళా సంక్షేమాన్ని కూడా పక్కన పెట్టారన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మోసం చేయడంతో పాటు రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీశారన్నారు. జగన్ నిర్వీర్యం చేసిన పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణాలను పూర్తి చేస్తున్నామన్నారు. 2047 డాక్యుమెంటరీ ద్వారా అన్ని ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళలంతా చంద్రబాబును దీవించాలని కోరారు. ప్రజా సేవకుడిగా పని చేస్తానని, ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకు వస్తే సహకరిస్తానని ఆనందబాబు హామీ ఇచ్చారు. సభలో టీడీపీ పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు వంగా సాంబిరెడ్డి, నాయకులు సాయిబాబు, మైనేని మురళీకృష్ణ, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త రాజేష్, మండల పార్టీ అధ్యక్షుడు గాజుల వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్, శివారెడ్డి, మేరీవర్ధిని, కొల్లూరు శ్రీధర్, గవిని లక్ష్మీదుర్గా, వాకా శేషు, శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు


సభకు హాజరైన మహిళలు

లక్షలు వ్యయం.. అసంపూర్తి పనులు

- పార్కుల ప్రారంభంపై మంత్రి అనగాని ఆగ్రహం
- బినామీ పేర్లతో మున్సిపల్ అధికారులే కాంట్రాక్టర్లు

రేపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాదంగా.. పచ్చదనంతో కనువిందు చేసేలా పార్కుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.లక్షలు కేటాయించింది. అయితే ఆ నిధులు ఏమయ్యాయో కానీ అసంపూర్తిగానే పార్కుల్లో పనులు కనిపిస్తున్నాయి. పట్టణంలోని 2వ వార్డులోని ఎస్సీ కాలనీలో పార్కు అభివృద్ధి కోసం రూ.14 లక్షలు వెచ్చించారు. అయితే కనీసం రూ.3 లక్షలైన ఖర్చు చెయ్యని పరిస్థితి నెలకొంది. చిన్నారులు ఆడుకునే 4 ఆట వస్తువులను ఏర్పాటు చేశారే తప్ప పార్కులో కనీసం సేదతీరేందుకు బల్లలు వేసిన దాఖలాలు లేవు. కనీసం మొక్కలు కూడా కనిపించవు. లోపలకు, బయటకు వెళ్ళే సీసీరోడ్డు నిర్మాణం కీవాల్‌కే పరిమితమైంది. తాగునీటి పైప్‌లైన్లు వేసిన పరిస్థితి లేదు. నామమాత్రంగా ఇసుక తోలి పార్కు సిద్ధమైందని మంత్రి పేరుతో బోర్డు పెట్టారు. చంద్రమౌళిపార్కుకు రూ.26 లక్షలు మంజూరు చేస్తే కనీసం మట్టి లెవలింగ్ చెయ్యలేదు. వాకింగ్‌ట్రాక్ కీవాల్స్ వేసి వదిలేశారు. మంత్రి అనగాని ప్రశ్నిస్తారనే ఉద్దేశంతో దానిపై మ్యాట్‌ను వేసి కప్పివేశారు. పిల్లలు ఆడుకునే కొన్ని పరికరాలను మాత్రమే ఏర్పాటు చేశారు. ఆయా పార్కుల్లో అమర్చిన వస్తువులు కూడా నాణ్యంగా లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇలా అరకొర పనులతో అధికారులు హడావుడిగా పార్కుల ప్రారంభోత్సవంపై మంత్రి అనగాని సత్యప్రసాద్ మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులే బినామీ పేర్లతో కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి పార్కుల్లో పనులు చేశారని.. అందువల్లే హడావుడిగా ప్రారంభించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అసంపూర్తి.. నాణ్యతా ప్రమాణాలు లేకుండా నిర్మించిన పార్కులకు మంత్రి అనగాని సత్యప్రసాద్ పేరు పెట్టారు. రూ.14 లక్షలు వెచ్చిస్తే ఇదేమి పార్కు అని మంత్రి అనగాని ఆగ్రహం వ్యక్తం చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పనుల విషయంలో అధికారులు నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. పైగా తన పేరు పెట్టి ఇలా అసంపూర్తిగా చేసిన పార్కును తనతోనే ప్రారంభిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.


2వ వార్డులో అసంపూర్తిగా పార్కు


చంద్రమౌళిపార్కులో శిథిలావస్థకు చేరిన వాటర్‌పాంట్

యూరియా కొరతలేదు

- అక్రమ నిల్వలపై పీడీ యాక్ట్
- ప్రకటించిన కలెక్టర్ వెంకటమురళి

ఎరువుల సమస్యలపై కాల్‌సెంటర్ 8247040131

బాపట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరతలేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బుధవారం ఆయన యూరియా సరఫరా, పంపిణీపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించి రైతులను భయభ్రాంతులకు గురిచేస్తే వారిపై పీడీయాక్ట్ సహా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెప్టెంబరులో జిల్లాకు 6,759 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఆ మేర సరఫరాకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదన్నారు. 70 శాతం మార్క్‌ఫెడ్ ద్వారా, 30 శాతం ప్రైవేట్ డీలర్ల ద్వారా రైతులకు యూరియాను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ-పంట, భూ రికార్డులు, రైతుల ఆధార్‌కార్డు ఆధారంగానే యూరియా పంపిణీ జరుగుతుందన్నారు. రైతు సేవాకేంద్రాల్లో తక్కువ నిల్వలు ఉంటే సమీపంలోని కేంద్రం నుంచి వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎరువుల సమస్యలను కలెక్టరేట్‌లోని కాల్‌సెంటర్ నెంబరు 8247040131కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మార్క్‌ఫెడ్, జిల్లా మేనేజర్ కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు

చెరుకుపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం యూరియా కొరత లేదని చెప్తున్నా రైతులు ఆలకించడంలేదు. ఆలస్యం చేస్తే తమకు దొరకదేమోనని బారులు తీరుతున్నారు. యూరియా వచ్చిందని తెలిస్తే వ్యవసాయ పనులు మానుకుని మరీ వచ్చి ఆయా కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారు. నిజంగా అవసరమైన వారికి యూరియా దొరక్క అల్లాడుతున్నారు. బుధవారం గూడవల్లి ప్రాథమిక వ్యవసాయ సహకారపరపతి సంఘానికి 440 కట్టల యూరియా వచ్చింది. ఈ సమాచారం తెలియడంతో రైతులు పెద్దసంఖ్యలో గూడవల్లి పీఏసీఎస్ వద్దకు చేరారు. దీంతో అక్కడ తోపులాట జరిగి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మండల వ్యవసాయ అధికారి ఫారూక్ వచ్చి రైతులకు నచ్చజెప్పారు. ఒక్కొక్క రైతుకు రెండు కట్టల చొప్పున యూరియా పంపిణీ చేయించారు. అయితే అటూ ఇటూ కాకుండా పంపిణీపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 400 మంది ఉన్న సహకార సంఘానికి 440 కట్టల యూరియా ఏవిధంగా సరిపోతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు.


గూడవల్లి యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

ప్రజల భద్రతకోసం డ్రోన్‌లతో నిఘా : ఎస్పీ

బాపట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలలో ప్రజల భద్రత కోసం డ్రోన్‌లతో నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నిమజ్జనాల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేయటం జరిగిందన్నారు.

పొగాకుకు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలి

యద్దనపూడి/మార్టూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : పొగాకుకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలవైపు సాగు చేపట్టాలని, వాటి యాజమాన్య పద్ధతులపై ఆత్మ ఆధ్వర్యంలో బుధవారం యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పర్చూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రవీణ, లాంఫాం కీటక శాస్త్రవేత్త డాక్టరు రాజేష్ చౌదరి వచ్చారు. సమావేశంలో పత్తి, మొక్కజొన్న, సోయాచిక్కుడు, శనగ పంటలలోని యాజమాన్య పద్ధతులను, చీడపీడల నివారణా పద్ధతులను రాజేష్ చౌదరి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారిణి కుమారి, ఆత్మ బీటీఎం హారిక, నీటి సంఘం అధ్యక్షులు ప్రభాకరరావు, బోయపాటి సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏవో వెంకటకృష్ణ

అద్దంకిటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతూ ఈ పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ చెప్పారు. బుధవారం మండలంలోని రామాయపాలెం, తిమ్మాయపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో సాగు చేస్తున్న పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ బర్లీ పొగాకు సాగును నిషేధించారని, ఎవ్వరూ సాగు చేయవద్దని సూచించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కోల్డ్ స్టోరేజీలకు ప్రభుత్వం రాయితీ అందిస్తున్నారని ఉద్యాన శాఖ అధికారిణి ఎస్. దీప్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ రాము పాల్గొన్నారు.

రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లుగా పర్చూరు, కారంచేడు నేతలు



తిరుములశెట్టి శ్రీహరి, షేక్ షంషుద్దీన్

పర్చూరు/కారంచేడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఇద్దరు మండల పార్టీ నేతలకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫార్సుతో ప్రజా ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. పర్చూరు, కారంచేడు మండలాలకు చెందిన ఇద్దరు నేతలకు రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కారంచేడు మండల అధ్యక్షులు తిరుములశెట్టి శ్రీహరికి ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ రాష్ట్ర డైరెక్టర్‌గానూ, పర్చూరు మండల పార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్‌కు ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. రాష్ట్రస్థాయి పదవులు దక్కిన ఇద్దరు నేతలను ఎమ్మెల్యే ఏలూరి అభినందించారు.

పంచాయతీల ఖాతాలకు రూ.41.98కోట్లు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. దీంతో అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. సీఎం చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను రూ.1,120 కోట్లను విడుదల చేశారు. ఈ నిధులను పంచాయతీ, జిల్లా మండల పరిషత్ ఖాతాలకు నేరుగా ప్రభుత్వమే జమ చేసింది. వాటిని ఏయే అవసరాలకు వినియోగించాలో స్పష్టంగా పేర్కొంది. ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు 70శాతం, మండల పరిషత్‌కు 20శాతం, జిల్లా పరిషత్‌కు 10శాతం విడుదల చేసింది. అలా జిల్లావ్యాప్తంగా 729 గ్రామపంచాయతీలకు బుధవారం రూ.41.98 కోట్లు పంచాయతీ అకౌంట్లలో జమయ్యాయి. అందులో 50శాతం నిధులను తాగునీటికి, పారిశుధ్యంకు వినియోగించాలి. మిగిలిన 50శాతం నిధులను వివిధ రకాల అభివృద్ధి పనులకు వినియోగించుకునేందుకు ప్రభుత్వం స్పష్టమైన అదేశాలు జారీచేశారు.

మా ఊరికి ఆర్‌టీసీ బస్సు వచ్చింది

పదేళ్ల తర్వాత వింజనంపాడుకు ఆర్టీసీ బస్

ఎమ్మెల్యే ఏలూరిని అభినందిస్తున్న గ్రామస్థులు



బస్సు వద్ద ఎమ్మెల్యే ఏలూరి చిత్రపటంతో గ్రామస్థులు

యద్దనపూడి/మార్టూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల తర్వాత ఆ గ్రామానికి ఆర్‌టీసీ బస్సువచ్చింది. గతంలో ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఆ గ్రామానికి బస్సు మాత్రం రాలేదు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావడం.. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో బుధవారం తమ గ్రామానికి ఆర్‌టీసీ బస్సు వచ్చిందని యద్దనపూడి మండలంలోని వింజనంపాడు గ్రామస్థులు ఆనందంతో పొంగిపోయారు. గ్రామానికి రోజూ చిలకలూరిపేట నుంచి ఉదయం 8 గంటలకు వింజనంపాడు, యద్దనపూడి గ్రామాల మీదుగా పూనూరు గ్రామం వరకు బస్సు సర్వీస్ నడుస్తుంది. మళ్లీ అదే రూట్‌లో పూనూరు నుంచి చిలకలూరిపేట బస్టాండుకు వెళుతుంది. అంతేగాకుండా సాయంత్రం 5 గంటలకు మరోసారి ఆ సర్వీస్ నడుస్తుంది. ఈ గ్రామానికి 10 ఏళ్ల క్రితమే ఆర్‌టీసీ బస్‌ను నిలిపేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆర్‌టీసీ బస్సు వద్ద మహిళలు కృతజ్ఞతాపూర్వకంగా ఎమ్మెల్యే ఏలూరి చిత్రపటాన్ని ప్రదర్శించగా, టీడీపీ నాయకులు ఏలూరి రైట్ రైట్ అంటూ సంతోషాన్ని ప్రదర్శించారు. అంతేగాకుండా తమ మండలానికి చెందిన రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా సహకారం అందించారని కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాయకులు సాదినేని రంగారావు, కోడూరి నాగరాజు, సాదినేని హరిబాబు, సాదినేని సుధీర్, రావెళ్ల సుధీర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇరువురు ఎంపిక

జిల్లా అవార్డులకు పలువురు ఎంపిక



జాగర్లమూడి ప్రతాప్, మానికొండ ధనలక్ష్మి, అనిత, ప్రీతి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయులలో అద్దంకి మండలానికి చెందిన ఇద్దరు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఏ తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న డాక్టర్ జాగర్లమూడి ప్రతాప్, పట్టణంలోని ఎంపీయూపీఎస్‌లో ఎస్‌జీటీగా పనిచేస్తున్న మానికొండ ధనలక్ష్మి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. అలాగే జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు పలువురు ఎంపికయినట్లు ఎంఈవో-2 శ్రీనివాసరావు తెలిపారు. అద్దంకి పట్టణంలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న డీఎస్ పద్మావతి జిల్లా స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలు అవార్డుకు ఎంపికయ్యారు. తిమ్మయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఏ(పీఎస్) ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఆర్. శ్రీనివాసరరావు, చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఏ(ఇంగ్లీష్) ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న బి. చిన్న అంకారావు, మండలంలో మోదేపల్లి ఎంపీపీఎస్(మెయిన్)లో ఎస్‌జీటీగా పని చేస్తున్న యు. రాజశేఖర్‌రావులు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయినట్లు ఆయన తెలిపారు.

యద్దనపూడి మండలంలో...

యద్దనపూడి/మార్టూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. వారిలో పూనూరు జడ్‌పీ హైస్కూలులో ఎస్ఏ అంకరాజు, సూరవరపుపల్లిలోని ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న శారదలు ఎంపికయ్యారు.

పంగులూరు మండలంలో...

పంగులూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం అణిత, చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ ప్రతిమలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని పంచుమర్తి భవ్యశ్రీ జాతీయస్థాయిలో జరిగిన పోస్టర్ కాంపిటేషన్‌లో ప్రథమ స్థానం సాధించడంలో హెచ్ఎం అణిత ప్రోత్సాహం ఉంది. అదేవిధంగా వ్యాయామోపాధ్యాయిని ప్రీతి చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులను యోగాక్రీడలో ఉత్తమ శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయస్థాయిలో పాఠశాలకు గుర్తింపు తెచ్చారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయిన వీరిని ఎంఈవోలు నాగభూషణం, వీరాంజనేయులు అభినందించారు.

ఇంకొల్లు మండలంలో...

ఇంకొల్లు,సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇద్దరు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. దుద్దుకూరు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉప్పల చెంచయ్య, నాగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్సు ఉపాధాయులుగా పనిచేస్తున్న కూసం రమేష్ జిల్లా విద్యాశాఖ ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రకటించింది. వీరికి ఈ నెల 5వ తేదీన బాపట్లలో కలెక్టరు, డీఈవో చేతుల మీదగా అవార్డులు అందుకోనున్నారు. వీరి ఎంపిక పట్ల యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పేర్ని సత్యనారాయణ, షేక్ మస్తాన్‌వలి అభినందనలు తెలిపారు.

పొగాకు మార్కెట్లో అనిశ్చితి

అధిక ఉత్పత్తి కొనుగోళ్లపై తేల్చని కేంద్రం

ఐదు కేంద్రాల్లో నిలిచిన వేలం

ఇంకా రైతుల ఇళ్ల వద్దనే 40శాతం పంట

ముంచుకొస్తున్న సాగు సమయం

ఇప్పటికే ప్రారంభమైన ఈ సీజన్ రిజిస్ట్రేషన్లు

పలుచోట్ల నారు మళ్లు



వేలానికి వచ్చిన బేళ్ల వద్ద రైతులు

దక్షిణాది పొగాకు మార్కెట్లో అనిశ్చితి నెలకొంది, నిన్న మొన్నటి వరకు ధరల సమస్యతో సతమతం కాగా ప్రస్తుతం అధికంగా జరిగిన పంట ఉత్పత్తి కొనుగోలుపై అయోమయం నెలకొంది. ఎలా ముందుకు పోవాలన్నది అర్థం కాక పొగాకు బోర్డు అధికారులు తర్జనభర్జన పడుతుండగా వారికి తగు సూచనలు ఇవ్వాల్సిన కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ దానిపై స్పష్టత ఇవ్వడం లేదు. ఈ ప్రాంతంలో ఉన్న 11 వేలం కేంద్రాలలో ఇప్పటికే ఐదు చోట్ల అధికారిక కొనుగోళ్లు పూర్తయ్యాయి. అధిక ఉత్పత్తి కొనుగోలుపై స్పష్టత రాక వేలం ప్రక్రియ నిలిచిపోయింది. ఈ వారంలో మరో రెండు కేంద్రాల్లోనూ అదే పరిస్థితి ఏర్పడనుంది. మరోవైపు వచ్చే సీజన్ పంట సాగు సమయం సమీపిస్తుంది. అయితే ఇంకా ప్రస్తుత సీజన్ పంటలో 40శాతం మేర పొగాకు ఇళ్ల వద్దనే మిగిలిపోయి ఉండటంతో ఇటు రైతుల్లోనూ, అటు బోర్డు అధికారుల్లోనూ ఆందోళన వ్యక్తమవుతోంది.

ఒంగోలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇతర పంటలకు భిన్నంగా ఎఫ్‌సీవీ పొగాకు సాగు పూర్తిగా బోర్డు నియంత్రణలో సాగాలి. అయితే గత రెండు మూడేళ్ల కాస్తంత మంచి ధరలు లభించడం, ఇతర పంటల సాగుకు వాతావరణం అనుకూలించక పోవడం ఇతరత్రా కారణాలతో రైతులు ప్రస్తుత సీజన్(2024-25)లో భారీగా పొగాకు సాగు చేశారు. తదనుగుణంగా పంట ఉత్పత్తి కూడా పెరిగింది. రాష్ట్రంలో ఈ కాలానికి 167 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతించిన పొగాకు బోర్డు అందులో దక్షిణాదిలోని ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని 11 వేలం కేంద్రాల పరిధిలో 104.60 మిలియన్ కిలో ఉత్పత్తికి అనుమతించింది. అయితే ఈ ప్రాంతంలో పంట సాగు భారీగా జరగ్గా సుమారు 158.60 మిలియన్ల ఉత్పత్తి అయినట్లు బోర్డు అధికారులు అంచనాకు వచ్చారు. అలా మార్చి 10 నుంచి రెండు దశల్లో కొనుగోళ్ళు ప్రారంభం కాగా ఇప్పటివరకు సుమారు 93.72 మిలియన్లు కొనుగోలు చేయగా సగటున కిలోకు రూ.236.83 ధర లభించింది. ప్రతి ఏటా వంద రోజుల్లో వేలం ప్రక్రియ ముగించాలని పొగాకు బోర్డు ఎప్పటికప్పుడు లక్ష్యంగా పెట్టుకుంటుండగా ఒక నెల అటుఇటుగా సాగుతుంది. అయితే ఈ సీజన్‌లో కొనుగోళ్లు ప్రారంభించి ఆరునెలలు పూర్తి కావస్తున్నా 60శాతం పంట మాత్రమే ఇప్పటివరకు కొనుగోళ్లు జరగ్గా పండిన పంటలో ఇంకా 40శాతం రైతుల ఇళ్ల వద్దనే నిల్వ ఉంది.

అపరాధం రెండు సీజన్లు రద్దు

మార్కెట్ ఆరంభంలో కొంత ధరలు బాగున్నా అనంతరం సరిలేక చాలా చోట్ల వేలం ప్రక్రియ వేగం పుంజుకోలేదు. ధరల సమస్య ఇప్పటికి కూడా వెంటాడుతున్నప్పటికి తాజాగా అధిక పంట కొనుగోళ్ల సమస్య ఎదురైంది. పొగాకు పంట బోర్డు నియంత్రణలో సాగు చేసేది కనుక అనుమతి ఇచ్చిన మేరకే పంట సాగు, ఉత్పత్తి చేయాలి. దానికన్నా 10శాతం వరకు అధికంగా ఉత్పత్తి జరిగితే వాతావరణ మార్పులో అలా జరగవచ్చు కనుక కొనుగోలు చేస్తారు. అంతకు మించితే అధిక ఉత్పత్తిపై పొగాకు బోర్డు పెనాల్టీలు వేస్తుంది. పంట ఉత్పత్తి నియంత్రణ కోసం అలా చేసేవారు. గతంలో ఒకప్పుడు ఈ పెనాల్టీలు 15శాతం వరకు ఉండేవి. అనంతరం ఒకసారి పది శాతానికి, తర్వాత 7.5 శాతానికి తగ్గించారు. అయితే మూడేళ్ల క్రితం పంట ఉత్పత్తి సరిలేకపోవడం, ధరలు కూడా ఆశాజనకంగా లేకపోవడం, ఎక్కువమంది పరిమితికి లోబడే పండించగా కొద్ది మందికి మాత్రమే అధికంగా ఉత్పత్తి చేయడంతో అపరాధ రుసుంను రద్దు చేశారు. తొలుత కర్ణాటకలో రద్దుచేయగా అనంతరం రాష్ట్రంలోనూ అమలు చేశారు. అలా రెండేళ్లుగా అదనపు పంటకు అపరాధ రుసుం లేకుండానే కొనుగోళ్లు సాగుతున్నాయి.

కేంద్రం నుంచి స్పష్టత కరువు

తదనుగుణంగా వివిధ స్థాయిల్లో రైతులతో సమావేశాలు నిర్వహించగా దక్షిణాది రైతులు ఈ ఏడాది ధరలు లేక నష్టపోయే పరిస్థితులు ఉన్న దృష్ట్యా పెనాల్టీలు వద్దని తప్పనిసరి అయితే రెండుశాతం విధించాలని సూచించగా ఉత్తరాది ప్రాంత రైతులు మాత్రం ఫెనాల్టీలు గట్టిగానే వేయాలని అభిప్రాయపడినట్లు సమాచారం. ఈ మొత్తం అంశాలపై పొగాకు బోర్డు అధికారులు కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖకు నివేదించి అధిక పంట కొనుగోళ్లపై తగు సూచనలు ఇవ్వాలని కోరారు. అయితే ఇది జరిగి నెల రోజులు దాటిపోయినా కేంద్రం నుంచి ఎలాంటి సూచనలు రాకపోగా నిత్యం అందుకోసం బోర్డు అధికారులు తమ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈలోపు దక్షిణాదిలో పలు కేంద్రాల్లో అధికారికంగా అనుమతి ఇచ్చిన మేర పంట కొనుగోళ్లు పూర్తయ్యాయి. ప్రత్యేకించి ఎస్ఎల్ఎస్ రీజియన్‌లోని కందుకూరు-1, కందుకూరు-2, కలిగిరి, డీసీపల్లి, కనిగిరిలలో అలా పూర్తికాగా అధిక ఉత్పత్తి కొనుగోళ్లపై స్పష్టత లేక తదుపరి వేలంను ఆ కేంద్రాలలో పొగాకు బోర్డు అధికారులు నిలిపివేశారు.

పశ్చిమ ప్రాంతంలో త్వరలో నాట్లు

ప్రస్తుతం మిగిలిన ఆరు కేంద్రాల్లో మాత్రమే కొనుగోళ్లు జరుగుతుండగా ఈ వారంలో ఒంగోలు1,-2 కేంద్రాల్లోనూ అనుమతించిన పంట కొనుగోళ్లు పూర్తయ్యి వాటిలోనూ వేలం ఆపేసే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు వచ్చేసీజన్(2025-26) పొగాకు సాగుకు సంబంధించి రిజిస్ట్రేషన్లు ప్రక్రియ ప్రారంభం కాగా పలుచోట్ల నారుమడులు కూడా పోశారు. ఈ నెల రెండవ సక్షం నుంచి పశ్చిమ ప్రాంత గ్రామాల్లో వచ్చే సీజన్ పొగాకు నాట్లు ప్రారంభం కానున్నాయి. ఈ పరిస్థితుల్లో కేంద్రం ఇంకా జాప్యం చేస్తే రైతుల వద్ద ఉన్న 40శాతం పంట కొనుగోళ్లకు ఎప్పటికప్పుడు పూర్తవుతాయన్న ఆందోళన అటు బోర్డు అధికారుల్లోనూ, ఇటు రైతుల్లోను వ్యక్తం అవుతుంది.

దక్షిణాదిలో 51శాతం అదనంగా..

అయితే ప్రస్తుత సీజన్(2024-25)లో రాష్ట్రంలో భారీగా పంట ఉత్పత్తి పెరిగింది. 167 మిలియన్ కిలోలకు అనుమతి ఇవ్వగా సుమారు 235 మిలియన్ కిలోలు ఉత్పత్తి జరిగినట్లు అంచనా. అందులో దక్షిణాదిలో 104.60 మిలియన్ కిలోలు అనుమతి ఇస్తే సుమారు 158.60 మిలియన్ కిలోలు ఉత్పత్తైనట్లు బోర్డు అధికారులు అంచనా వేశారు. అంటే బోర్డు అనుమతి ఇచ్చిన దాని కన్నా రాష్ట్రంలో 40శాతం అధికంగా ఉత్పత్తి జరగ్గా దక్షిణాదిలో దాదాపు 51శాతానికిపైగా ఉత్పత్తి పెరిగింది. అలా భారీగా ఉత్పత్తి పెరగడంతో మార్కెట్లో డిమాండ్ తగ్గి ధరలు సరిగా లభించలేదని దాని వల్ల రైతులు నష్టపోవడమే కాక వేలం ప్రక్రియ కూడా ఆలస్యం జరగడం, అందులో తరుచూ ఒడిదుడుకులు కూడా ఎదురయ్యాయి. దీంతో కేంద్రప్రభుత్వం పంట నియంత్రణ కోసం బోర్డు అధికారులపై వత్తిడి తెచ్చి మళ్లీ పెనాల్టీలు విధించాలని సూచించింది. ఈ నేపథ్యంలో నెలన్నర క్రితం బోర్డు అధికారులు ఈ అంశంపై పొగాకు బోర్డు సమావేశంలో చర్చించి అధిక ఉత్పత్తి వల్ల నష్టాలను రైతులకు కూడా వివరించి వారి అభిప్రాయాలను కూడా తీసుకొని కేంద్రానికి నివేదించాలని నిర్ణయించారు.

చిన్ని లక్ష్మీశ్రీనివాసరావును సత్కరించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు



చిన్ని లక్ష్మీశ్రీనివాసరావును సత్కరిస్తున్న చైర్మన్ రాకేష్

అద్దంకిటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తుళ్లూరులో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన అద్దంకికి చెందిన చిన్ని లక్ష్మీశ్రీనివాసరావును ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూది రాకేష్, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య మాజీ అధ్యక్షుడు గునుపూడి భాస్కర్, మార్కాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ వక్కలగడ్డ మల్లికార్జునరావు, పల్లబోతు వెంకటేశ్వర్లు, ఒంగోలు అమరబాను తదితరులు సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

బాధిత కుటుంబానికి అండగా గ్రామీణ బ్యాంక్



భీమా చెక్కును అందజేస్తున్న మేనేజర్ సీనానాయక్

బల్లికురవ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రగతి బ్యాంక్ నిలుస్తుందని మేనేజర్ సీనా నాయక్ చెప్పారు. మండలంలోని కొండాయపాలేనికి చెందిన ఎన్.శివపార్వతి అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం రూ.2 లక్షల విలువైన భీమా చెక్కును కుమారుడు గోపికి అందజేశారు అసిస్టెంట్ మేనేజర్ బిందుమాధవి, సాయి రాఘవేంద్ర, పాల్గొన్నారు.

బాల్యమిత్రుని కుటుంబానికి సాయం

చినగంజాం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న బాల్యమిత్రుని కుటుంబానికి మిత్రులు అండగా నిలిచి సాయం అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1980-81 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థి కోమట్ల మల్లికార్జునరెడ్డి భార్య భ్రమరాంబ కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న మల్లికార్జునరెడ్డి మిత్రులు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. పెదగంజాం గ్రామంలోని మల్లికార్జురెడ్డి స్వగృహానికి బుధవారం వెళ్లి ఆయన కూమార్తె, అల్లుడైన శివపార్వతి, అయ్యప్పలకు రూ.50 వేలను అందజేశారు. పద్మావతి (అమలాపురం), కోమట్ల వెంకటరమణారెడ్డి, నరహరి కృష్ణరావు, చుండూరి వెంకటేశ్వరరావు, శిఖరం కోటయ్య, ఉలిచి సాంబశివరావు, వలివేటి రాఘవరావు, కుంచాల శ్రీనివాసరెడ్డి, జ్యోతి, ఎన్ శంకర్, సిద్దం పాపారావు, పల్లపోలు పుండరికాక్షయ్య, ఎమ్.ఎల్.శాస్త్రి, హరిబాబు, విజయలక్ష్మి, రమణారెడ్డి పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పర్చూరు - యద్దనపూడి రోడ్డు

అవస్థలు పడుతున్న వాహనదారులు



పర్చూరు - యద్దనపూడి రోడ్డు పరిస్థితి ఇలా

పర్చూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు - యద్దనపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. ఎక్కడ చూచినా పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తోంది. ఈ మార్గంలో ప్రయాణాలు సాగించాలంటే వాహనదారులకు నరకప్రాయంగా మారింది. గుంతలను గుర్తించలేక వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత ఇబ్బందిగా మారింది. వర్షపు నీటితో నిండిన గుంతలను గుర్తించక పోవటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జాగర్లమూడి నుంచి యనమదల మధ్య రోడ్డు పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. రోడ్డు అభివృద్ధి సంగతి దేముడికి ఎరుక కనీసం మరమ్మతులు అయినా చేయించి వాహనదారుల అవస్థలు తీర్చాలని ప్రజలు కోరుతన్నారు. ఆ దిశగా అధికారులు యుద్ధప్రాతిపతికన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పల్లెలకు పైసలొచ్చాయ్..!

(5వ పేజీ తరువాయి)

మరమ్మత్తులు, తాగునీటి వసతి, ఆట స్థలాల అభివృద్ధి వంటి పనులకు ఈ నిధులను ఖర్చు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

నిధులు విడుదలతో పంచాయతీల పాలక వర్గాలు హర్షం

ఎనిమిది నెలల తర్వాత నిధులు విడుదల కావడంతో పంచాయతీల పాలక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నిధుల విడుదలతో గ్రామాల్లో సమస్యలు తీరే అవకాశం ఏర్పడిందని పేర్కొంటున్నాయి. ఈ నిధులతో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని చెబుతున్నాయి. కాగా, పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారుడు, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పంచాయతీలను బలోపేతం చేస్తోందన్నారు. నిధులు విడుదల చేయడం పట్ల అయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

బార్లు బాధలు

(5వ పేజీ తరువాయి)

దృష్టి పెట్టారు. దరఖాస్తు చేయడానికి వారికున్న సాదకబాధకాలు పరిష్కారానికి హామీ ఇస్తున్నారు. ముందు బార్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేయాలని కోరుతున్నారు.

నేతల వద్దకు క్యూ..

బార్ల దరఖాస్తుల అంశాన్ని ఉన్నతాధికారులు ప్రయారిటీగా తీసుకోవడం ఒక ఎత్తయితే, స్పందన లేకపోతే పోస్టింగే ప్రమాదంలో పడే అవకాశాలు ఉండడంతో అధికారులు ఏ ఒక్క అవకాశాన్ని వదలకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా నియోజక వర్గాల్లో కీలకంగా ఉండే అధికార పార్టీ నేతల వద్దకు వెళ్లి ఎలాగైనా బార్లకు దరఖాస్తులు పడేలా చూడాలని కోరుతున్నారు. స్థానికంగా ఉన్న ఆశావహులకు నేతలతో ఫోన్లు చేయిస్తు న్నారు. ఇప్పటికే మద్యం షాపులు నిర్వహిస్తున్న వారిని, ఆర్థికంగా బలంగా ఉండి గతంలో ఈ రంగంలో ఉన్నవారిని కలిసి దరఖాస్తులు వేయించేలా అధికారులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

వ్యాపారం చేయలేం..

ఇప్పటికే మద్యం షాపుల విషయంలోనే పడుతూ లేస్తూ వ్యాపారం చేస్తున్నామని కొత్తగా బార్ల భారాన్ని మోయలేమని వ్యాపారులు తెగేసి చెబుతున్నట్లు తెలుస్తోంది. పాలక పార్టీ నేతలు, వివిధ శాఖల అధికారులు, క్షేత్రస్థాయిలో ఉండే ఎక్సైజ్ సిబ్బందికి ఇలా ప్రతి ఒక్కరికీ ముడుపులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందని, ఇవన్నీ బేరీజు వేసుకుని వ్యాపారం చేసేకన్నా మిన్నకుండడమే మేలనే అభిప్రాయాన్ని ఆశావహులు వ్యక్తం చేస్తున్నారు. బార్ల విషయంలో ప్రభుత్వం లైసెన్స్ ఫీజు విషయంలో పునరాలోచన చేస్తుందని అనుకున్నాం కానీ ఇలా అధికారులను తమపైకి పంపి ఒత్తిడి పెడుతుందనుకోలేదని వ్యాపారులు వాపోతున్నారు.

పరిశ్రమలకు రూ.3.25 కోట్ల రాయితీ మంజూరు

-కలెక్టర్ అన్సారియా వెల్లడి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ పరిశ్రమలకు చెందిన 149 క్లెయిమ్‌లకు రూ.3.25 కోట్ల రాయితీలను కలెక్టర్ తమీమ్ అన్సారియా మంజూరు చేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. పరిశ్రమల ఏర్పాటుకు అనుమతుల కోసం సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను గడువు తేదీ వరకు వేచి ఉండకుండా త్వరగా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను అదేశించారు. ర్యాంప్ పథకంపై జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. పీఎంఈజీపీ ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు వచ్చిన దరఖాస్తులను త్వరగా బ్యాంకులకు పంపించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఒక కుటుంబం- ఒక పారిశ్రామికవేత్త కార్యక్రమం ద్వారా పారిశ్రామికవేత్తలు తయారయ్యే కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి శ్రీనివాసరావు, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, నాబార్డు డీడీఎం రవికుమార్, ఎల్‌డీఎం రమేష్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యవసాయ మిషన్ డైరెక్టర్‌గా నాగినేని



నాగినేని రామకృష్ణ

అద్దంకిటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మిషన్ డైరెక్టర్‌గా ఏఎంసీ మాజీ ఛైర్మన్, బాపట్ల జిల్లా తెలుగు దేశం పార్టీ ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం 10 మందితో రాష్ట్ర వ్యవసాయ మిషన్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసింది. అందులో నాగినేని రామకృష్ణకు స్థానం కల్పించింది రామకృష్ణ తండ్రి నాగినేని వెంకయ్య అద్దంకి నియోజకవర్గ మొట్ట మొదటి శాసనసభ్యులుగా పనిచేశారు. నాగినేని రామకృష్ణ గతంలో అద్దంకి ఏఎంసీ ఛైర్మన్‌గా, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడుగా, ధేనువకొండ గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. సుదీర్ఘకాలంగా తెలుగుదేశం పార్టీలో చురుకైన నాయకుడిగా పనిచేస్తున్న నాగినేనికి ప్రజా ప్రభుత్వం అరుదైన గుర్తింపు ఇచ్చిందని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అంటున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు రామకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీడీవోకి స్వల్పగాయాలు

ఇంకొల్లు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు ఎంపీడీవో ఘట్టా శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలయ్యాయి. ఇంకొల్లు నుంచి దుద్దుకూరు వెళుతుండగా మోటార్‌సైకిల్ అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో పడింది. దీంతో శ్రీనివాసరావుకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అతను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమచికిత్స చేయించుకున్నారు.

7న ఇంకొల్లులో ఉచిత వైద్యశిబిరం

ఇంకొల్లు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహకారంతో గుంటూరు వికాస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు పాల్గొని ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తారని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా నోడల్ అధికారిగా యద్దనపూడి ఎంఈవో

యద్దనపూడి/మార్టూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : మన బడి-మన భవిష్యత్ కార్యక్రమం జిల్లా నోడల్ అధికారిగా యద్దనపూడి ఎంఈవో పుల్లెల సుబ్రహ్మణ్యేశ్వరరావు బుధవారం బాపట్లలో బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు సుబ్రహ్మణ్యేశ్వరరావు బాధ్యతలు స్వీకరించాక ఎంఈవో చిలుకూరి గోపి, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

5, 6 తేదీల్లో స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ సమావేశాలు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : శింగరకొండలోని వేమారెడ్డి సేవా సమితి ఫంక్షన్ హాలులో ఈ నెల 5, 6 తేదీలలో అసోసియేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యవర్గ సమావేశాలు జరుగుతాయని అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. కొండలరావు బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ముఖ్య అతిథిలుగా రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, కలెక్టర్ వెంకట మురళి, రైతు నేస్తం సంపాదకులు వై. వెంకటేశ్వరరావులు హాజరు అవుతారన్నారు. ఈ సమావేశాలకు సూమారు 20 రాష్ట్రాల నుంచి 150 మంది పత్రిక సంపాదకులు హాజరవుతారని తెలిపారు.

క్రీడాకారునికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న సాంబశివరావు, సుబ్బారావు

చీరాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : యువకులు క్రీడల్లో రాణించి దేశానికి గర్వకారణంలా నిలవాలని మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు, వన్‌టౌన్ సీఐ సూరేపల్లి సుబ్బారావు చెప్పారు. బుధవారం ఛైర్మన్ సాంబశివరావు సమకూర్చిన రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని చినగంజాం మండలం సోపిరాలకు చెందిన అథ్లెటిక్స్ క్రీడాకారుడు ఎల్లావుల గోపీరాజు అందుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థికపరమైన సమస్యలతో యువకులు నిరుత్సాహపడకూడదన్నారు. అందివచ్చిన సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అందుకోవాలని చెప్పారు.

చీరాలలో రాజకీయ ఫ్లెక్సీల రగడ

పట్టణంలోని వైఎస్ విగ్రహం వద్ద ముందుగా వైసీపీకి చెందిన ఫ్లెక్సీ ఏర్పాటు

వర్ధంతి కార్యక్రమాలకు అడ్డుగా ఉందని ఆ పార్టీలోనే మరో వర్గం అధికారులకు ఫిర్యాదు

వేటపాలెంలో కాకరేపుతున్న అధికార పార్టీ ఫ్లెక్సీలు



వైసీపీ ఫ్లెక్సీను తొలగిస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది

చీరాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీల రగడ రాజుకుంటోంది. చీరాల పట్టణంలో వైసీపీ ఫ్లెక్సీల వివాదం చోటుచేసుకోగా, వేటపాలెంలో అధికార పార్టీ పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చర్చనీయాంశమయ్యాయి. వైఎస్ వర్ధంతికి సంబంధించి రెండు రోజులు ముందుగానే పట్టణంలోని ఏడో వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు పేర్లి నాని గడియార స్తంభం కూడలిలోని రాజశేఖర రెడ్డి విగ్రహం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వేడుకలు జరుపుకునేందుకు విగ్రహానికి ఫ్లెక్సీ అడ్డుగా ఉందని, వెంటనే తొలగించాలని వైసీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు వాసుమళ్ల వాసు, పట్టణ అధ్యక్షులు యాతం మధుకర్(మేరీబాబు) మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు వెంటనే ఆ ఫ్లెక్సీను తొలగించారు. ఈ చర్యతో అంతర్గతంగా చీరాల వైసీపీలో కుమ్ములాటలు బహిర్గతమయ్యాయి.

వేటపాలెంలో శ్రుతి మించిన ఫ్లెక్సీలు

వేటపాలెం మండలంలో పలుచోట్ల అధికార పార్టీకు చెందిన ఫ్లెక్సీలపైనా ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్యాడర్‌తో సంబంధంలేని వ్యక్తులు ఎమ్మెల్యే కొండయ్య, పార్టీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్‌లు బొమ్మలను చిన్నవిగా ముద్రించి ఓ వ్యక్తి తన ఫొటోను పెద్దవిగా పెట్టించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఆ పార్టీలో కాకరేపాయి. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వ్యక్తికి పార్టీ మూలాలకు కూడా సంబంధం లేదని టీడీపీ సీనియర్ నాయకులు చెబుతున్నారు.

పైగా ఆ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వ్యక్తి గత ఎంఎల్‌సీ ఎన్నికల ప్రచార సమయంలో టీడీపీ వేసుకున్న టెంట్లపై విరుచుకుపడి వాటిని ధ్వంసం చేసినట్లు సమాచారం. అటువంటి వారు నేడు అధికార పార్టీతో చేతులు కలపడంతో పాటు ప్రజాప్రతినిధులను మించి ఫ్లెక్సీలు వేయించుకోవడం చర్చనీయాంశమైంది.

గణనాథునికి ఘనంగా వీడ్కోలు



నిమజ్జన కార్యక్రమంలో పూలతో వీడ్కోలు పలుకుతున్న మహిళలు

మార్టూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చవితి ఉత్సవాల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలలో పూజలు అందుకున్న గణనాథులను నిమజ్జనాలకు తరలిస్తున్నారు. నాలుగు రోజుల నుంచి మార్టూరు గ్రామంలో వినాయకుని నిమజ్జనాలు జరుగుతున్నాయి. బుధవారం పడమర బజారు మండపం నుంచి వినాయకుని విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసిన తర్వాత మహిళలు స్వామికి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. బాణసంచా కాలుస్తుండగా, డప్పులు, వాయిద్యాలతో, యువకులు, మహిళలు ఆటపాటలతో గ్రామంలోని ప్రధానవీధులలో ఊరేగించారు. తదుపరి సాగర్ కాలువలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోపూరి శ్రీనివాసరావు, తేలప్రోలు సాంబశివరావు, తాటి నాగేశ్వరరావు, ముప్పా ఆంజనేయులు, ముప్పా నారాయణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నాగరాజుపల్లి సెంటరు సమీపంలోని బీసీ కాలనీలో వినాయకుని విగ్రహాన్ని ట్రాక్టరుపై ఊరేగిస్తూ, యువకులు కేరింతలు కొడుతూ స్వామిని నిమజ్జనానికి తరలించారు. సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆకట్టుకున్న కోలాటం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని నాగులపాడు రోడ్డులోని శివసాయి రెసిడెన్సీలో వినాయక చవితి మండపం వద్ద బుధవారం సాయంత్ర స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అపార్టుమెంట్‌లోని మహిళలు ప్రసాద్ గురూజి శిక్షణలో కోలాట ప్రదర్శన నిర్వహించారు. ఈ కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విగ్రహ కమిటీ అధ్యక్షుడు మారం జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వినాయక మండపంలో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

రికార్డుల రూమ్ సక్రమంగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో చిరంజీవి

చినగంజాం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని రికార్డుల రూమ్, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉంచుకోవాలని, వాటిని భద్రపరిచే గదిని సైతం పటిష్టంగా ఉంచాలని ప్రకాశం జిల్లా జడ్పీ సీఈవో బి.చిరంజీవి సిబ్బందికి సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయ అధికారుల హాజరు, మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల రికార్డులు, ఇతర రికార్డులను పరిశీలించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో విజయ్‌కు జడ్పీ సీఈవో పలు సూచనలు అందజేశారు. కార్యాలయ రికార్డులను పరిశీలించేందుకు ప్రత్యేకంగా వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి సీహెచ్ పూర్ణచంద్రరావు, సీనియర్ అసిస్టెంట్ నిర్మల పాల్గొన్నారు.

పంగులూరులో పీడీసీసీ బ్యాంక్ శాఖ ఏర్పాటు



మాట్లాడుతున్న పీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ కామేపల్లి సీతారామయ్య

పంగులూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : పంగులూరు కేంద్రంగా కోఆపరేటివ్ బ్యాంక్ శాఖ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపడతామని పీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య చెప్పారు. మండలంలోని తూర్పు కొప్పెరపాడు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం బుధవారం రాత్రి కొప్పెరపాడు గ్రామంలో జరిగింది. పీఏసీఎస్ ఛైర్మన్‌గా గొల్లపూడి అంజయ్య, సభ్యులుగా కోమటి ప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సీతారామయ్య మాట్లాడుతూ జిల్లా బ్యాంక్ పరిధిలో ఇప్పటివరకు 3,500 కోట్లరూపాయల వ్యాపారం జరుగుతున్నట్లు తెలిపారు. 2,500 కోట్ల డిపాజిట్లు కలిగి ఉన్నాయన్నారు. వ్యాపారాన్ని 4వేల కోట్లకు పెంచాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రావినూతల బ్యాంక్ మేనేజర్ పఠాన్ రెహమాన్, పూనాటి రామాంజనేయులు, కె.వి.సుబ్బారావు, సీఈవో వేణుబాబు, రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, శేఖర్, సహదేవుడు, పీఏసీఎస్ అధ్యక్షులు బ్రహ్మానందస్వామి, చిలుకూరి కోటయ్య, బెల్లంకొండ శ్రీధర్, మద్దినేని కోటేశ్వరరావు, ఎనికపాటి శ్రీనివాసరావు, పెండ్యాల సుబ్బారావు, నాదెండ్ల నరసింహా రావు, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన విద్యుత్ లైన్లతో లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం

విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్ రావు



63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

బల్లికురవ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పలు గ్రామాల్లో నూతన విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్నామని, దీనివలన వినియోగదారులకు లోవోల్టేజీ విద్యుత్ సమస్య ఉండదని అద్దంకి డివిజన్ ఈఈ మస్తాన్‌రావు చెప్పారు. బుధవారం బల్లికురవలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్ల పనులను ఆయన పరిశీలించారు. అనంతరం వేమవరం ఎస్సీ కాలనీలో గతంలో 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు నూతనంగా 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈపనులను స్థానికులతో కలసి ఆయన పరిశీలించారు. ఎన్నో ఏళ్ల నుండి ఉన్న లోఓల్టేజ్ విద్యుత్ సమస్య వేధిస్తోందని ప్రజలు తెలిపారు. ఈసందర్భంగా ఈఈ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తుగా గ్రామాల్లో పర్యటించి వారికి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఏఈ శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు గొట్టిపాటి లక్ష్మయ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ అల్లూరయ్య, లైన్‌మెన్ ప్రతాప్ కుమార్‌పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పాటుపడాలి

వేటపాలెం విస్తృతస్థాయి సమావేశంలో నేతలు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఏఎంసీ ఛైర్మన్ కౌతవరపు జనార్దనరావు, పలువురు టీడీపీ సీనియర్ నాయకులు చెప్పారు. బుధవారం ఎమ్మెల్యే కొండయ్య ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షులు గుత్తి సీతారామాంజనేయులు ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు నాసిక వీరభద్రయ్య అధ్యక్షతన వేటపాలెంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరే విధంగా చూడాలన్నారు. గత ప్రభుత్వం వైఫల్యం కారణంగా చోటుచేసుకున్న అనిశ్చితను ప్రజల్లోకి చేర్చాలని చెప్పారు. కమిటీలను పటిష్ట పరిచేందుకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతానికి సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎంసీ ఛైర్మన్ జనార్దనరావు

విద్యాభివృద్ధికి రామకృష్ణయ్య సేవలు మరువలేనివి

అవీఇవీ



రామకృష్ణయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దగ్గుబాటి దంపతులు

ఇంకొల్లు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ఘంటా రామకృష్ణయ్య మాస్టారు చేసిన సేవలు మరువలేనివని దగ్గుబాటి విద్యాసంస్థల అధినేత దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరిలు పేర్కొన్నారు. స్థానిక దగ్గుబాటి విద్యాసంస్థల ఆవరణలో బుధవారం ఘంటా రామకృష్ణయ్య కాంస్య విగ్రహాన్ని దగ్గుబాటి దంపతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామకృష్ణయ్య గ్రామీణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నివేదిత స్కూల్ ఛైర్మన్ గోరంట్ల సుబ్బారావు, డాక్టరు బీరం సుందరరావు, డాక్టరు దాసయ్య, కరి బ్రహ్మనాయుడు, మండవ రామకృష్ణ, నల్లూరి కృష్ణయ్య, వెనిగండ్ల వెంకటేశ్వర్లు,పార్థసారథి,రామకృష్ణయ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించాలి



ఛైర్మన్ తిరుపతయ్యను కలిసిన కాలేషా

చీరాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విభిన్న ప్రతిభావంతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కోరారు. బుధవారం విజయవాడలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు సహాయ సంస్థ ఛైర్మన్ గుడుపూటి తిరుపతయ్యను కాలేషా మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు.

వ్యాధులు, డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న హెచ్ఎం అనిత

పంగులూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : అసురక్షిత సంబంధాల వల్ల సంక్రమించే వ్యాధులు, డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలను గుర్తించి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ప్రతినిధి విజయశ్రీ చెప్పారు. మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఐవీ, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీతో కలుషితమైన సూదులు, సిరంజీలు, పరీక్షించిన రక్తమార్పిడి వలన హెచ్ఐవీ వ్యాధి ఇతరులకు సోకే ప్రమాదాన్ని గుర్తించాలన్నారు. ముందుగా పాఠశాల విద్యార్థులు సైకిళ్లపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బుధవారం హెచ్ఎం అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎల్డబ్ల్యూఎస్ సూపర్‌వైజర్ వినయ్, ఏఎన్ఎం శ్రావణి పాల్గొన్నారు.

కేన్సర్ నియంత్రణకు కృషి చేయాలి

జిల్లా వైద్యాధికారిణి డాక్టరు విజయమ్మ



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ

చీరాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్ నియంత్రణకు ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక కృషి చేయాలని జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ చెప్పారు. బుధవారం చీరాల ఐఎంఏ హాలులో డివిజన్ పరిధిలోని వైద్య ఆరోగ్య సిబ్బందితో ఎన్‌సీడీ 4.0పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖ ద్వార కేన్సర్‌ల గుర్తింపుపై శిక్షణ ఇచ్చారు. రోగికు సంబంధించి స్క్రీనింగ్, రెఫరల్ పద్ధతిపై పలు సూచనలు చేశారు. అలాగే వైరల్ ఫీవర్లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్బీఎస్కే అండ్ ఎన్‌సీడీ అధికారిణి లలిత రాజేశ్వరి, ఎన్టీఆర్ ట్రస్టు జిల్లా అధికారి ప్రవీణ్, డాక్టర్లు జయసింహ, జాకబ్, షణ్ముఖీ, స్వాతి కిరణ్, పరమేశ్వరి పాల్గొన్నారు.

రైతులకు రోటరీ సత్కారం



రైతులను సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

మార్టూరు, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్, గాండీవ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో ఆరుగురు రైతులను సత్కరించారు. గత నెల 29 వ తేదీ బలరాముని జన్మదినం సందర్భంగా వ్యవసాయమే ప్రధానవృత్తిగా, జీవనం సాగిస్తున్న నలుగురు సీనియర్ రైతులు, వారితో పాటు మరో ఇద్దరు యువకులైన రైతులను వారు సత్కరించారు. వారిలో నాగబోయిన సాంబశివరావు, ఉప్పలపాటి సుబ్బరాజు, దొడ్డా సాంబయ్య, చింతనిప్పుల వీరరాఘవులు, దుడ్డు కోటయ్య, షేక్ జిలానీలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాదాల సాంబశివరావు, చెరుకూరి నాగేశ్వరరావు, రావి అంకమ్మచౌదరి, చెన్నుపాటి బసవరాములు, షేక్ కాజాహుస్సేన్, తాటి నాగేశ్వరరావు, పెంట్యాల శ్రీకాంత్ పాల్గొన్నారు.


భూసారపరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి



రైతులకు సూచనలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : భూసార పరీక్షలకు అనుగుణంగా పంట సాగు, ఎరువులు, పురుగుమందుల వినియోగం చేపట్టాలని ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని బైటమంజులూరు, ముప్పవరం గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. పంట సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు చేయాలని ఏవో సుబ్బారెడ్డి కోరారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు కలిగి ఉంటేనే ప్రభుత్వ ప్రయోజనాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, శివరాజు, వ్యవసాయ సహాయకులు బీ.బీ.జాన్, గోపీకిరణ్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
గురువారం 4 సెప్టెంబరు 2025

ముగ్గురు టీచర్లకు
రాష్ట్ర అవార్డులు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ)గా పనిచేస్తున్న సీహెచ్.చెన్నయ్య, ఇందుకూరుపేటలోని ఎంకేఆర్ ప్రభుత్వ హైస్కూల్ ప్లస్‌లో లెక్చరర్‌గా పని చేస్తున్న కే.డోనమికొర్రెడ్డి, ఇందుకూరుపేట మండలం నరసాపురం ఎంవీఆర్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ)గా పనిచేస్తున్న ఎస్‌కే.ముజీర్‌లను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అమరావతిలో జరిగే కార్యక్రమంలో వారు ఈ అవార్డులు అందుకోనున్నారు.



డోనమికొర్రెడ్డి,



ముజీర్



చెన్నయ్య

రేపు శాంతియుత ర్యాలీ

● మిలాద్ ఉన్ నబి సందర్భంగా నిర్వహణ

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా శుక్రవారం నెల్లూరు నగరంలో శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్లు ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. నగరంలోని కోటమిట్ట యూసుఫియా మసీదులో ర్యాలీ ఏర్పాట్లపై ముస్లిం మతపెద్దలతో బుధవారం ఆయన సమీక్షించారు. ప్రభుత్వం తరఫున అందించాల్సిన సహాయ సహకారాలపై అధికారులతో మాట్లాడి సమన్వయం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నెల్లూరులో 40ఏళ్ల నుంచి మిలాద్ ఉన్ నబీ సందర్భంగా శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నామని, ఈ ర్యాలీలో కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ట్రాఫిక్‌కి అంతరాయం కలుగుతుందని, నగర ప్రజలు ఓపిక, సహనంతో ఉండాలని కోరారు. అందరికీ భోజన, ఇతర సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. మంత్రి పొంగూరు నారాయణ సహాయ సహకారాలు కూడా పూర్తిస్థాయిలో ఉంటాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు జాఫర్‌షరీఫ్, మొయినుద్దీన్, నన్నేసాహెబ్, రియాజ్, హయత్‌బాషా; ఖలీల్, జాఫర్ పాల్గొన్నారు.

మేయర్‌కు
పదవీ గండం!?

నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతికి పదవీ గండం పొంచి ఉంది. వైసీపీ తరఫున ఎన్నికైన ఆమెపై అవిశ్వాసం ప్రకటించడానికి అధికార తెలుగుదేశం పార్టీ సిద్ధమైంది. ఇందుకు నవంబరు 24వ తేదీన ముహూర్తంగా నిర్ణయించింది. అదేరోజు అవిశ్వాసానికి నోటీసులు జారీ చేసి, డిసెంబరులో అవిశ్వాసం ప్రవేశపెట్టనున్నది.
- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

నవంబరు 24న ముహూర్తం
అదేరోజు అవిశ్వాసానికి నోటీసులు
డిసెంబరులో అవిశ్వాసం

2021 నవంబరులో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నగర పరిధిలోని అన్ని కార్పొరేటర్ స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది. ఆ ఎన్నికల్లో అధికార పార్టీ హోదాలో వైసీపీ పలు అక్రమాలకు పాల్పడింది. టీడీపీ తరపున నామినేషన్లు వేయడానికి కూడా వీలులేని పరిస్థితులు సృష్టించింది. టీడీపీలో బలమైన అభ్యర్థులు అవుతారనుకున్న వారిని బెదిరించింది. వారిపై తప్పుడు కేసులు పెట్టడానికి సిద్ధపడింది. కొంతమందిని ప్రలోభాలకు గురిచేసింది. అధికారం ముసుగులో జరిగిన ఆ ఎన్నికల్లో కార్పొరేషన్ పరిధిలోని 54 డివిజన్లకుగానూ అన్నింటిలోనూ వైసీపీ అభ్యర్థులే గెలిచారు. ఆ పార్టీ తరపున మేయర్ అభ్యర్థిగా పొట్లూరి స్రవంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

● అసెంబ్లీ ఎన్నికల తరువాత మారిన సీన్

అయితే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో నగరపాలక సంస్థలో సీన్ మారింది. టీడీపీ తలుపులు తెరవడంతో వైసీపీ నుంచి గెలిచిన మెజారిటీ కార్పొరేటర్లు టీడీపీలో చేరిపోయారు. దీంతో కార్పొరేటర్ల సంఖ్యలో వైసీపీ మైనారిటీలోకి పడిపోయింది. ప్రస్తుతం ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేల ఓట్లతో కలిపి టీడీపీకి మొత్తం 44 ఓట్లు ఉండగా, వైసీపీకి కేవలం 11 మంది కార్పొరేటర్లు, ఒక ఎమ్మెల్సీ కలిపి మొత్తం 12 మందే ఉన్నారు. 17, 38వ డివిజన్ల కార్పొరేటర్లు తటస్థంగా ఉన్నారు.

● నవంబరు 23తో నాలుగేళ్లు పూర్తి

నాలుగేళ్ల పదవీ కాలం పూర్తి అయితే కానీ మేయర్‌పై అవిశ్వాసం ప్రకటించే అవకాశం లేదు. 2025 నవంబరు 23నాటికి స్రవంతి మేయర్ పదవి చేపట్టి నాలుగేళ్ల కాలం పూర్తి అవుతుంది. ఆ మరుసటి రోజే అంటే నవంబరు24న కార్పొరేటర్లలో 50 శాతం కన్నా ఎక్కువ మంది మేయర్‌పై అవిశ్వాసాన్ని తెలుపుతూ (జిల్లా ఎన్నికల అధికారి) కలెక్టర్‌కు నోటీసులు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన నిర్ణయం టీడీపీలో జరిగిపోయింది. కార్పొరేషన్ పరిధిలోని ప్రజాప్రతినిధులు మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అవిశ్వాసానికి నిర్ణయించుకోగా, రాష్ట్ర పార్టీ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో నవంబరు 24న మేయర్ స్రవంతిపై అవిశ్వాసం ప్రకటిస్తూ మెజారిటీ కార్పొరేటర్లు కలెక్టర్‌కు నోటీసు ఇవ్వనున్నారు.



● ఏడాది చివరిలో..

నిబంధనల ప్రకారం నోటీసు అందుకున్న 30 రోజుల లోపు

- మిగతా 7లో..



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్


ఆర్ఆర్ఆర్ స్కీం ద్వారా
జలవనరుల అభివృద్ధి : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రిపేర్ రెనోవేషన్ అండ్ రెస్టోరేషన్ ఆఫ్ వాటర్ బాడీస్ (ఆర్ఆర్ఆర్) స్కీం ద్వారా జిల్లాలోని జలవనరులను అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్‌హాల్లో జిల్లా స్థాయి అమలు పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంటలకు నీటిని సమృద్ధిగా అందించేందుకు నీటి నిల్వ సామర్థ్యం, భూగర్భ జలాలు పెంచటమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని చెప్పారు. డ్వామా, ఇరిగేషన్, భూగర్భజల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. 220 మైనర్ ఇరిగేషన్ చెరువులను క్షుణ్ణంగా పరిశీలించి, చేపట్టాల్సి అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతులకు మేలు జరిగేలా జిల్లాలో ఈ పథకాన్ని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ దేశనాయక్, కేంద్రప్రభుత్వ జలవిభాగం శాస్త్రవేత్త పెరిక యాదయ్య, డ్వామా పీడీ గంగాభవాని, భూగర్భజలశాఖ డీడీ శోభన్‌బాబు పాల్గొన్నారు.

మిగిలిన బార్లకు నేటి నుంచి దరఖాస్తులు

● 14 వరకు స్వీకరణ ● 15న లక్కీడిప్
● నోటిఫికేషన్ విడుదల

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మొదటి విడతలో జిల్లా పరిధిలో మిగిలిన బార్లకు ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. గురువారం (నేటి)నుంచి ఈనెల 14 సాయంత్రం ఆరు గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈనెల 15న కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో లక్కీడిప్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓపెన్ కేటగిరిలో 25 బార్లు, కావలి మున్సిపాలిటీ పరిధిలో ఓపెన్ కేటగిరిలో 3 , బుచ్చిరెడ్డిపాలెం నగర్ పంచాయతీలో ఓపెన్ కేటగిరిలో ఒకటి, ఆత్మకూరు మున్సిపాలిటీలో ఓపెన్ కేటగిరిలో ఒకటి, అల్లూరు నగర పంచాయతీ పరిధిలో గీతకులాలకు ఒక బార్.. మొత్తం కలిపి 31 బార్‌లకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.





నెల్లూరు రూరల్ మండలంలో లేఅవుట్‌గా మారిన సాగుభూమి

తేలిన లెక్క!

● డెల్టాలో భారీగా తగ్గిన సాగుభూమి
● 30 ఏళ్లలో 45 వేల ఎకరాలు రూపాంతరం
● లేఅవుట్లు, పరిశ్రమలు, చేపల చెరువులుగా మార్పు
● ఆయకట్టును స్థిరీకరించిన ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు
● గజిట్ ప్రకటనకు అధికారుల సన్నాహాలు
● ఆ మేరకు మెట్టలో సాగు పెంపునకు అవకాశం

ఎట్టకేలకు పెన్నా డెల్టాలో వాస్తవ ఆయకట్టు లెక్క తేలింది. దాదాపు ఆరు నెలల పాటు శ్రమించిన ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు ఏ కాలువ కింద ఎంత ఆయకట్టు సాగు అవుతుందో నిర్ధారించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గతేడాది తీసుకున్న కీలక నిర్ణయం సత్ఫలితాలను ఇస్తోంది. ముఖ్యంగా మెట్ట లో సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ఈ లోకలైజేషన్ ప్రక్రియ(వాస్తవ ఆయకట్టు నిర్ధారణ) ఎంతగానో ఉపయోగపడుతుందని వ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. డెల్టాలోని 13 మండలాల పరిధిలో చూసుకుంటే భారీగా సాగు విస్తీర్ణం తగ్గిం ది. దాదాపు 45 వేల ఎకరాల ఆయకట్టు భూమి లేఅవుట్లు, పరిశ్రమలు, చేపలు, రొయ్యల చెరువులుగా మారిపోయింది.
- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

వాస్తవ ఆయకట్టు నిర్ధారణ వివరాలు (ఎకరాల్లో)..

మండలం	అధికారిక	వాస్తవ	అనధికార	మొత్తం
సంగం	9145	11704	3751	15455
కోవూరు	15819	11149	1036	12185
బుచ్చి	19347	9761	1688	11449
దగదర్తి	13866	11000	556	11556
కొడవలూరు	25964	16840	1621	18461
విడవలూరు	29496	20054	4943	24997
అల్లూరు	27136	26848	710	27558
బోగోలు	9227	3282	69	3351
నెల్లూరు రూరల్	5656	5437	2222	7659
టీపీ గూడూరు	23835	21110	0	21110
ముత్తుకూరు	19590	9910	4812	14722
వెంకటాచలం	15802	8229	4773	13002
ఇందుకూరుపేట	22117	20815	0	20815
మొత్తం	2,47,000	1,76,139	26,181	2,02,321

సోమశిల జలాశయం పూర్తయ్యాక ఏ ప్రాంతానికి ఏ దామాషా ప్రకారం సాగునీటి కేటాయింపులు చేయాలన్నది మూడు దశాబ్దాల క్రితం నిర్ణయించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఆ నిర్ణయం మేరకే ప్రతీ ఏటా సాగు సమయంలో నీటి కేటాయింపులు చేస్తున్నారు. సోమశిల కింద మొదటి హక్కుగా డెల్టా ప్రాంతానికి నీళ్లు ఇచ్చాకే జిల్లాలోని మిగిలిన ప్రాంతాలకు నీళ్లు ఇవ్వాలి. అయితే గత దశాబ్ద కాలంలో డెల్టాలో చాలా వరకూ లేఅవుట్లు వెలిశాయని, పరిశ్రమలు ఏర్పడ్డాయని, చేపలు, రొయ్యల సాగు జరుగుతోందని మెట్ట ప్రాంత రైతులు చెబుతూ వస్తున్నారు. డెల్టాలో తగ్గిన సాగు విస్తీర్ణం మేరకు మెట్ట ప్రాంతం లో స్థిరీకరించాలని కోరుతున్నారు. ఈ విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో గత జూలైలో లోకలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ ఓ. ఆనంద్.. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలను ఆదేశించారు. అప్పటి నుంచి ఈ రెండు శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఏ సర్వే నంబర్లో భూమి సాగు జరుగుతోంది..? ఏ సర్వే నంబర్లో భూమి సాగు లేకుండా రూపాంతరం చెందింది..? అన్న వివరాలను గుర్తించారు. అనంతరం నివేదికను సిద్ధం చేశారు.

● భారీగా తగ్గిన విస్తీర్ణం

డెల్టాలో 2.47 లక్షల ఎకరాల ఆయకట్టు ఇప్పటివరకూ అధికారికంగా ఉంది. అయితే ఇందులో 70 వేల ఎకరాలకు పైగా సాగు లేదు. అలానే డెల్టాలో కొత్తగా 26 వేలకు పైగా ఎకరాల్లో అనధికారికంగా సాగు జరుగుతోంది. ఈ మొత్తాన్ని చూసుకుంటే ప్రస్తుతం డెల్టాలో 2.02 లక్షల ఎకరాల్లో వాస్తవంగా సాగు జరుగుతున్నట్లు నిర్ధారించారు. ఇప్పటి వరకూ ఉన్న అధికారిక లెక్కల ప్రకారం చూసుకుంటే డెల్టాలో తాజాగా సుమారు 45 వేల ఎకరాల విస్తీర్ణం తగ్గుతోంది. అధికారుల లోకలైజేషన్ వివరాల ప్రకారం ఇందులో లేఅవుట్లుగా మారిన భూమి 7551 ఎకరాలు ఉండగా, చేపలు, రొయ్యల గుంటలుగా మారిన భూమి 14,409 ఎకరాల వరకూ ఉంది. ముఖ్యంగా నెల్లూరు రూరల్, బోగోలు మండలాల్లో చాలావరకూ సాగు భూమి తగ్గింది. ఇక్కడ సగాటికి పైగా ఆయకట్టు లేఅవుట్లు, చేపల చెరువులుగా మారిపోయాయి. ఇక సంగం మండలంలో అయితే సాగు విస్తీర్ణం 50 శాతం వరకూ పెరిగింది. మొత్తంగా చూసుకుంటే డెల్టా పరిధిలో కోవూరు నియోజకవర్గంలో 87,907 ఎకరాలు(ఐదు మండలాలు కలిపి), సర్వేపల్లిలో 48,834 ఎకరాలు(మూడు మండలాలు), కావలిలో 42,465 ఎకరాలు(మూడు మండలాలు), ఆత్మకూరులో 15,455 ఎకరాలు(ఒక మండలం), నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 7,659 ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు తేలింది.

● త్వరలో గజిట్..?

ఆయకట్టు వివరాలు తేల్చిన అధికారులు వీటిని ప్రభుత్వ ఫార్మాట్‌లో సిద్ధం చేస్తున్నారు. ఈ నెలలోనే కాలువల వారీగా జాబితాను కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిసింది. కొత్త వివరాలతో కూడిన ఆయకట్టును నిర్ధారిస్తూ కలెక్టర్ జిల్లా గజిట్‌లో ప్రచురించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. రానున్న రబీ సాగుకు సంబంధించి కూడా ఈ లెక్కల ఆధారంగానే సాగునీటి కేటాయింపులు జరిపే అవకాశమున్నట్లు ఇరిగేషన్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో డెల్టాలో తగ్గిన విస్తీర్ణాన్ని మెట్టలో పెంచేందుకు అవకాశం ఏర్పడింది.

సోమశిలకు 21,710 క్యూసెక్కుల వరద

అనంతసాగరం సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సోమశిలకు ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం 21,710 క్యూసెక్కులు వస్తుండగా, 64.150 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,100, డెల్టాకు 1,350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

టార్గెట్.. రౌడీషీటర్!

● నేరగాళ్లను వేటాడుతున్న పోలీసు శాఖ
● వరుస అరెస్టులు.. ఆపై పీడీ యాక్ట్ నమోదు
● జిల్లాను వీడుతున్న క్రిమినల్స్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నేర నియంత్రణతోపాటు నేరగాళ్లను అరెస్ట్ చేయడమే లక్ష్యంగా పోలీస్ శాఖలో కదలిక వచ్చింది. రౌడీషీటర్ శ్రీకాంత్, కి'లేడీ' అరుణల అంశం వెలుగులోకి వచ్చాక జిల్లాపై పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా నేరుగా జిల్లాకు వచ్చి నేరస్థులు, రౌడీషీటర్లు తోక జాడిస్తే తీవ్రంగా పరిగణలోకి తీసుకొని, తమదైన శైలిలో ముందుకు సాగాలని పోలీసు అధికారులను ఆదేశించారు. దీంతో ఎస్పీ జీ. కృష్ణకాంత్ పోలీసు అధికారులను అప్రమత్తం చేస్తూ నేర సామ్రాజ్యంపై ఉక్కుపాదం మోపుతున్నారు. రాజకీయ నాయకులు ఫోన్లు చేసి మనవారే అంటున్నా.. 'మీరూ ఇబ్బందులు పడతారు' అంటూ ఎస్పీ సమాధానాలు ఇస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించాక 300కి పైగా రౌడీషీట్లను ఓపెన్ చేశారు. నెల వ్యవధిలో 70 మంది రౌడీషీటర్లు, వరుసగా నేరాలకు పాల్పడుతున్న వారని అరెస్టులు చేయించారు. నాలుగు పీడీయాక్ట్‌ల కేసులు నమోదు చేయగా, మరో నాలుగు పీడీ యాక్ట్ కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.



జిల్లా బహిష్కరణకు వెనుకాడం

పదేపదే నేరాలకు పాల్పడేవారిని జిల్లా బహిష్కరణకు వెనుకాడం. ప్రతి నేరస్థుడిపై పటిష్ట నిఘా ఉంచాం. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా తక్షణ చర్యలు ఉంటాయి. జిల్లాను ప్రశాంతంగా ఉంచడమే ధ్యేయంగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. శాంతిభద్రలకు భంగం కలిగిస్తే పీడీ యాక్టు నమోదు చేస్తాం.
- జీ.కృష్ణకాంత్, ఎస్పీ

'పునాస'కు మంగు!

పూత నల్లబారి తగ్గిన కాపు ● ఆశించిన స్థాయిలో మామిడికి తగ్గని ధర
● సాగుదారుల్లో నిరాశ, నిస్పృహ

ఉలవపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 'బంగినపల్లి'లో భారీ నష్టాలు చవిచూసిన రైతును పునాస మామిడి కూడా ముంచేసింది. ఇటీవల కురిసిన వర్షానికి చెట్లపై పూత నల్లబారి వాడిపోవడం, ముందస్తుగా వచ్చిన కాయలు మంగుమచ్చలు తేలడంతో ధర పడిపోయిందని సాగుదారులు వాపోతున్నారు. ఉలవపాడు మండలంలో సుమారు 2వేల ఎకరాల్లో పునాస సాగులో ఉంది. సాధారణ మామిడి సీజన్ ముగుస్తుందనగా పునాస పూత మీదకు వస్తుంది. మే నెల నుంచి మొదలై దాదాపు జనవరి వరకు విడతల వారీగా వెంట వెంటనే పూత, పిందెలతో మూడు కాపుల వరకు కోతలకు అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం ఒక కిలో నాణ్యమైన పునాస మామిడి ధర రూ.40 వరకు పలుకుతోంది. పాక్షికంగా మంగుమచ్చలు కలిగిన పునాస రూ.20 పలుకుతుండగా, పూర్తిగా మంగుతో కూడిన కాయలు 10లకే మార్కెట్‌కు వేయాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు. రెండు నెలల క్రితం కిలో ధర రూ.60 వరకు పలికింది. కేరళాలో ఓనం పండుగ సమయంలో పునాస మామిడి ధరకు రెక్కలు వస్తాయి. ఒక్కోసారి కిలో ధర కాయ నాణ్యతను బట్టి రూ.70 నుంచి 80 వరకు పలుకుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ధరలు పెరిగే అవకాశం లేదని రైతు నిరాశ చెందుతున్నాడు.



చెట్లపై అక్కడక్కడా ఉన్న మామిడి కాయలు

● వ్యాపారుల సిండికేట్

ఉలవపాడుతో పాటు చుట్టు పక్కల మండలాల్లోని పునాసకు పెద్ద మార్కెట్ ఉలవపాడు కావడంతో ఇక్కడ ఐదారు మార్కెట్లు వెలిశాయి. వ్యాపారులంతా ఒకే మాటపై ధర నిర్ణయించి కొనుగోళ్లు చేస్తుంటారు. వారు నిర్ణయించిందే ధర. లేదంటే కాయల కోతలు నిలిచిపోతాయి. దీంతో చెట్లకే కాయలు పరిమితమై పండిపోతుంటాయి. దీంతో రైతులు తప్పని సరిగా సిండికేట్ వ్యాపారులకు తలొగ్గక తప్పడం లేదు.



ఎగుమతి కోసం పునాస మామిడి కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	110
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	226

కోడిగుడ్ల ధర (100): 570

రైతులకు సహాయపడేదే సహకార సంస్థ

బిట్రగుంట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో ఉండి సహాయపడేదే సహకార సంస్థ అని టీడీపీ నేత మధుబాబు నాయుడు అన్నారు. బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలోని నాగుల వరం పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం అధ్యక్షుడు చిలకపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఫొటోల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శైలజ, డైరెక్టర్లు లక్కాకుల మాధవరావు, వాయిల సుధాకర్, నాయకులు యర్రం వెంకటేశ్వర్లురెడ్డి, బీజేపీ నేతలు ఎన్‌ఎస్‌యాదవ్, వీరాల శ్రీనివాసులుయాదవ్, జనసేన నేత టీ.వెంకటేశ్వర్లు, బీ.ప్రభాకర్, మాకాఅర్పత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో కూరగాయల సాగు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : తక్కువ ఖర్చుతో సేంద్రియ ఎరువులను వినియోగించి కూరగాయల సాగు చేపట్టి అధిక ఆదాయం పొందాలని ఎంపీడీవో నరేంద్రదేవ్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం సేంద్రియ ఎరువుల వినియోగం, కూరగాయలు సాగు, వయోజన విద్యపై డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్ మాట్లాడుతూ కూరగాయలు, విత్తనాలు పంపిణీ చేసిన మహిళలకు చెత్తసంపద కేంద్రంలో 2 కేజీల సేంద్రియ ఎరువు ప్యాకెట్ రూ.15లకే ఇవ్వనున్నట్లు తెలిపారు. నూరుశాతం అక్షరాస్యత సాధించేందుకు ప్రభుత్వం వయోజన విద్యా కేంద్రాలను ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నారాయణ, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చవితి వేడుకలు


పూజల అనంతరం నిర్వాహకులతో వినాయకుడి విగ్రహం వద్ద డీఎస్పీ శ్రీధర్

కావలి(టౌన్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకుల పట్టణంలో బుధవారం కూడా కొనసాగాయి. బ్రిడ్జి కూడలిలో సిద్ధు పర్యవేక్షణలో భగత్‌సింగ్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీధర్, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఛైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు పాల్గొన్నారు. ముందుగా వినాయక విగ్రహం వద్ద పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. గణేష్ ఉత్సవాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారని నిర్వాహకులను డీఎస్పీ అభినందించారు. రెండవ పట్టణ సీఐ గిరిబాబు పాల్గొని అన్నదానం ప్రారంభించారు. సిద్ధు మాట్లాడుతూ ఉత్సవాలు జయప్రదం చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతూ గురువారం నిమజ్జన గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కచ్చేరిమిట్టలో కలుగోళశాంభవి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగియనున్నాయి.

జాతీయ బాస్కెట్‌బాల్ జట్టుకు హేమంత్


హేమంత్

కందుకూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పంజాబ్‌లోని లూథియానాలో జరిగే జాతీయ స్థాయి బాలుర బాస్కెట్‌బాట్ పోటీలలో పాల్గొనేందుకు రాష్ట్రజట్టుకు కందుకూరుకు చెందిన శ్రీ గాయత్రీ కళాశాల విద్యార్థి చదలవాడ హేమంత్ ఎంపికయ్యారు. పిఠాపురంలో జరిగిన రాష్ట్రజట్టు శిక్షణ శిబిరంలో పాల్గొని ఈనెల 9 వరకు జరగనున్న జాతీయస్థాయి పోటీలకు బయలుదేరి వెళ్తున్న సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు, డైరెక్టర్ భరద్వాజ్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వలేటి రవీంద్ర, తొట్టెంపూడి సుబ్బారావు, అధ్యాపకులు హేమంత్‌ను అభినందించారు. జాతీయస్థాయి పోటీలలోను రాష్ట్రజట్టు విజేతగా నిలిచేలా హేమంత్ అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని వారు ఆకాంక్షించారు.

మూఢవిశ్వాసాలను రూపుమాపాలి

లింగసముద్రం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ మూఢ విశ్వాసాలను రూపుమాపేందుకు కృషి చేయాలని మాజీ సర్పంచు ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు చెప్పారు. లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో బుధవారం జరిగిన జేవీవీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే సమాజం నెలకొల్పేందుకు అందరూ సహకరించాలన్నారు. అలాగే చిన్ననాటి నుండే విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలన్నారు. చెకుముకి పత్రికలను తప్పనిసరిగా చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు టీవీవీ కృష్ణకుమార్, గారపాటి మహేంద్ర, కే.ప్రభాకర్, ఎం కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ మండల కార్యవర్గం ఎంపిక

మండల జనవిజ్ఞాన వేదికగా గారపాటి మహేంద్ర, గౌరవ అధ్యక్షుడుగా ఎం కొండయ్య, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ ప్రదీప్, కోశాధికారిగా కె ప్రభాకర్, మహిళా కార్యదర్శిగా సత్యవాణి, కార్యదర్శులుగా ఎం సుధాకర్‌రావు, టి శేషారావు, ఎ సాంబయ్య, ఆశా అరుణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పురుగు మందుల దుకాణాల తనిఖీ

దగదర్తి(బిట్రగుంట), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలంలో పలు ఎరువులు, పురుగు మందుల షాపులను అధికారులు బుధవారం తనిఖీ చేశారు. చెన్నూరు గ్రామంలోని వెంకటేశ్వర ట్రేడర్స్, అన్నపూర్ణ రైతు డిపోలో స్టాక్, రికార్డులు, పత్రాలను పరిశీలించారు. దగదర్తి గ్రామంలో శ్రీ వేంకటేశ్వర ఫర్టిలైజర్స్ షాపులో రికార్డులు, స్టాక్‌ను విజిలెన్ అధికారి శ్రీహరిరావు, ఇనెస్పెక్టర్ అఫ్ పోలీస్ వేణుగోపాలరావు, ఏవో శ్రీధర్‌రెడ్డి తనిఖీలు చేశారు.

కరేడులో పోలీసు నిర్బంధాలు ఆపకుంటే రాష్ట్రస్థాయి ఉద్యమం

● రైతు సంఘాలు, రైతుకూలీ సంఘాల నేతలు

కందుకూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉలవపాడు మండలం కరేడులో రాష్ట్ర ప్రభుత్వం బలవంతపు భూసేకరణను తక్షణం నిలిపివేయాలని, గ్రామంలో పోలీసు నిర్బంధాలను ఎత్తివేయకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని రైతుసంఘాలు, రైతుకూలీ సంఘాల నేతలు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయా సంఘాల నేతలు పాల్గొన్నారు. ముందుగా జేఏసీ ఛైర్మన్ మిరియం శ్రీనివాసులు మాట్లాడుతూ భూసేకరణపై అధికారులు అసత్య ప్రచారాలు చేసేందుకు సిద్ధపడటం వారి దిగజారుడుతనానికి అద్దం పడుతోందని విమర్శించారు. ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జల ఈశ్వరయ్య మాట్లాడుతూ కరేడు ఉద్యమంలో ప్రజాసంఘాలు, గిరిజన మహిళలపై పెట్టిన అక్రమ కేసులు తక్షణం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు గుజ్జుల ఈశ్వరయ్య, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, మిరియం శ్రీనివాసులు, కటారి అజయ్ కుమార్, సీహెచ్ సాగర్, ఎస్ఏ గౌస్, సురేష్‌బాబు, ఆర్. మోహన్, కనపర్తి శివరాం, పోకూరి కోటయ్య, కె. నాంచార్లు, జీవీబీ కుమార్, ఎల్.రాజశేఖర్, గంజి ప్రసాద్, మున్వర్‌సుల్తానా పాల్గొన్నారు.

● భారీ పోలీసు బందోబస్తు

రౌండ్ టేబుల్ సమావేశం సందర్భంగా కందుకూరులో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద, రౌండ్ టేబుల్ సమావేశం జరిగే ప్రాంతంలోనూ పట్టణంలోని ప్రధాన కూడళ్లలోను భారీగా పోలీసులు మోహరించారు.

మేయర్‌కి పదవీ గండం ?

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ అవిశ్వాస తీర్మానం కోసం సమావేశం ఏర్పాటు చేయాలి. నోటీసు అందిన 15 రోజుల్లో అవిశ్వాస తీర్మాన సమావేశానికి కలెక్టర్ తేదీ ప్రకటిస్తారు. ఆ తేదీన జరిగే సమావేశానికి కోరం ఉంటే అవిశ్వాస తీర్మానం కోసం ఓటింగ్ నిర్వహిస్తారు. కార్పొరేటర్ల మెజారిటీ ఓటింగ్ ప్రకారం అవిశ్వాస తీర్మానం నెగ్గిందా లేదా అనే విషయం తెలుతుంది. ప్రస్తుతం ఉన్న సంఖ్యా బలం ఆధారంగా గమనిస్తే మేయర్ పొట్లూరి స్రవంతికి పదవీ గండం తప్పదనే అనిపిస్తోంది.

రూ.లక్షలు వెచ్చిస్తున్నా....
కలుషిత నీరే దిక్కు..!

● పని చేయని మంచినీటి పథకాల ఫిల్టర్ బెడ్లు
● 'రాళ్లపాడు'లో నీరు అడుగంటి దుర్వాసన
● ఆందోళనలో పలు గ్రామాల ప్రజలు


మొగిలిచెర్ల సమీపంలోని మన్నేరు నదిలో ఉన్న చుండి-చెర్లోపాలెం మంచినీటి పథకం బావి

లింగసముద్రం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన భారీ మంచినీటి పథకాల నుంచి కలుషిత నీరు సరఫరా జరుగుతోంది. ప్రధానం రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా పనిచేసే మంచినీటి పథకాల నుంచి పచ్చగా మారిన కలుషిత నీరు సరఫరా అవుతోంది. దీంతో సుమారు 100కు పైగా గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గుడ్లూరు, రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకాలలోని ఫిల్టర్ బెడ్లు సక్రమంగా పని చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. పథకాల నిర్వహణ ఖర్చులకు ప్రతినెల భారీ వెచ్చిస్తున్న నిధులు దుర్వినియోగం అవుతున్నాయి తప్ప పథకాలకు రాళ్లపాడు ప్రాజెక్టులో ఉన్న ఇన్‌టేక్ వెల్ నుంచి వచ్చే నీరు ఫిల్టర్ కావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రాజెక్టులో ప్రస్తుతం నీరు 7.5 అడుగులకు చేరింది. దీంతో నీరు రంగు మారి కలుషితమై దుర్వాసన వస్తున్నట్లు పలువురు తెలిపారు. వాస్తవానికి ప్రాజెక్టులో నీరు పచ్చగా ఉండి కలుషితమైనా మంచినీటి పథకాల ఫిల్టర్ బెడ్లు పని చేస్తే రక్షిత నీ రే రావాల్సి ఉంది. కానీ ఫిల్టర్ బెడ్లు పని చేయనందువలన కలుషితమైన నీరు వస్తోందని ప్రజలు అంటున్నారు.

● గుడ్లూరు నీటి పథకంపై పర్యవేక్షణ కరువు

రాళ్లపాడు గ్రామ సమీపంలో ఉన్న గుడ్లూరు మంచినీటి పథకం నుంచి లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లోని 56 గ్రామాలకు నీటిని సరఫరా జరుగుతోంది. అయితే ఈ పథకంపై అధికారులు, నిర్వాహకుల పర్యవేక్షణ కరువైంది. చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్న అధికారులు ఉన్న నాలుగు ఫిల్టర్ బెడ్లు సరిగా పని చేస్తున్నాయా లేదా కూడా పర్యవేక్షించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ బెడ్లలో నాలుగేళ్ల క్రితం వేసిన ఇసుక అయిపోయింది. ఇసుక మార్చకపోవడంతో ఫిల్టర్ బెడ్లు పని చేయక మంచినీరు ఫిల్టర్ కాకుండా దుర్వాసన వస్తోంది.


రాళ్లపాడు గ్రామ సమీపంలో ఉన్న గుడ్లూరు మంచినీటి పథకం ఫిల్టర్ బెడ్

● 'రాళ్లపాడు-రోళ్లపాడు'లో పని చేయని ఫిల్టర్ బెడ్

రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకం నుంచి లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లోని 42 గ్రామాలకు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ఈ పథకంకు చెందిన పెంట్రాల వద్ద ఉన్న ట్రీట్‌మెంటు వాటర్ ప్లాంటులోని మూడు ఫిల్టర్ బెడ్లలో ఒక ఫిల్టర్ బెడ్ పని చేయడం లేదు. అలాగే ఈ ఫిల్టర్ బెడ్‌లోని పైపులు కూడా కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. వీటిని బాగు చేసేందుకు సాంకేతిక నిపుణులను విజయవాడ లేదా చెన్నై నుంచి రప్పించాల్సి ఉంది. మిగిలిన రెండు ఫిల్టర్ బెడ్లలోని ఇసుకను మార్చాల్సి ఉంది. ఇందులోని ఇసుకను 2022లో మార్చారు. దీంతో మంచినీరు సరిగా ఫిల్టర్ కావడం లేదు. ఈ కారణంగా ఈ పథకం నుంచి కూడా మంచినీరు కలుషితమై వస్తోంది. దీంతో అధికారులు, నిర్వాహకులు ఇటీవల 10 రోజుల నుంచి రెండు రోజులకొకసారి బ్లీచింగ్ కలిపి మంచినీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే చుండి-చెర్లోపాలెం మంచినీటి పథకం నుంచి లింగసముద్రం మండలంలో 4 గ్రామాలకు, వలేటివారిపాలెం మండలంలో 7 గ్రామాలకు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ఈ పథకం బావి మొగిలిచెర్ల సమీపంలోని మన్నేరు నది నిర్మించారు. ఈ బావి నుంచి నీరు నేరుగా ట్యాంకులోకి పంపు చేసి అక్కడి నుంచి ఆయా గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. మంచినీటి ట్యాంకులో బ్లీచింగ్ వేసి నీటిని సరఫరా చేస్తున్నా ఇక్కడ సిబ్బంది కొరత వేధిస్తోంది. దీనితో గ్రామాల్లో వందల సంఖ్యలో పథకం మంచినీటి పైపులకు పైపులు, మోటార్లు వేసి వరల బావులను నింపుకుంటున్నారు. దీంతో నీటి సరఫరాలో ఇబ్బందులు కలగడంతో పాటు కొన్ని గ్రామాల ప్రజలకు నీరు అందడం లేదన్న ఆరోపణలున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మహిళల ఉచిత ప్రయాణంతో గ్రోత్ పెరిగింది

● డీ.ఆదినారాయణ, ఆర్టీసీ డీఎం,

కావలి(టౌన్), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళల ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ గ్రోత్ రేట్ పెరిగింది. గతంలో మహిళల ప్రయాణం గ్రోత్ రేట్ 30 శాతం ఉండగా ప్రస్తుతం 60 శాతానికి పెరిగింది. ఉచిత ప్రయాణంతో ఆర్టీసీకి ఎటువంటి నష్టంలేదని కావలి ఆర్టీసీ డీఎం డీ.ఆదినారాయణ తెలిపారు.

? ఇప్పటి వరకు ఎంత మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారు.

! ఆగస్టు 15 నుంచి 31వ తేదీ వరకు కావలి డిపో పరిధిలో 30,34,000 మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారు.

? మహిళా ప్రయాణికుల సంఖ్య ఏ మేరకు పెరిగింది, ఏఏ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయవచ్చు. ఏ బస్సుల్లో చేయకూడదు.

! మహిళా ప్రయాణికుల సంఖ్య 30 శాతం పెరిగింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణాలు చేయవచ్చు. నాన్ స్టాప్, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఏసీ బస్సుల్లో ప్రయాణానికి అనుమతి లేదు.

? ఉచిత ప్రయాణాలతో బస్సుల్లో రద్దీ పెరిగిందా. కొత్త బస్సులు ప్రవేశపెడతారా.

! బస్సుల్లో రద్దీ సమస్య లేదు. కొత్త బస్సులు ప్రవేశపెట్టాలనే ఆలోచన ప్రభుత్వం చేస్తుంది. ఎలక్ట్రిక్ బస్సులు కూడా రానున్నాయి.

పాఠశాలకు కుర్చీల వితరణ

వలేటివారిపాలెం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చుండి ఎంపీపీ స్కూల్‌కు అదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి, హైదరాబాద్‌లో గైల్ కంపెనీలో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్న షేక్ మస్తాన్‌వలి ఎస్ ఆకారంలో ఉండే 3 కుర్చీలను బహూకరించారు. మస్తాన్‌వలికి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

టీడీపీతోనే మహిళల అభ్యున్నతి

● కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ● స్త్రీశక్తికి సంఘీభావంగా మహిళల భారీ ర్యాలీ

కావలి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : మహిళల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలు ఆర్టీసీ బస్సులో ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం అమలుకు సంఘీభావంగా కావలిలో బుధవారం ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. కావలి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి పట్టణంలోని మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డులో ఉన్న ఐ లవ్ కావలి సెల్ఫీ పాయింట్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి ఎమ్మెల్యేతో కలిసి తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి ర్యాలీగా సూపర్‌సిక్స్ పథకాలతో కూడిన ఫ్లకార్డులు పట్టుకుని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సీఎం చంద్రబాబు చిత్రపటాలకు ఎమ్మెల్యేతోపాటు మహిళలు పాలభిషేకం చేశారు. అనంతరం అక్కడ నుంచి అంబేద్కర్ విగ్రహం సెంటర్ మీదుగా శివాజీ సెంటర్‌కు ర్యాలీ చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోనే ఎన్టీఆర్ హయాం నుంచి చంద్రబాబు వరకు మహిళల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించారన్నారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత తొలుత మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత ఎన్టీఆర్ దే నన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల మహిళలు, నాయకులు, పాల్గొన్నారు.



స్త్రీశక్తి పథకానికి సంఘీభావంగా పట్టణంలో మహిళలతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా కూటమి పాలన

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు


మహదేవపురంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలకు అనుకూలంగా పాలన సాగిస్తోందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మహదేవపురంలో 20 లక్షలతో నిర్మించబోయే సీసీ రోడ్లుకు బుధవారం ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా రూ..40 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఇంతపెద్దమొత్తంలో నిధుల కేటాయింపుకు సహకరించిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. గతప్రభుత్వంలో పంచాయతీ రాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని, నేడు తిరిగి ఆ వ్యవస్థను గాడిలో పెట్టి గ్రామాలలో అభివృద్ధి అంటే ఏమిటో చంద్రబాబు చేసి చూపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, హరికృష్ణ, నార్నె రోశయ్య, గుల్లా సుధాకర్, దామా అశోక్, గుల్లా సుబ్బయ్య, దామా చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు. కాగా గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు ఓరుగంటి రమణయ్య, గుల్లా శ్రీనివాసులులు ఈ కార్యక్రమానికి దూరంగా ఉండటం, మరో సీనియర్ నేత గుల్లా సుధాకర్ కూడా చివరి నిమిషం వరకు కార్యక్రమానికి వెళకుండా అలకవహించటం చర్చనీయాంశమైంది.

ఈ క్రాప్ నమోదును వేగవంతం చేయాలి

● జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి


మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి

కందుకూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వీఏఏలు ఈ క్రాప్ నమోదును వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి పీ.సత్యవాణి కోరారు. స్థానిక కృషి విజ్ఞానకేంద్రం సమావేశ మందిరంలో ఇంచార్జి ఏడీఏ కేవీ శేషారెడ్డి అధ్యక్షతన బుధవారం కందుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల వీఏఏలు, వ్యవసాయ సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ క్రాఫ్ నమోదులో సిబ్బంది పూర్తిగా వెనుకబడి ఉన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈనెలాఖరులోగా ఎట్టిపరిస్థితుల్లో ఈ క్రాఫ్ నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు.

● వారంలోగా యూరియా నిల్వలు

కందుకూరు సబ్ డివిజన్‌లో తీవ్రంగా ఉన్న యూరియా కొరత, ఆర్ఎస్‌కేలలో ఎరువులు అందుబాటులో లేనందున ప్రైవేటు వ్యాపారుల వద్ద బ్లాక్‌లో కొనుగోలు చేసి రైతులు నష్టపోతున్న పరిస్థితులపై ఆంధ్రజ్యోతి ఆమెను ప్రశ్నించగా వారంలోగా సంవృద్ధిగా ఈ ప్రాంతానికి యూరియా నిల్వలు వచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మెట్టప్రాంతాల కోసం ప్రత్యేకంగా 500 టన్నుల యూరియా కేటాయించారని ఆ యూరియాలో అధికవాటా కందుకూరు సబ్ డివిజన్‌కే కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జామాయిల్ రైతులు కూడా యూరియా కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాలలో యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని రైతు సేవాకేంద్రాలలో ఎరువుల నిల్వలు పెట్టేలా తక్షణం చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు. ఆ మేరకు ఏర్పాట్లు చేసుకుని ఇండెంట్లు పంపించాలని వ్యవసాయ సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. ఏడీఏ శేషారెడ్డి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు జమకాని రైతులకు సాంకేతిక అడ్డంకులు తొలగేలా చర్యలు తీసుకోవాలని వీఏఏలకు సూచన చేశారు. ఈ సమావేశంలో ఏఓలు అబ్దుల్‌రహీం, రవికుమార్, విజయ్‌కుమార్, గీతాప్రకాష్, సీహెచ్ దుర్గ, జి. మధు తదితరులు పాల్గొన్నారు.

తలసేమియాపై అవగాహన


పిల్లలకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ వైద్యాధికారి, సిబ్బంది

కావలి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రక్తహీనత ఉన్న చిన్నారులకు ఉచితంగా హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రక్తశాతం తక్కువగా ఉన్న వారికి అవసరమైన వైద్యసేవలకు రెడ్‌క్రాస్ అండగా ఉంటుందని కావలి రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మన్, తలసేమియా డేకేర్‌సెంటర్ కన్వీనర్ కే. హరినారపరెడ్డి తెలిపారు. స్థానిక తుఫాన్‌నగర్ జనరల్‌కాలనీ, అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం తలసేమియాపై అవగాహన కల్పించారు. అనంతరం రెండు నుంచి 12 నెలలు ఉన్న చిన్నారులకు రెడ్‌క్రాస్ తల సేమియా డేకేర్‌సెంటర్ ఆధ్వర్యంలో ఉచితంగా 72 మందికి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ రక్త కేంద్రం కన్వీనర్ డాక్టర్ రమ్య మాట్లాడుతూ పిల్లలలో సహజంగా పౌష్టికాహారం లోపం వలన రక్తహీనత ఉంటుందని కొంత మందిలో తలసేమియా సికిల్‌సెల్ లాంటి జన్యుపరమైన వ్యాధుల వలన కూడా రక్తహీనత ఉంటుందన్నారు. పౌష్టికాహారం లోపం వలన రక్తహీనత ఉన్న వారికి అదనపు ఆహారం మందుల వలన రక్తహీనత సమస్య తగ్గుతోందన్నారు. తలసేమియా సికిల్‌సెల్ వ్యాధి పీడితులకు ప్రత్యేక చికిత్స, తరచు రక్తం ఎక్కించటం చేయాలన్నారు. ఈ జన్యుపరమైన వ్యాధులు ఉన్న వారిని గుర్తించేందుకే స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంగళరావునగర్ అర్బన్‌ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ మహేష్, సూపర్‌వైజర్ ప్రసాద్,ఏఎన్ఎం రమాదేవి, రెడ్‌క్రాస్, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

దగదర్తి(బిట్రగుంట), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రసాయ ఎరువులు, విషపూరితమైన పురుగు మందుల వాడకాని మాని ప్రకృతి వ్యవసాయం చేయడం ఎంతో మంచిదని మండల వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. దగదర్తి మండలం పెద్దపుత్తేడు గ్రామ సచివాలయ పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచు నాగమణి, మోడల్ మండల టీం లీడర్ హరిచందన, సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏడుకొండలు, సురేఖ, మౌనిక, యానాదయ్య, యమున, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సుష్మ, రైతులు తదితరు లు ఉన్నారు.

'క్యాన్సర్ స్క్రీనింగ్' పకడ్బందీగా నిర్వహించాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మజ


శిక్షణలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మజ

కందుకూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : కందుకూరు డివిజన్‌లో త్వరలో చేపట్టనున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఆరోగ్య సిబ్బంది సన్నద్ధం కావాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు పీ.పద్మజ కోరారు. బుధవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో డివిజన్‌లోని ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలను వేధిస్తున్న నోటి, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్‌లను ప్రాథమిక దశలో గుర్తించటం ద్వారా పూర్తిగా నివారించేందుకు అవకాశం ఉందన్నారు. ఈ మూడు క్యాన్సర్‌లు వచ్చే లక్షణాలు ఉన్నవారిని గుర్తించడమే లక్ష్యంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రత్యేక యాప్‌లో మహిళలను సంబంధిత ప్రశ్నలు అడిగి లక్షణాలను గుర్తించేలా వైద్యాధికారులు సమగ్రశిక్షణనిచ్చారు. యాప్‌లో వ్యాధి లక్షణాలు ఉన్నట్లు తేలిన 30 ఏళ్ల పైబడిన మహిళలందరికీ సమీపంలోని ఏరియా వైద్యశాలలో నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు యశ్వంత్, శాంతి, శైలజ, బ్యూలాగ్రేస్, మహేష్‌రెడ్డి, సీహెచ్‌వో గుంటుపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలి

ఉలవపాడు, సెప్టెంబరు 3 : రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించి సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వీ.సత్యవతి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని వీరేపల్లి రైతుసేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ రైతులు ప్రతి ఏటా భూసార పరీక్షలు చేయించుకుని పంటలకు అనుగుణంగా తగిన మోతాదులో ఎరువుల వినియోగం చేయాలన్నారు. భూమిలో కార్బన్ శాతం పెంచుకోవాలని, అందుకోసం పచ్చిరొట్ట ఎరువులు జనుము, జీలుగ విత్తనాలు వేసి పూతదశలో కలియదున్నాలని పేర్కొన్నారు. వీటికి సంబంధించిన విత్తనాలు సబ్సిడీలో పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నర్సోజీ, కందుకూరు ఏడీఏ కేవీ శేషారెడ్డి, ఉలవపాడు ఏవో విజయ్‌కుమార్, వీఏఏ, వీహెచ్‌ఏలు శైలజ, వెంకట్రావు, షారుక్, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పలు కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

- జిల్లాలో పలువురికి స్థానం

నెల్లూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వివిధ రాష్ట్ర కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాకు చెందిన పలు నియోజకవర్గాలకు చెందిన టీడీపీ నాయకులకు ఈ జాబితాలో స్థానం దక్కింది. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కనపర్తి గంగాధర్(నెల్లూరు రూరల్) నియమితులయ్యారు. ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అబ్బూరి రమేష్ నాయుడు (ఆత్మకూరు), ఏపీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కటారి రమణయ్య (ఆత్మకూరు), ఏపీ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సల్మా షరీన్ షేక్ (ఆత్మకూరు), ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పుత్తా వెంకట అజయ్ కుమార్ (నెల్లూరు సిటీ) నియమితులయ్యారు.

9న 5కే మారథాన్

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, వైద్య ఆరోగ్యశాఖ, స్పోర్ట్ అథారిటీ, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన 5కే మారథాన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం ఈ నెల 7వ తేదీలోగా 17 నుంచి 25 సంవత్స రాల వయసున్న విద్యార్థులు 8639432458 నెంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసు కోవాలని కోరారు. మగవారు, మహిళలు, ట్రాన్స్ జెండర్లకు వేర్వేరుగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. మొదటి బహుమతి కింద రూ.10వేలు, రెండో బహుమతిగా రూ.7వేలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 9వ తేదీ ఉదయం 6 గంటలకు ఏసీ స్టేడియం నుంచి ఈ మారథాన్ మొదలవుతుందని వెల్లడించారు.

'సంకల్ప్ హ్యూ'తో ప్రచారం

- ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సంకల్ప్ హ్యూ (మహిళా సాధికరత హబ్) ద్వారా సంక్షేమం, ఆరోగ్యం, సాధికారత అంశాలపై ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ప్రారంభమైన ఈ కార్యక్రమాలు ఈనెల 12వ తేదీ వరకు కొనసాగిస్తామని తెలిపారు.

కారును ఢీకొన్న లారీ

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

కావలి రూరల్: లారీని కారు అధిగమించే క్రమంలో కారును లారీ ఢీకొన్న సంఘటన బుధవారం కావలి మండలం గౌరవరం జాతీయ రహ దారిపై జరిగింది. బాధితుల వివరాల మేర కు... పల్నాడు జిల్లా గురజాల మండలం గంగవరంకు చెందిన వారణాసి జగన్నాథంకు పెరాలసిస్ రావడంతో మారుతి ఎర్టిగా కారులో తిరుపతికి వెళ్లి ఆయుర్వేద వైద్య శాలలో చూపించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలోని గౌరవరం సమీపంలో తమిళనాడు నుండి రాజమండ్రికి గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న లారీ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగంతో పాటు ఒక పక్క దెబ్బతినగా కారు లో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. కారులో డ్రైవర్ అంజితో పాటు 5మంది ఉండగా త్రుటిలో ప్రాణాలతో బయట పడ్డారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మత సామరస్యానికి ప్రతీక..

ఏఎస్ పేట దర్గా

ఈ నెల 18న గంధమహోత్సవం





దర్గాలోని స్వామిఅమ్మవార్ల సమాధులు

ఏఎస్‌పేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కేంద్రానికి 50 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఏఎస్‌పేట దర్గా మతసామర స్యానికి ప్రతీకగా వెలుగొందుతోంది. కులమతా లకు అతీతంగా ప్రజలు మహిమాన్వితమైన ఈ దర్గాను ప్రతి ఏటా సందర్శిస్తారు. శ్రీశ్రీశ్రీ హజరత్ సయ్యద్ ఖాజా రహంతుల్లా నాయబ్ రసూల్ దర్గాను 17వ శతాబ్దంలో నిర్మించారు. అప్పటి నుండి అన్ని వర్గాల భక్తుల ఆదరణను చూరగొంటోంది.

● మహిమాన్వితం.. నాయబ్ రసూల్ దర్గా!

కర్ణాటక రాష్ట్రంలో జన్మించిన ఖాజా రహంతుల్లా చిన్నతనంలోనే ఇల్లు విడిచి ఆధ్యాత్మికం వైపు వెళ్లారు. మక్కాను దర్శించుకొని భక్తిశ్రద్ధలతో తపస్సు చేసి నాయబ్ రసూల్ అనే బిరుదు పొందారు. అనంతరం కర్నూలు నవాబ్ సైన్యంలో సిపాయిగా చేరారు. తన మహిమలతో తోటి సిపాయిలు, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేవారు. తన మహిమల గురించి తెలుసుకున్న కర్నూల్ నవాబ్ కుమార్తె హబీబా ఖాతూన్ పట్టుబట్టి ఆయనను వివాహం చేసుకున్నారు. అనంతరం నాయబ్ రసూల్‌తో కలిసి ఏఎస్ పేటకు విచ్చేశారు. ఆ చుట్టు పక్కల 10 గ్రామాలను పాలిస్తూ తన మహిమలతో ప్రజా సమస్యలను పరిష్కరించేవారు. తాగునీటి సమస్య తీర్చడానికి ఏఎస్ పేటలో కోనేరును నిర్మించారు. ప్రార్థన చేసుకునేందుకు మసీదును నిర్మించారు. తన మహిమలతో ప్రజల బాధల ను తీరుస్తూ పలువురు శిష్యులను ఏర్పరచుకు న్నారు. 17వ శతాబ్దంలో ఆయన సిద్ధి సమాధి పొందారు. దీంతో ఆమె సతీమణి హబీబా ఖాతూన్ దర్గాను నిర్మించారు. కొంత కాలానికి ఆమె కూడా నాయబ్‌రసూల్ పక్కనే సమాధి అయ్యారు. అలా ఏర్పడ్డ ఏఎస్ పేట దర్గా అప్పటి నుండి నేటి వరకు మహిమ గల దర్గాగా ఖ్యాతికెక్కింది.

● దర్గాను దర్శిస్తే మానసిక ప్రశాంతత

నాయబ్ రసూల్ దర్గాను దర్శించుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో ఈ దర్గాను దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుండి వేలాదిమంది భక్తులు విచ్చేస్తూంటారు. దర్గా సన్నిధిలో రెండు రాత్రులు నిద్రిస్తే మానసిక, శారీరక సమస్యలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. నాయబ్ రసూల్ దర్గాను దర్శించిన తరువాత మాసిక ప్రశాంతత లభించిందని ప్రముఖులు చెబుతున్నారు. అందుకే పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు ఏడాదికి ఒక్కసారైనా దర్గాను దర్శించుకుంటారు.

● పవిత్ర జలంతో ఆరోగ్యం

దర్గాలో రోజూ ఉదయం పంపిణీ చేసే పవిత్ర జలం సేవిస్తే మానసిక, శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుందని భక్తులు నమ్ముతారు. దీంతో రోజూ వందల మంది భక్తులు ఇక్కడి పవిత్ర జలాన్ని సేవిస్తుంటారు. మంచి నీటి క్యాన్లు, బిందెలలో పవిత్ర జలాన్ని నింపి రాత్రిళ్లు దర్గాలోని సమాధుల వద్ద ఉంచుతారు. అలా రాత్రి మొత్తం దర్గాలో ఉండడంతో ఆ నీటిని పవిత్ర జలంగా భావిస్తారు. దీని కోసం భక్తులు వివిధ రాష్ట్రాల నుండి ఇక్కడికి విచ్చేస్తారు.

మూడు రోజులపాటు ఉత్సవాలు

ప్రతీ ఏటా దర్గాలో గంధ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ మహోత్సవానికి పలు రాష్ట్రాల నుండే కాక, ఇతర దేశాల నుండి భక్తులు విచ్చేస్తుంటారు. ఈనెల 18వ తేదీన అర్ధ రాత్రి గంధ మహోత్సవం, 19న చిరాగా, 20న తహలీల్ ఫాతెహా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారు. వీటిని వీక్షించడానికి లక్షలాదిమంది భక్తులు విచ్చేస్తారు.

● రవాణా సౌకర్యం

ఏఎస్‌పేటకు నెల్లూరు నుండి ఉదయం 5గంటల నుండి రాత్రి 8గంటల వరకు ప్రతి గంటకూ ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. రోజూ ఏఎస్ పేట నుండి హైదారాబాదుకు సాయంత్రం 6నుండి 8 గంటలలోగా సుమారు 7 ప్రైవేటు బస్సులు నడుస్తున్నాయి. అదేవిధంగా హైదారాబాదు నుండి ఏఎస్ పేటకు పలు ప్రైవేటు బస్సులు ఉన్నాయి.

కొత్త కోడూరులో పర్యాటక ప్రాజెక్టు

- భూ సేకరణ కోసం ప్రయత్నిస్తున్నాం
- జిల్లాలో పర్యాటకాభివృద్ధికి చర్యలు
- జిల్లా పర్యాటక శాఖాధికారి ఉషశ్రీ

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 'టీపీగూడూరు మండలం కొత్త కోడూరులో పర్యాటక ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నాము. ఇందుకు అవసరమైన భూ సేకరణకు ప్రయత్నిస్తున్నాం.' అని జిల్లా పర్యాటక శాఖ జి.ఉషశ్రీ తెలిపారు. జిల్లాలో పర్యాటకాభివృద్ధికి అన్ని వనరులు ఉన్నాయని, ప్రభుత్వ ఆలోచనల మేరకు చర్యలు తీసు కుంటున్నట్లు చెప్పారు.

? జిల్లాలో పర్యాటక కేంద్రాలు ఎన్ని ఉన్నాయి

! జిల్లాలో మొత్తం 40 పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 11 బీచ్‌లు, 14 ఆధ్యాత్మిక, 2 జలపాతాలు, మరో రెండు రిజర్వాయర్లు, 3 పునరావాస్తు, ఇతరులు మరో ఎనిమిది ఉన్నాయి

? మరి వీటికి ప్రచారం ఎలా

! ఈ అంశంపైనే దశలవారీగా చర్యలు తీసుకుంటున్నాము. స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవా సంస్థలు, యూట్యూబర్లతో దశలవారీగా సమావేశాలు నిర్వహించాము. పర్యాటక కేంద్రాలను దర్శించి, వాటి అందాలను, విశిష్టతను ప్రజలకు తెలియజేయాలని కోరాం. మా ఆలోచనలన్నిటికీ సంపూర్ణంగా సహకరిస్తామని చెప్పారు. తమ ఐడీ కార్డులు, డ్రోన్లకు పర్మిషన్లు ఇప్పించాలని కోరారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటున్నాం.



ఈ ముఖాముఖి

? హోటళ్ల ద్వారా ప్రమోషన్స్ ఎలా

! జిల్లాలోని హోటళ్ల యజమానుల సంఘాలతోనూ సమావేశం నిర్వహించాము. హోటళ్లలో పర్యాటక సమాచారాన్ని ప్రదర్శించాలని కోరాం. ఇందుకు వారు కొన్ని విషయాలు మా దృష్టికి తెచ్చారు. వాటిని కూడా కలెక్టర్‌కు నివేదించాము.

? సందర్శకులకు ఇచ్చే సౌకర్యాలు ఏమిటి

! దేశ, విదేశీ యాత్రికులను ఆకర్షించే పర్యాటక ప్రదేశాలు జిల్లాలో ఎన్నో ఉన్నాయి కానీ కొన్నింటికి రవాణా సౌకర్యం లేదు. అలాంటి ప్రాంతాలను గుర్తించి, ప్రభుత్వానికి నివేదిక పంపుతాము. కొత్త కోడూరులో పర్యాటక ప్రాజెక్టు ఏర్పాటుకు ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయి. తొలుత అక్కడ భూ సేకరణకు పరిశీలించామని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు దస్త్రాలు సిద్ధం చేసి, ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తున్నాము.

మహిళా స్నేహపూర్వక పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దండి : జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీలకు సంబంధించి శిక్షణ కార్యక్రమాన్ని జడ్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ జిల్లాలో మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీ లుగా 9 పంచాయతీలు ఎంపికయ్యాయని, వాటిలో 17 అభివృద్ధి కార్యక్ర మాలు చేపట్టాలని ప్రభుత్వాలు నిర్దేశించాయని చెప్పారు. వీటిపై అధికారులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మోహన్‌రావు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇద్దరికి కారుణ్య నియామకం

జిల్లా పరిషత్‌లో విధులు నిర్వహిస్తూ మరణించిన వారి కుటుంబాల్లో ఇద్దరికి కారుణ్య నియామకాలు చేపట్టారు. గువ్వల చెంచురత్నమ్మను ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయంలో, షేక్ మహ్మమద్ సైఫ్‌ను జిల్లా పరిషత్ కార్యాలయంలో సబార్డినేట్లుగా నియమించారు. వారికి జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో మోహన్‌రావు బుధవారం జడ్పీ కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు.

భార్య కాపురానికి రాలేదని భర్త బలవన్మరణం

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భార్య పిల్లల్ని తీసుకుని కాపురానికి రావడం లేదని మనస్తాపానికి చెందిన ఓ భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని కల్లూరుపల్లి ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న కొమలపల్లి నరసింహం (35)కు పెళ్లై నలుగురు పిల్లలున్నారు. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా పుట్టింట్లోనే ఉంటోంది. కాపురానికి రావలని కోరినా ఆమె వినకపోవడంతో నరసింహం మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పక్కనే ఉంటున్న బంధువులు చూసి కేకలు వేయడంతో స్థానికులు హుటాహుటిన స్పందించినా అప్పటికే నరసింహం మరణించాడని, అతని చెల్లి అంజలి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని నెల్లూరు రూరల్ సీఐ వేణు తెలిపారు.

కమీషన్ ఇవ్వలేదనే మాలేపాటి నిందలు

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి

దగదర్తి(బిట్రగుంట), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కమీషన్లు ఇవ్వలేదనే దురుద్దేశంతోనే రాష్ట్ర ఆగ్రో డెవలప్‌మెంట్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు అభివృద్ధి పనులను అడ్డుకుంటూ నిందలు వేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి పేర్కొన్నారు. దగదర్తి మండలంలోని డీఆర్ చానల్ పనులు నాసిరకంగా ఉన్నాయని ఇటీవల మాలేపాటి విమర్శించడంపై స్పందించిన పమిడి బుధవారం స్థానిక రైతులు, నేతలతో కలిసి ఆప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దగదర్తి-బుచ్చి రోడ్డులో నిర్మించిన బ్రిడ్జికి డీఆర్ చానల్‌కి ఏమి సంబంధం ఉందో కూడా తెలియకుండా మాలేపాటి విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. బ్రిడ్జికి స్లాబ్ వేసేందుకు సెంట్రిగ్ సపోర్టుల కింద పెట్టిన సిమెంట్ పెచ్చులను చూపించి నాసిరకం పనులనడం హాస్యాస్పదం అన్నారు. కాంట్రాక్టర్‌ను కోటి యాభై లక్షల రూపాలయలు కమీషన్ అడిగింది నిజం కాదా అది ప్రశ్నించారు. డీఆర్ చానల్‌ను కాపాడమని కోరే మాలేపాటి కాలువ శివాయి భూమిని ఆక్రమించిన విషయాన్ని ప్రశ్నించారు. కావలి ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డికి చెడ్డ పేరు తీసుకొచ్చేందుకు మాలేపాటి సుబ్బానాయుడు వైసీపీ నేతలతో చీకటి కాపురం చేయడం మానుకోవాలని తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ అల్లం హనుమంతరావు, నెల్లూరు పార్లమెంటరీ రైతు ప్రధాన కార్యదర్శి జలదంకి శ్రీహరిలు మాలేపాటి తీరును తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో తలమంచి కెనాల్ నీటి సంఘం అధ్యక్షుడు శీనయ్య, నాయకులు గున్నం హరికిశోర్‌రెడ్డి, వడ్డే వెంకటేశ్వర్లు నాయుడు, పాపన మల్లికార్జునరెడ్డి, బత్తుల హజరత్తయ్య, డమ్ము రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



రైతులతో కలిసి డీఆర్ చానల్‌ను పరిశీలిస్తున్న పమిడి రవికుమార్‌చౌదరి

విద్యుత్ ప్రమాదాలను అరికట్టండి

- అధికారులు సోలార్ ఏర్పాటు చేసుకోవాలి
- ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య



నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతో పాటు, విద్యుత్ ప్రమాదాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని స్కాడా కార్యాలయంలో బుధవా రం రూరల్ డివిజనల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు, సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. డివిజన్‌లోని అధికారులంతా వారి ఇళ్లకు ఈనెల 30లోపు సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ విజయన్, సీనియర్ గణాంక అధికారి మురళి, డీఈఈలు ప్రభాకర్, రాము, సుబ్రహ్మణ్యం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'రేషన్' అక్రమ రవాణాకు రంగం సిద్ధం

- 200 బియ్యం బస్తాల స్వాధీనం
- ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'

అనంతసాగరం సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సినీ ఫక్కీలో అధికారులే అవాక్కయ్యేలా కొందరు అక్రమార్కులు రేషన్ అక్రమ రవాణాకు సర్వం సిద్ధం చేశారు. రహస్యంగా నిల్వ ఉంచిన సుమారు 200 రేషన్ బియ్యం బస్తాలను సాగరం అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఇనగలూరు వద్ద పంటపొలాల్లోని ఓ ఇంట్లోను, ట్రాక్టర్ ట్రక్కులో, మరో చోట అక్రమంగా బియ్యం నిల్వ చేసినట్లు గుర్తించారు. వివిధ చౌక దుకాణాల నుంచి బియ్యాన్ని సేకరించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. దీంతో ఈ విషయం చర్చనీయాశంగా మారింది. స్థానికుల సమాచారంతో తహసీల్దారు జయవర్ధన్ సిబ్బందితో అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. మూడు చోట్ల నిల్వ చేసిన బస్తాలను ఎస్‌ఐ సూర్యప్రకాష్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ అధికారుల ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకొన్నారు. వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అయితే ఆ ప్రాంతంలో ఎవరూ కనిపించక పోవడంతో రేషన్ సూత్రధారులు ఎవరనే అంశంపై విచారిస్తున్నామని.. చట్టపరంగా చర్యలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.



అధికారులు పట్టుకొన్న రేషన్ బియ్యం బస్తాలు

ముందే చెప్పిన ఆంధ్రజ్యోతి

సాగరం కేంద్రంగా గత కొంత కాలంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు 'ఆంధ్రజ్యోతి' ముందే వెల్లడించింది. వెంగంపల్లికి చెందిన కొందరు, పలువురు డీలర్లు మాఫియాగా ఏర్పాడి అక్రమార్జనకు పాల్పడుతున్న వైనంపై 'రెచ్చిపోతున్న రేషన్ మాఫియా' శీర్షికన గత నెల 11న ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతో అధికారులు అప్ర మత్తమ య్యారు. భారీస్థాయిలో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు రాజకీయ ప్రలోభాలు, అవినీతికి పాల్పడకుండా సూత్రధా రులపై చట్టపరంగా చర్యలు తీసుకుని, రేషన్ మాఫి యాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.


రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

అక్రమ రవాణాపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

మూడు ఆలయాల్లో చోరీ

- నగదు, బంగారం అపహరణ

కలిగిరి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు ఆలయాల్లో మంగళవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. హుండీలను పగలగొట్టి అందులోని నగదు, స్వామి, అమ్మవార్ల బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. బుధవారం ఉదయం గుర్తించిన స్థానికులు, పూజారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. మండలంలోని నాగసముద్రం పంచాయతీ అంబటివారిపాలెంలో ఉన్న రామాలయం, వినాయక స్వామి ఆలయాల్లో, నాగిరెడ్డిపాలెంలోని రామాలయంలో తలుపులు పగలగొట్టి చోరీకి పాల్పడిన దుండగులు హుండీలు పగలగొట్టి నగదు, సుమారు లక్ష రూపాలయ విలువైన నాలుగు తాళి బొట్లను అపహరించుకెళ్లారు. ఒక్కో హుండీలో సుమారు రూ.10వేలకు పైగా నగదు ఉండవచ్చని స్థానికులు పేర్కొన్నారు. అంబటివారిపాలెం శివార్లలో ఉన్న పొలిమేర గంగిరెడ్డి ఇంటి తలుపులు పగుకొట్టి చోరీకి యత్నించగా ప్రస్తుతం ఆ ఇంట్లో ఎవరూ కాపురం లేకపోవడతో అక్కడ వారికి ఏమీ లభ్యం కాలేదు. సమాచారం అందుకున్న పోలీ సులు, క్లూస్‌టీం సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని వేలిముద్రలు, వివరాలు సేకరించారు. కేసు నమోదుచేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ ఉమాశంకర్ తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాల ర్‌షిప్ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథ మికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదు వుతూ కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలలోపు ఉన్న విద్యార్థులందరూ ఈ పరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. దరఖాస్తుకు ఎలాంటి ధ్రువపత్రాలు అవసరం లేకున్నా పరీక్ష రాసే సమయా నికి మాత్రం అన్నీ ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలని సూచిం చారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్‌సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 చొప్పున ఆన్‌లైన్ అప్లికే షన్‌లో ఇవ్వబడిన ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా మాత్రమే ఫీజు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌నుగానీ విద్యాశాఖ కార్యాలయంలోని పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్‌ను సంప్రదించాలని కోరారు.

క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయండి

- ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి



మాట్లాడుతున్న అదనపు జిల్లా వైద్యాధికారి ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా అనుమానితులకు క్షయ నిర్ధారణ పరీక్షలు చేయా లని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశించారు. బుధవా రం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్ల సమావే శం జరిగింది. ఆయన మాట్లాడుతూ 60 ఏళ్ల పైబడిన వారు. ఐదేళ్ల క్రితం క్షయ వచ్చిన వారు, వారితో కలిసి ఉన్న వారికి పరీక్షలు చేయాలని సూచిం చారు. అలాగే, మధుమేహం, ధూమపానం, పోషకాహార లోపం, హెచ్‌ఐవీతో బాధపడేవారికి తప్పనిసరిగా క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ రక్త నమూనాలు సేకరించి సరైన ఫలితాలను సకాలంలో అందచేయాలన్నారు. సబ్ యూనిట్ అధికారి జయరామ్ మాట్లాడుతూ వారాంతపు, మాసాంతపు రికార్డులను సకాలంలో అందచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా విభాగం సిబ్బంది కూడా పాల్గొన్నారు.

బోధనలో వినూత్న మార్పులు

- హ్యాండ్‌బుక్‌తో సత్ఫలితాలు
- విద్యాలక్ష్యాల సాధనకు ఎంతో ఉపయుక్తం

ప్రభుత్వం పాఠశాల విద్యపై దృష్టిపెట్టింది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సులభంగా విద్యా లక్ష్యాలు సాధించేలా, విద్యార్థుల్లో అవగాహన కలిగించేందుకు నూతనంగా ప్రవేశపెట్టిన టీచర్స్ హ్యాండ్‌బుక్ ఎంతో చక్కగా ఉపయోగపడుతోంది. ఎన్‌సీఈఆర్‌టీ సహకారంతో సమగ్రశిక్ష అభియాన్ ఉపాధ్యాయులకు వనరులను అందించేందుకు వీలుగా హ్యాండ్‌బుక్‌ను తీర్చిదిద్దినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. సబ్జెక్టుల వారీగా హ్యాండ్‌బుక్కుల్లో శిక్షణను పొందుపరిచారు. 1 నుంచి 10వతరగతి వరకు అన్నీ సబ్జెక్టులకూ హ్యాండ్‌బుక్కులను ప్రభుత్వం తయారుచేసి పాఠశాలలకు పంపిణీ చేసింది. - కోవూరు, (ఆంధ్రజ్యోతి)



పాఠ్యాంశాలను బోధిస్తున్న ఉపాధ్యాయిని

విద్యాసంవత్సరం ఆధారంగా సమగ్రశిక్ష అభియాన్ ఒకటి నుంచి పదోతరగతి వరకూ విద్యా క్యాలెండర్‌ను తయారు చేసింది. ఎప్పుడు ఏపాఠం బోధించాలో అందులో వివరించారు. రాష్ట్రంలోని అన్నీ పాఠశాలల్లో ఒకే పాఠాన్ని బోధించేలా క్యాలెండర్‌ను తయారుచేశారు. ఉపాధ్యాయులు తాము బోధించే పాఠ్యాంశాన్ని ముందుగా ఇతర ఉపాధ్యాయులతో చర్చించే అవకాశం ఉన్నట్లు పలువురు టీచర్లు తెలిపారు.

● విద్యావ్యవస్థను గాడిలో పెట్టేలా..

జిల్లాలో సుమారు 2.5లక్షల మంది విద్యార్థులు 1 నుంచి 10వతరగతి వరకూ చదువుతున్నారు. వారికి పాఠ్యాంశాలను బోధించేందుకు సుమారు 10వేల మంది ఉపాధ్యాయులకు ప్రభుత్వం జీతాలు చెల్లిస్తోంది. వైసీపీ ప్రభుత్వ పాలనలో దెబ్బతిన్న విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ తనదైన శైలిలో మార్పులకు శ్రీకారం చుట్టారు. అం దులో భాగంగా తల్లికివందనం, మోడల్ ప్రైమరీ పాఠశాలలు, ఉపాధ్యాయులకు బోధనా కరదీపికలు (హ్యాండ్‌బుక్)లను అందించారు.

జిల్లాలో పాఠశాలల వివరాలు

జడ్పీ ఉన్నత పాఠశాలలు	: 428
ప్రాథమికోన్నత పాఠశాలలు	: 329
ప్రాథమిక పాఠశాలలు	: 2,419

హ్యాండ్‌బుక్ చక్కగా ఉపయోగపడుతోంది..



ఉపాధ్యాయులకు హ్యాండ్‌బుక్ చక్కగా ఉపయోగపడుతోంది. బోధనను సులువుగా, లక్ష్యాలను సాధించేందుకు ఇందులో పొందుపరిచి ఉన్నారు. దీని వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతోంది. హ్యాం డ్‌బుక్ ఆధారంగా ఉపాధ్యాయులు చక్కగా బోధిస్తున్నారు.

- విమలకుమారి, హెచ్‌ఎం. గుమ్మళ్లదిబ్బ మోడల్ ప్రాథమిక పాఠశాల